మంగళవారం
08-11-2022
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 136
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

శత్రువులు కాలుదువ్వితే ప్రతిఘటిస్తాం

అణుసామర్థ్యం గల వాటితో సహా రకరకాల క్షిపణులతో వైమానిక స్థావరాలు, ఆపరేషన్ కమాండ్ వ్యవస్థల వంటి కీలక దక్షిణకొరియా, అమెరికా లక్ష్యాలపై "నిర్దాక్షిణ్య" దాడికి ఆచరణలే ఇటీవల జరిపిన పలుక్షిపణి ప్రయోగాలని ఉత్తరకొరియా సైన్యం సోమవారం వెల్లడించింది.

2లో

ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు సబబే

- రాజ్యాంగ ప్రాథమిక నిర్మాణాన్ని ఉల్లంఘించవు
- సమర్థించిన సుప్రీం కోర్టు

న్యూదిల్లీ : అగ్రవర్ణాల్లో ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు (ఈడబ్ల్యూఎస్) రిజర్వేషన్లను సుప్రీం కోర్టు సమర్థించింది. విద్యా సంస్థల్లో ప్రవేశాలు, ప్రభుత్వ ఉద్యోగాలలో ఆర్థికంగా బలహీన వర్గాలకు (ఈడబ్ల్యూఎస్) చెందిన ప్రజలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించే 103వ రాజ్యాంగ సవరణ చెల్లుబాటును 3:2 మెజారిటీతో సుప్రీం కోర్టు సోమవారం ఒక మైలురాయి తీర్పులో సమర్థించింది దీనిపై విచారణను ముగించిన ధర్మాసనం తుది తీర్పు వెలువరిస్తూ, ఈ కోటా రాజ్యాంగ ప్రాథమిక నిర్మాణాన్ని ఉల్లంఘించదని పేర్కొంది. 2019లో కేంద్రం ప్రకటించిన 103వ రాజ్యాంగ సవరణ చెల్లుబాటును సవాలు చేస్తూ దాఖలయిన 40 పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి యు.యు.లలిత్ నేతృత్వంలోని ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం నాలుగు వేర్వేరు తీర్పులను వెలువరించింది. న్యాయమూర్తులు దినేష్ మహేశ్వరి, బేల ఎం త్రివేది, జేబీ పార్దీవాలా చట్టాన్ని సమర్థించగా, సీజేఐ యు.యు.లలిత్‌తో పాటు మరో న్యాయమూర్తి జస్టిస్ ఎస్.రవీంద్ర దానిని వ్యతిరేకించారు. న్యాయమూర్తులు నాలుగు వేర్వేరు తీర్పులను కోర్టు హాలులో 35 నిమిషాలకు పైగా చదివారు. ఈ తీర్పును చదివిన న్యాయమూర్తి జస్టిస్ మహేశ్వరి, 103వ రాజ్యాంగ సవరణ రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని ఉల్లంఘించేలా లేదని అన్నారు. రిజర్వేషన్ అనేది సమతా సమాజం లక్ష్యాల వైపు అందరినీ కలుపుకొని నడిచేటటువంటి

- మిగతా 2 లో

ఉత్తరాంధ్ర అభివృద్ధి బూటకం

మోదీ పర్యటనపై వైసీపీ, బీజేపీ నాటకం

- వేలకోట్ల పనులకు ప్రారంభమంటూ ప్రచారం
- శంకుస్థాపనల్లో రైల్వేజోన్ ఉందా?
- భోగాపురం విమానాశ్రయమూ పెండింగే
- నిరసనలకు సీపీఐ, విశాఖ ఉక్కు కార్మికుల సన్నద్ధం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఉత్తరాంధ్ర అభివృద్ధి పేరుతో ప్రధాని మోదీ విశాఖలో అడుగుపెట్టబోతున్నారు. రాష్ట్ర విభజన హామీలు అమలు చేయకుండా ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలకు మోదీ సిద్ధమయ్యారు. మోదీ పర్యటనపై వైసీపీ, బీజేపీ హడావుడీ చేస్తున్నాయి. రాష్ట్రానికి అన్యాయం చేసిన మోదీకి జగన్ ప్రభుత్వం భారీగా స్వాగత

- మిగతా 2 లో

ప్రతీకార రాజకీయాల్లోకి

కోర్టులను లాగొద్దు

జగన్ సర్కార్‌కు సుప్రీం ఘాటు చురక

- నారాయణ ముందస్తు బెయిల్ రద్దుకు నిరాకరణ
- దర్యాప్తుకు సహకరించకపోతే ఆశ్రయించవచ్చని సూచన

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: మాజీమంత్రి పొంగూరు నారాయణకు హైకోర్టు మంజూరు చేసిన ముందస్తు బెయిల్‌ను రద్దు చేసేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. నారాయణ బెయిల్‌ను రద్దు చేయాలంటూ ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం సోమవారం కొట్టివేసింది. ఈ సందర్భంగా ఏపీ ప్రభుత్వంపై సుప్రీంకోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. ప్రతి చిన్న విషయానికీ సుప్రీంకోర్టు తలుపు తడితే ఎలా? అంటూ ఏపీ ప్రభుత్వంపై ఆగ్రహం వెలిబుచ్చింది. 'మీ రాజకీయ ప్రతీకారంలో కోర్టులను భాగస్వాములను చేయొద్దు' అని ఏపీ సర్కారుపై ఘాటు వ్యాఖ్యలు చేసింది. ఏపీ రాజధాని అమరావతి పరిధిలో నిర్మించతలపెట్టిన ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను మంత్రి హోదాలో నారాయణ ఉద్దేశపూర్వకంగా మార్చారని, తన వారికి మేలు చేసేందుకే ఆయన ఈ పని చేశారంటూ సీఐడీ ఓ కేసు నమోదు చేసింది.

ఈ కేసులో సీఐడీ అధికారులు చర్యలు మొదలుపెట్టకముందే నారాయణ హైకోర్టును ఆశ్రయించారు. వైద్య చికిత్సల నిమిత్తం విదేశాలకు వెళ్లాల్సి ఉందని, అందువల్ల అమరావతి కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని ఆయన హైకోర్టును కోరగా కోర్టు అందుకు సానుకూలంగా స్పందించి ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. అయితే నారాయణకు హైకోర్టు మంజూరు చేసిన ముందస్తు బెయిల్‌ను రద్దు చేయాలంటూ ఏపీ ప్రభుత్వం ఇటీవల సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. విచారణ సందర్భంగా ఏపీ వాదనను తిరస్కరించిన సుప్రీంకోర్టు నారాయణ ముందస్తు బెయిల్‌ను రద్దు చేయడానికి నిరాకరిస్తూ, కేసు దర్యాప్తునకు నారాయణ సహకరించని పక్షంలో తమను ఆశ్రయించవచ్చని సుప్రీం సూచించింది.

ఆహార భద్రతకు ముప్పు

- 35 కోట్లమంది రైతుల హెచ్చరిక
- ప్రపంచ నాయకులకు బహిరంగ లేఖ

న్యూఢిల్లీ : చిన్న తరహా ఉత్పత్తి, మరింత భిన్నమైన, తక్కువ - ఉత్పాదకాల వ్యవసాయానికి మారడాన్ని పెంపొందించటానికి ద్రవ్య అనుసరణను ప్రభుత్వాలు వృద్ధి చేయనట్లయితే, ప్రపంచ ఆహార భద్రత ప్రమాదంలో పడుతుందని హెచ్చరిస్తూ 35 కోట్ల మంది రైతులు, ఉత్పత్తిదారులకు ప్రాతినిధ్యం వహించే సంఘాలు ప్రపంచ నాయకులకు ఒక బహిరంగలేఖ రాశాయి. ఈజిప్టులో జరుగుతున్న ఐక్యరాజ్యసమితి వాతావరణ మార్పు శిఖరాగ్ర సదస్సులో ఆహార భద్రత, వాతావరణ పరిరక్షణకు ఆర్థికం పెంపుదల పై దేశాలధినేతలు చర్చిస్తారు.

ప్రధానంగా పారిశ్రామిక వ్యవసాయం నుండి వచ్చే 34శాతం ఉద్గారాల బాధ్యత అయినప్పటికీ, ఆహారం, వ్యవసాయం పెద్దగా ఉపేక్షించబడ్డాయి. ఐదు ఖండాలలోని 35కోట్ల మంది రైతులకు ప్రాతినిధ్యం వహించే ప్రపంచ గ్రామీణ ఫోరం, ఖండంలోని 2 కోట్లమంది చిన్న తరహా ఉత్పత్తి దారులకు ప్రాతినిధ్యం వహించే ఆఫ్రికాలోని అలయన్స్ ఫర్ ఫుడ్ సావరినిటీ, కోటి 30 లక్షల మంది ప్రాతినిధ్యం వహించే, స్థిరమైన అభివృద్ధికి ఆసియన్ ఫార్మర్స్ అసోసియేషన్‌తో సహా, రైతులు, మత్స్యకార, పశుపెంపకం, అటవీ ఉత్పత్తిదారులకు ప్రాతినిధ్యం వహించే 70కి పైగా సంస్థలు బహిరంగ లేఖపై సంతకాలు చేశారు. జోర్డాన్ నుండి బ్రిటన్, భారతదేశ సంఘాలు కూడా లేఖపై సంతకాలు చేశాయి.

"ఉష్ణోగ్రతను 1.5డిగ్రీల సెల్సియస్‌కు పరిమితం చేసినప్పటికీ వాతావరణమార్పు ప్రభావాలను ఎదుర్కోడానికి ప్రపంచ ఆహార వ్యవస్థ వద్ద సరైన యంత్రాంగం లేదు." అని బహిరంగలేఖ హెచ్చరించింది. భూమండలంపై ప్రపంచ జనాభా ఆకలి తీర్చడానికి ఆహార వ్యవస్థ నిర్మాణానికి" కాప్-27 సదస్సు ప్రాధాన్యత నివ్వాలని లేఖలో పేర్కొన్నారు.

ఆసియా, ఆఫ్రికా సబ్-సహారా వంటి ప్రాంతాలలో వినియోగించే 80శాతం ఆహారాన్ని ఉత్పత్తి చేస్తున్న చిన్నతరహా ఉత్పత్తిదారులు ప్రపంచ ఆహారభద్రతపై ఆందోళనలో వున్నారు. అయినప్పటికీ, 2018లో 1.7శాతం మాత్రమే ఆహార ద్రవ్య పెట్టుబడులు లభించాయి. (అంటే వెయ్యికోట్ల దాలర్లు మాత్రమే). 2021 లో గ్లాస్గోలో జరిగిన కాప్-26 సదస్సులో 4వేలకోట్ల దాలర్లు ఆర్థిక సహాయం చేయడానికి సంపన్న దేశాలు అంగీకరించాయి కానీ, అందులో కొంత స్వల్పంగా మాత్రమే వారందించారు.

మూడు సంక్లిష్ట రంగాలపై దృష్టి కేంద్రీకరణ

పారిస్ ఒప్పందం సంపూర్ణంగా అమలు జరిగేటట్లు చూసే కీలక లక్ష్యంతో ఐక్యరాజ్యసమితి వాతావరణ సదస్సు 'కాప్ 27' సోమవారం ప్రారంభమైంది. వినాశకర వరదలు, మునుపెన్నడూ లేని వడగాలులు, తీవ్ర దుర్భిక్షాలు, పెను తుపానులను చవి చూసిన ఈ ఏడాది ముగింపు సమీపిస్తున్న తరుణంలో కాప్-27 చర్చలు ప్రారంభమయ్యాయి.

2 లో

ఎయిమ్స్‌లోనూ

ఆరోగ్యశ్రీ

ఆస్పత్రి అధికారులతో మంత్రి రజిని ప్రత్యేక భేటీ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : ఎయిమ్స్‌ను వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పరిధిలోకి తీసుకురాబోతున్నామని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ, వైద్యారోగ్య మంత్రి విడదల రజిని తెలిపారు. మంగళగిరిలోని అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ(ఎయిమ్స్)ను సోమవారం ఆమె అధికారులతో కలిసి సందర్శించారు. ఆస్పత్రిలో అందుతున్న వైద్య సేవలపై రోగులతో ప్రత్యేకంగా మాట్లాడారు. అన్ని విభాగాల్లోనూ మంత్రి కలియ తిరిగారు. వైద్య పరికరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ఎయిమ్స్ అధికారులు, సిబ్బందితో కాన్ఫరెన్సు హాలులో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. తర్వాత మంత్రి మీడియాతో మాట్లాడుతూ... అతి త్వరలోనే ఇక్కడ ఆరోగ్యశ్రీ సేవలు అందుబాటులో కొస్తాయని చెప్పారు. పేద ప్రజలంతా ఈ అవకాశాన్ని

- మిగతా 2 లో

బీఆర్‌ఎస్ పేరుమార్పుపై

టీఆర్‌ఎస్ పబ్లిక్ నోటీస్

విశాలాంధ్ర-హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ పేరును భారత్ రాష్ట్ర సమితిగా మార్చాలని ప్రతిపాదిస్తూ సోమవారం టీఆర్‌ఎస్ పార్టీ బహిరంగ ప్రకటనను జారీ చేసింది. దసరా పర్వదినం రోజున తెలం గాణ ముఖ్యమంత్రి, టీఆర్‌ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు పార్టీని బీఆర్‌ఎస్‌గా మారు స్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు పార్టీ సర్వసభ్య సమావేశంలో తీర్మానం చేసి.. కాపీని ఎన్నికల సంఘానికి సైతం అందజేశారు. ఈ క్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ పేరుపై ఏవైనా అభ్యంతరాలుంటే నెల రోజుల్లోపు సెక్రెటరీ (పొలిటికల్ పార్టీ), ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా, నిర్వచన్ సదన్, అశోకా రోడ్, న్యూదిల్లీ అడ్రస్‌కు కారణాలతో సహా అభ్యంతరాలను పంపాలని పబ్లిక్ నోటీసులో పేర్కొన్నారు.

మిల్లర్ల దోపిడీ నుంచి

కాపాడండి

- పార్వతీపురంలో రైతుల ప్రదర్శన
- ప్రభుత్వ విధానాలతో సంక్షోభంలోకి వ్యవసాయం: కేవీవీ ప్రసాద్

2లో

రైతుల నుంచి ప్రభుత్వమే నేరుగా ధాన్యం కొనుగోలు చేయాలనీ, రైస్ మిల్లర్ల దోపిడీ నుంచి రైతులను కాపాడాలని, కనీస మద్దతు ధరల చట్టం చేయాలనీ, ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన జీడిపంటకు పరిహారం ఇచ్చి గిరిజనరైతులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అధ్వర్యాన సోమవారం పార్వతీపురం మన్యం జిల్లాలో రైతులు ప్రదర్శన నిర్వహించారు.

ఇదీ లోకం!

కేరళ గవర్నరు రంకెలు

- ఎల్‌డీఎఫ్ సర్కారుపై ఎదురుదాడి
- ఆశ్రితపక్షపాతమంటూ అక్కసు
- ఓ వర్గం మీడియాపైనా అనుచిత వ్యాఖ్యలు



కొచ్చి: కేరళలోని వామపక్ష ప్రభుత్వంపై గవర్నరు ఆరిఫ్ మొహమ్మద్ ఖాన్ తరచూ అక్కసు వెళ్లగక్కుతున్నారు. ప్రజాప్రభుత్వంపై తన ఆధిపత్య ధోరణిని పదేపదే ప్రదర్శిస్తున్నారు. అనేక అంశాలపై రాష్ట్ర ప్రభుత్వంతో తరచూ ఘర్షణకు దిగుతున్న గవర్నరు...తాజాగా సోమవారం సీపీఎం పాలనలో కేరళలో ఆశ్రిత పక్షపాత వ్యవస్థ కొనసాగుతోందని నోటి దురుసు ప్రదర్శించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగాల్లో నియమించిన ఘటనలే ఇందుకు నిదర్శనమని గగ్గోలు పెడుతున్నారు. వైస్ చాన్సలర్ల నియామకం సహా అనేక అంశాలపై రాజ్‌భవన్, వామపక్ష ప్రభుత్వం మధ్య వివాదం కొనసాగుతోంది. తీవ్ర పరిణామాలు ఎదుర్కొంటావంటూ వామపక్ష పార్టీల కార్యకర్తల నుంచి తనకు బెదిరింపులు వస్తున్నాయని గవర్నరు చెప్పుకుంటున్నారు. కొచ్చిలో సోమవారం ఒకవర్గం మీడియాతో గవర్నరు పిచ్చాపాటిగా మాట్లాడారు. ముఖ్యమంత్రి పినరయి విజయన్‌ను రాజకీయంగా విమర్శించారు. ఓ హత్య కేసు నిందితుడిని పోలీసు

- మిగతా 2 లో

మోదీ సర్కారును గద్దె దించుదాం

అక్టోబరు విప్లవం వార్షికోత్సవంలో అమర్‌జిత్ కౌర్ పిలుపు

న్యూదిల్లీ: భారత్‌ను ఫాసిజం దిశగా తీసుకెళుతున్న మోదీ సర్కారును 2024 ఎన్నికల్లో గద్దె దించాలని సీపీఐ జాతీయ కార్యదర్శి అమర్‌జిత్ కౌర్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఇటీవల ముగిసిన సీపీఐ 24వ జాతీయ మహాసభలు ఈ మేరకు నిర్ణయించాయని గుర్తుచేశారు. మహత్తర అక్టోబరు సోషలిస్టు విప్లవం ప్రపంచానికి దిక్సూచిగా నిలిచిందని కౌర్ చెప్పారు. ఈ విప్లవం ప్రపంచంలోనే ప్రప్రథమ సోషలిస్టు దేశం రష్యా ఆవిర్భావానికి దోహదపడిందని పేర్కొన్నారు. నేటికీ అది ప్రపంచానికి మార్గనిర్దేశకంగా నిలిచిందన్నారు. మహత్తర అక్టోబరు సోషలిస్టు విప్లవం విజయవంతమై 105 యేళ్లు పూర్తయిన సందర్భంగా దిల్లీలోని

- మిగతా 2 లో

శత్రువులు కాలుదువ్వితే ప్రతిఘటిస్తాం: ఉత్తరకొరియా

ప్యొంగ్ యాంగ్ : అణుసామర్థ్యం గల వాటితో సహా రకరకాల క్షిపణులతో వైమానిక స్థావరాలు, ఆపరేషన్ కమాండ్ వ్యవస్థల వంటి కీలక దక్షిణకొరియా, అమెరికా లక్ష్యాలపై "నిర్దాక్షిణ్య" దాడికి ఆచరణలే ఇటీవల జరిపిన పలుక్షిపణి ప్రయోగాలని ఉత్తరకొరియా సైన్యం సోమవారం వెల్లడించింది. ఉత్తరకొరియా ఇటీవల డజన్ల కొద్ది క్షిపణుల పరీక్షలు నిర్వహించింది. గతవారం సముద్ర తీరం వైపు యుద్ధ విమానాలు సంచరించాయి. దురాక్రమణకు రిహార్సల్స్‌గా ఉత్తరకొరియా అభిప్రాయపడిన అమెరికా, దక్షిణకొరియా భారీ వైమానిక దళ విన్యాసాలకు నిరసనగా, కొన్ని దక్షిణకొరియా, జపాన్ ప్రాంతాల నుండి తరలింపు అలర్టులు ప్రకటించారు.

తమ సంయుక్త శిక్షణ విన్యాసాలు మరింత పెంపొందిస్తామని అమెరికా, దక్షిణకొరియా అధికారులు ప్రతిస్పందించారు. అణ్వాయుధాలు ఉపయోగిస్తే అది కిమ్‌జాంగ్‌ఉన్ ప్రభుత్వ అంతమేనని కూడా వారు ఉత్తరకొరియాను హెచ్చరించారు. రెచ్చగొట్టే సైనిక చర్యలకు శత్రువులు పాల్పడినట్లయితే, కొరియా పీపుల్స్ ఆర్మీ (కేపీఏ) వాటిని నిర్దాక్షిణ్యంగా ప్రతిఘటిస్తామని, ఇటీవల నిర్వహించిన సైనిక కార్యకలాపాల ఉద్దేశం అదేనని ఉత్తరకొరియా సైనిక జనరల్ స్టాఫ్ ఒక ప్రకటనలో పేర్కొంది. ప్రభుత్వ మీడియాలో ఆ ప్రకటన ప్రసారమైంది.

మూడు సంక్లిష్ట రంగాలపై దృష్టి కేంద్రీకరణ

కాప్ 27 సదస్సులో ప్రభుత్వాలకు సైమన్ స్టీల్ విజ్ఞప్తి

షర్మ్ ఎల్-షేక్ (ఈజిప్టు) : పారిస్ ఒప్పందం సంపూర్ణంగా అమలు జరిగేటట్లు చూసే కీలక లక్ష్యంతో ఐక్యరాజ్యసమితి వాతావరణ సదస్సు 'కాప్ 27' సోమవారం ప్రారంభమైంది. వినాశకర వరదలు, మునుపెన్నడూ లేని వడగాలులు, తీవ్ర దుర్భిక్షాలు, పెను తుపానులను చవి చూసిన ఈ ఏడాది ముగింపు సమీపిస్తున్న తరుణంలో కాప్-27 చర్చలు ప్రారంభమయ్యాయి. అదే సమయంలో ఇంధనం, ఆహారం, నీరు, జీవన వ్యయం పెరుగుదల, భౌగోళిక రాజకీయ సంఘర్షణలు, ఉద్రిక్తతలు పెరగడంతో వాటి ప్రభావాలను ప్రపంచ వ్యాపితంగా లక్షలాది ప్రజలు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో కొన్ని దేశాలు వాతావరణ విధానాలను నిలుపుదల చేసే లేదా తలక్రిందులు చేసే ప్రయత్నాలను ప్రారంభించాయి. శిలాజ ఇంధన వినియోగాన్ని బాగా తగ్గించి వేశాయి.

గ్రీన్ హౌస్ ఉద్గారాలను అదుపు చేయాలన్న నిబద్ధత కొరవడిన ఆకాంక్ష నేపథ్యంలో కూడా కాప్-27 సదస్సు జరుగుతోంది. ఉష్ణోగ్రత పెరుగుదలను ఈ శతాబ్దం చివరినాటికి 1.5 డిగ్రీల సెల్సియస్‌కు పరిమితం చేయాలన్న కేంద్ర పారిస్ ఒప్పంద లక్ష్యాన్ని నెరవేర్చేందుకు 2030 నాటికి కర్బన్ ఉద్గారాలను 45శాతం తగ్గించాల్సిన అవసరముందని వాతావరణంపై ఐరాస అంతర్ ప్రభుత్వ పేనల్ తెలిపింది. మరింత తరచుగా తీవ్ర దుర్భిక్షాలు, వడగాలులు, వర్షపాతంతో సహా వాతావరణ మార్పు దుష్ప్రభావాలను నివారించేందుకు ఇది కీలకమని పేనల్ పేర్కొంది. అయితే, కొన్ని దేశాలు గ్రీన్‌హౌస్ ఉద్గారాలను తగ్గిస్తున్నాయి. కాగా, ఈ శతాబ్దాంతానికి ప్రపంచ ఉష్ణోగ్రత పెరుగుదలను 1.5 డిగ్రీల సెల్షియస్‌కు పరిమితం చేయడానికి ఆ ప్రయత్నాలు తగినంతగా ఉండటం లేదని కాప్ 27 సదస్సుకు ముందు ఐరాస వాతావరణ మార్పు ప్రచురించిన నివేదిక తెలిపింది. గ్లాస్గోలో జరిగిన కాప్ 26 సదస్సు నాటినుండి 194 దేశాలకుగాను 29 దేశాలు మాత్రమే కఠినమైన జాతీయ ప్రణాళికలతో ముందుకు వచ్చాయని నివేదిక వెల్లడించింది.

వాతావరణ సంక్షోభం నివారణకు ప్రతి ఒక్కరు, ప్రతిరోజు, ప్రపంచంలో ప్రతిచోటా సాధ్యమైన మేరకు కృషి చేయాల్సిన అవసరం ఉందని ఐరాస వాతావరణ మార్పు ఎగ్జిక్యూటివ్ కార్యదర్శి సైమన్ స్టీల్ ఉద్ఘాటించారు. "కాప్ 27 నూతనశకం అమలుకు నూతన మార్గదర్శనాన్ని నిర్దేశించింది.

వాతావరణ ప్రగతికి, ఆ ప్రగతి జవాబుదారీత నానికి ప్రేరణ శక్తిగా మరింత సన్నిహితం కావడం వాస్తవంగా మొదలు అయ్యేందుకు లాంఛన, అనధికార ప్రక్రియ నుండి ఫలితాలు లభిస్తాయి" అని స్టీల్ అన్నారు. మూడు సంక్లిష్ట రంగాలలో ప్రభుత్వాలు దృష్టి కేంద్రీకరించాలని కాప్ 27 ప్రారంభోపన్యాసంలో స్టీల్ కోరారు. మొదటి ప్యారిస్ ఒప్పందం అమలులో పరివర్తనాత్మక మార్పు, చర్చలను నిర్దిష్ట కార్యాచరణలో పెట్టడం. రెండవది, తగ్గించటం, రూపాంతరీకరించటం, ద్రవ్యం, నష్టాల సంక్లిష్ట కార్య ప్రవంతులపై ప్రగతిని పటిష్టవంతం చేయటం. వాతావరణ మార్పు ప్రభావాలను ఎదుర్కొనేందుకు ఆర్థిక సహాయాన్ని పెంపొందించటం.

మూడవది, ఐరాస వాతావరణ మార్పు ప్రక్రియలో పారదర్శకత, జవాబుదారీతనం, సూత్రాల రక్షణను పెంపొందించటం.

కాప్ 27 అధ్యక్ష దృష్టి మానవ అవసరాల ఆధారితమైనది. కాప్ 27 సదస్సుకు 120 దేశాల నేతలు, 40వేలమందికి పైగా ప్రతినిధులు హాజరయ్యారు.

రెవెన్యూ లోటు
14 రాష్ట్రాలకు రూ.7,183 కోట్లు

న్యూఢిల్లీ : పదిహేనవ ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని వ్యయ విభాగం సోమవారం 14 రాష్ట్రాలకు 7,183.42 కోట్ల రూపాయల పోస్ట్ డివల్యూషన్ రెవెన్యూ లోటు (పీడీఆర్‌డీ) నిధి ఎనిమిదవ నెలవారీ వాయిదాను విడుదల చేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి 14 రాష్ట్రాలకు మొత్తం రూ.86,201 కోట్ల పీడీఆర్‌డీ మంజూరు చేయాలని కమిషన్ సిఫార్సు చేసింది. నవంబర్ 2022 నెలలో ఎనిమిదో విడత విడుదలతో 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు రాష్ట్రాలకు విడుదల చేసిన రెవెన్యూ లోటు గ్రాంట్ల మొత్తం రూ.57,467.33 కోట్లకు పెరిగిందని ఆర్థిక మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. 2022-23 ఆర్థిక సంవత్సరం కోసం ప్యానెల్ సిఫార్సు చేసిన రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్, అసోం, హిమాచల్ ప్రదేశ్, కేరళ, మణిపూర్, మేఘాలయ, మిజోరం, నాగాలాండ్, పంజాబ్, రాజస్థాన్, సిక్కిం, త్రిపుర, ఉత్తరాఖండ్, పశ్చిమ బెంగాల్ ఉన్నాయి.

కలెక్టరుపై జేసీ ప్రవర్తన దారుణం

ఏపీ రెవెన్యూ జేఏసీ చైర్మన్ దివాకర్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అనంతపురంజిల్లా కలెక్టరు నాగలక్ష్మీపై టీడీపీ నేత జేసీ ప్రభాకర్‌రెడ్డి ప్రవర్తించిన తీరు దారుణమని ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ జాయింట్ యాక్షన్ కమిటీ(జేఏసీ) రాష్ట్ర చైర్మన్ వీఎస్ దివాకర్ తీవ్రంగా ఖండించారు. విజయవాడ గవర్నరుపేట ఏపీ రెవెన్యూ అసోసియేషన్ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, అనంతపురం కలెక్టరు నాగలక్ష్మీపై జేసీ ప్రభాకర్‌రెడ్డి దౌర్జన్యపూరితంగా వ్యవహరించడాన్ని తప్పుపట్టారు. ఈ సంఘటనపై ప్రభుత్వం తక్షణమే స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. జేసీ ప్రభాకర్‌రెడ్డిపై వెంటనే కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఐఏఎస్ అధికారులకే రక్షణ లేకపోతే, సాధారణ ఉద్యోగులకు రక్షణ ఎక్కడ ఉంటుందంటూ ప్రశ్నించారు. ఎట్టి పరిస్థితుల్లో ఈ విషయాన్ని సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్తామని, ఇలాంటి ఘటనలు రాష్ట్రంలో పునరావృతం కాకుండా చూస్తామన్నారు. ప్రభుత్వం స్పందించకుంటే రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ ఉద్యోగులు పోరాటానికి సిద్ధమవుతామని వెల్లడించారు. అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ బి.సుగుణ, కో-కన్వీనర్ ఎస్.వెంకటేశ్వరరావు, గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు బి.రవీంద్రరాజు, రాష్ట్ర రెవెన్యూ సహాయకుల సంఘం అధ్యక్షులు ఎన్.పెద్దన్న పాల్గొన్నారు.

రైతులకు సమర్థవంతంగా సంక్షేమం: కాకాని

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వ్యవసాయ, మార్కెటింగ్, వేర్ హౌసింగ్, ఉద్యాన శాఖలను ఒకే గొడుగు కిందకు సీఎం జగన్ తీసుకొచ్చి రైతులకు సమర్థవంతంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కొనియాడారు. ఎప్పటికీ ఉండేదీ ఉద్యోగులు మాత్రమేనని, సంస్థ మనుగడ కోసం ఉద్యోగులు కృషి చేయాలన్నారు. విజయవాడ ఒక ప్రైవేట్ హోటల్‌లో సోమవారం వేర్ హౌసింగ్ కార్పొరేషన్ నిర్వహించిన మొదటి రాష్ట్రస్థాయి సమావేశానికి మంత్రి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్ వేర్ హౌసింగ్ ఆన్‌లైన్ సిస్టమ్ సాఫ్ట్‌వేర్‌ను ఆయన ఆవిష్కరించారు. కాకాని మాట్లాడుతూ గతంలో గోడౌన్లలో కేవలం ఎరువులు మాత్రమే లభించేవని, ప్రభుత్వంలో విత్తనం నుంచి పంట విక్రయం వరకూ అన్ని సేవలు రైతు గడప వద్దనే అందిస్తున్నామన్నారు. మార్కెట్ వ్యవస్థలో వస్తున్న మార్పులకు అనుగుణంగా గిడ్డంగుల నిర్మాణం చేపట్టామన్నారు. సిబ్బందికి కేంద్ర ప్రభుత్వ సంస్థలలో శిక్షణ కల్పించి గిడ్డంగుల సేవలలో మెరుగైన నాణ్యతా ప్రమాణాలు పాటిస్తున్నామని పేర్కొన్నారు. మారుతున్న పరిస్థితుల దృష్ట్యా మార్క్ ఫెడ్‌లో కూడా ఫ్లిప్ కార్ట్ వంటి ఆన్‌లైన్ దిగ్గజ సంస్థలతో ఒప్పందాలు చేసుకుని రైతులకు, వినియోగదారులకు సేవలు అందిస్తున్నామని పేర్కొన్నారు. గిడ్డంగుల సంస్థకు ఎప్పుడు ఏ అవసరం వచ్చినా తనవంతు సంపూర్ణ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. సంస్థ చైర్మన్ షేక్ అమీన్ కరిముల్లా మాట్లాడుతూ గిడ్డంగులలో రైతులు సరుకు నిల్వ చేసుకున్నప్పుడు వేర్ హౌస్ సంస్థ నుంచి ఎలక్ట్రానిక్ వేర్ హౌస్ రశీదు జారీ చేస్తామని, దీనిపై 70 శాతం వరకూ రైతులు హామీలేని రుణం బ్యాంకు నుంచి పొందవచ్చని చెప్పారు. మార్కెటింగ్ కో-ఆపరేషన్ ముఖ్య కార్యదర్శి చిరంజీవ్ చౌదరి, ఏపీ స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ వైస్ చైర్మన్ అండ్ ఎండీ ఎస్.శ్రీకంఠనాథరెడ్డి, జనరల్ మేనేజర్ డి.చంద్రశేఖర్, వేర్ హౌసింగ్ సంస్థ బోర్డు డైరెక్టర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఐఎల్‌కు ఇస్రో నిర్వహణ

రాబోయే ఏళ్లలో పరిశోధన... అభివృద్ధి పై దృష్టి

చైర్మన్ సోమనాథ్

బెంగళూరు : భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) తన కార్యాచరణ కార్యకలాపాలను తన మార్కెటింగ్ విభాగం న్యూస్పేస్ ఇండియా లిమిటెడ్ (ఎన్‌ఎస్‌ఐఎల్)కి మారుస్తుందని, రాబోయే సంవత్సరాల్లో అధునాతన అంతరిక్ష సాంకేతికతల రంగంలో పరిశోధన, అభివృద్ధిపై దృష్టి సారిస్తుందని సంస్థ చైర్మన్ ఎస్.సోమనాథ్ సోమవారం తెలిపారు. ప్రభుత్వం, ప్రజల కోసం మరిన్ని అప్లికేషన్లు చేయడంపై ఇస్రో సంవత్సరాలుగా ఎక్కువ దృష్టి సారిస్తోందని అన్నారు. వ్యవస్థలను సృష్టించడం, ఉపగ్రహాలను నిర్మించడం, ప్రారంభించడం, నిర్వహించడం, కమ్యూనికేషన్, భూ పరిశీలన, నావిగేషన్ సేవలను అందిస్తుందని తెలిపారు. ఇక్కడ రామన్ రీసెర్చ్ ప్లాటినం జూబ్లీ సంవత్సర వేడుకలను ప్రారంభించిన సందర్భంగా జరిగిన కార్యక్రమంలో సోమనాథ్ ప్రసంగిస్తూ ప్రభుత్వ ఆదేశాలను అనుసరించి... అంతరిక్ష విభాగం (డీవోఎస్) కింద ఉన్న కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ కూడా అయిన ఎన్‌ఎస్‌ఐఎల్‌కు ఆ కార్యాచరణ కార్యకలాపాలన్నీ ఇప్పుడు మారతాయని అన్నారు. 'ఇందులో అధునాతన సాంకేతికతల కోసం పరిశోధన, అభివృద్ధిపై ఇస్రో మరింత ఎక్కువగా దృష్టి పెడుతుందని, ఇది రాబోయే సంవత్సరాల్లో జరుగుతుంది' అని ఆయన చెప్పారు. దీని అర్థం అంతరిక్ష సాంకేతిక పరిజ్ఞానంలో గొప్ప పరిశోధన, అభివృద్ధి కార్యకలాపాలను రూపొందించడానికి ఇస్రో, దేశంలోని శాస్త్రీయ సంస్థల మధ్య 'అనుబంధాన్ని' పెంచాల్సిన అవసరం ఉందని డీవోఎస్ కార్యదర్శి సోమనాథ్ అన్నారు. ప్రభుత్వం ప్రారంభించిన అంతరిక్ష రంగంలో సంస్కరణల తరువాత ఇస్రోలో మార్పులు, పరిశోధన, సహకార రంగంలో దేశంలోని శాస్త్రీయ సంస్థలతో జాతీయ అంతరిక్ష సంస్థ పనిచేసే విధానాన్ని నిజంగా మార్చబోతున్నాయని ఆయన పునరుద్ఘాటించారు. ఆర్ఆర్ఐ డైరెక్టర్ ప్రొఫెసర్ తరుణ్ సౌరదీప్ మాట్లాడుతూ 1948లో నోబెల్ గ్రహీత సర్ సి.వి.రామన్ స్థాపించిన ఆర్ఆర్ఐ, సమకాలీన పరిశోధన ఇతివృత్తాల కింద భౌతిక శాస్త్రంలో పరిశోధనలను ప్రోత్సహిస్తూ 75వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్నట్లు తెలిపారు.

మిల్లర్ల దోపిడీ నుంచి కాపాడండి

విశాలాంధ్ర-పార్వతీపురం/బెల్గాం: రైతుల నుంచి ప్రభుత్వమే నేరుగా ధాన్యం కొనుగోలు చేయాలనీ, రైస్ మిల్లర్ల దోపిడీ నుంచి రైతులను కాపాడాలని, కనీస మద్దతు ధరల చట్టం చేయాలనీ, ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన జీడిపంటకు పరిహారం ఇచ్చి గిరిజనరైతులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అధ్వర్యాన సోమవారం పార్వతీపురం మన్యం జిల్లాలో రైతులు ప్రదర్శన నిర్వహించారు. పార్వతీపురంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలి నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందచేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాల వలన వ్యవసాయం సంక్షోభంలో కూరుకుపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్ ధాన్యాన్ని రాష్ట్ర ప్రభుత్వమే రైతులనుండి నేరుగా సేకరించి కొనుగోలు చేయాలని, ధాన్యం ముక్క అవుతోందని, రంగు మారుతోందని రకరకాల పేర్లతో రైతులను అడ్డంగా (బస్తాకు రూ.600 వరకు) మిల్లర్లుదోచుకుంటున్నారనీ, ఈ విషయం అధికారుల దృష్టికి వెళ్లినా ఏమి చేయలేని పరిస్థితి ఉందన్నారు. ఆర్బీకే కేంద్రాలు కేవలం ఉత్సవ విగ్రహాలుగా మాత్రమే ఉంటున్నాయని, అందువల్ల గతంలో వలే ప్రభుత్వమే నేరుగా కొనుగోలు చేయాలని ప్రసాద్ డిమాండ్ చేశారు.

రైతు సంఘం ఉమ్మడి విజయనగరం జిల్లా కార్యదర్శి బుడితి అప్పలనాయుడు మాట్లాడుతూ, ప్రభుత్వం ధాన్యాన్ని రైతుల నుంచి నేరుగా కొనుగోలు చేయాలని, కేరళ రాష్ట్ర ప్రభుత్వం వలే ధాన్యానికి క్వింటాకు రూ.2800 రైతులకు చెల్లించాలని, ప్రకృతి వైపరీత్యాలకు నష్టపోయిన జీడి, మొక్కజొన్న, పత్తి పంటలకు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి రైతులకు పరిహారం ఇవ్వాలని, పాలకొండ, పార్వతీపురం ప్రాంతాలలో ఏనుగుల వలన నష్టపోయిన పంటలకు, మూగజీవులకు పరిహారం వెంటనే రైతులకు చెల్లించాలని, లచ్చయ్యపేట సుగర్ ఫ్యాక్టరీ రైతులకు, కార్మికులకు ఇవ్వవలసిన బకాయిలను వెంటనే చెల్లించి, ఫ్యాక్టరీని తెరిపించాలని, ధాన్యం, వాణిజ్య పంటలను నిల్వ ఉంచుటకు, శీతల గిడ్డంగులను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు గురుబిల్లి అప్పలనాయుడు, కూరంగి మన్మథరావు, చేబోతుల లక్ష్మీనారాయణ (సర్పంచ్ సింగన్న వలస)ఈ.వి నాయుడు, ద్వారపూడి అప్పలనాయుడు, కిమిడి రామ్మూర్తి, తెంటు సింహాచలం, ప్రజా సంఘాల నాయకులు లింగరాజు, గరుగుబిల్లి సూరయ్య, బీటీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర అభివృద్ధి బూటకం

(మొదటిపేజీ తరువాయి)

ఏర్పాట్లు, మూడు లక్షల మది జనసమీకరణ చేయడం విమర్శలకు దారితీస్తోంది. విశాఖలో ఈనెల 11, 12 తేదీల్లో మోదీ పర్యటన ఖరారైనప్పటి నుంచి...దీనికి సంబంధించిన ఏర్పాట్లను రాష్ట్ర ప్రభుత్వం తన భుజస్కందాలపై వేసుకుంది. మోదీ పర్యటనను విజయవంతం చేసేందుకు నానాతంటాలు పడుతోంది. వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి అధికారులను అప్రమత్తం చేస్తున్నారు. ఈ ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలను అధికార వైసీపీ తనకు అనుకూలంగా మల్చుకునేందుకు ప్రయత్నిస్తుండగా, బీజేపీ సైతం అభివృద్ధి పనులను తన ఖాతాలో వేసుకునేందుకు ఉబలాటపడుతోంది. అందులో భాగంగా మోదీతో ప్రత్యేక ర్యాలీ చేయించేందుకు బీజేపీ నేతలు ప్రయత్నిస్తున్నారు. మోదీ పర్యటనను నిరసిస్తూ... రాష్ట్రానికి చేసిన అన్యాయాన్ని ఎండగడుతూ ఈనెల 11న సీపీఐ రాష్ట్రవ్యాప్త నిరసనలకు పిలుపునిచ్చింది. అదేరోజు విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట వేదిక, విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ రాష్ట్రవ్యాప్తంగా నిరసనలకు పిలుపునివ్వడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో ఆందోళన మొదలైంది. విశాఖ ఉక్కు ఉద్యోగులు, కార్మికులు సమ్మె తలపెట్టనున్నారు. దీంతో మోదీ పర్యటనకు నిరసన సెగ అనివార్యం కానుంది. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను నిరసిస్తూ చాలాకాలం నుంచి విశాఖతోపాటు రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున ఆందోళనలు కొనసాగుతున్నాయి. రెండుసార్లు బంద్ నిర్వహించారు. కార్మికసంఘాలు విభిన్న రూపాయల్లో నిరసనలు చేపట్టాయి. ఆంధ్రుల హక్కు విశాఖను ప్రైవేట్‌పరం చేయడాన్ని బీజేపీ మినహా అన్ని పార్టీలూ వ్యతిరేకిస్తున్నాయి. వైసీపీ సైతం విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ఏకంగా అసెంబ్లీలో తీర్మానం చేసింది.

అడుగడుగునా కేంద్రం దగా

రాష్ట్రానికి అడుగడుగునా మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం దగా చేస్తోంది. విభజన హామీలు అమలు చేయకుండా నాన్చివేత ధోరణి అనుసరిస్తోంది. ప్రత్యేక హోదా ప్రస్తావనే లేదు. కడపలో స్టీలు ప్లాంట్ నెలకొల్పకుండా విశాఖ ఫ్యాక్టరీని ప్రైవేట్‌పరం చేసేందుకు మోదీ కంకణం కట్టుకున్నారు. భోగాపురం విమానాశ్రయం పనులు పెండింగ్‌లో ఉన్నాయి. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తికి కేంద్ర ప్రభుత్వం సహకరించడం లేదు. గంగవరం పోర్టును అదానీకి కట్టబెడుతున్నారు. విశాఖకు రైల్వేజోన్‌పై కేంద్రం నుంచి స్పష్టమైన ప్రకటన రాలేదు. రాష్ట్రానికి మోదీ చేస్తున్న అన్యాయంపై సీఎం జగన్ నిలదీయడం లేదు. మోదీ పర్యటన ఏర్పాట్లను ప్రభుత్వం చక్కదిద్దడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విశాఖ ఉక్కు దగ్గర నుంచి గంగవరం పోర్టు వరకు ప్రభుత్వరంగ సంస్థలన్నింటినీ అదానీకి మోదీ కట్టబెడుతుంటే...సీఎం జగన్ పూర్తిగా సహకరిస్తున్నారు.

11వ తేదీ రాత్రి విశాఖ డిఫెన్స్‌లో మోదీ బస చేస్తారు. 12వ తేదీ ఉదయం ఏయూ ఇంజినీరింగ్ కాలేజీలో భారీ బహిరంగ సభలో ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు. వివిధ అభివృద్ధి పనులను మోదీ ప్రారంభించనున్నారు. ఇప్పటివరకు అందిన సమాచారం మేరకు దాదాపు రూ.10,472 కోట్ల విలువగల ఏడు మెగా ప్రాజెక్టులకు శంకుస్థాపనలు /ప్రారంభోత్సవాలను ప్రధాని చేయనున్నారు. ఈ శంకుస్థాపనల్లో విశాఖ రైల్వేజోన్ ఉందా? లేదా? అనేది ప్రశ్నార్థకంగా మారింది. విశాఖ ఇంజినీరింగ్ కళాశాల గ్రౌండులో 18.5 ఎకరాలు, పక్కనే ఉన్న 11 ఎకరాలలో బహిరంగ సభకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టారు. దీనిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోంది.

పవన్‌కు పిలుపుపై బీజేపీ మౌనం

మోదీ బహిరంగ సభ కోసం జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు ఆహ్వానం పంపే అంశంపై బీజేపీ మౌనం వహిస్తోంది. మోదీ సభను పూర్తిగా జగన్ ప్రభుత్వ కనుసన్నల్లో కొనసాగుతోంది. దీనిపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజును మీడియా ప్రశ్నించగా సమాధానం దాట వేశారు. పవన్ కల్యాణ్‌ను ఆహ్వానిస్తే ఏర్పడే పరిణామాలపై బీజేపీ, వైసీపీ తర్జనభర్జన పడుతున్నాయి. ఇటీవల కాలంలో వైసీపీ, జనసేన మధ్య వ్యక్తిగతంగా, పార్టీ పరంగా సవాళ్లు, ప్రతిసవాళ్లు నడిచాయి. మోదీ బహిరంగ సభకు పవన్‌ను పిలిస్తే అది వైసీపీకి మైనస్‌గా మారనుంది. బీజేపీ నేతల కంటే పవన్‌కు మైలేజ్ వస్తోంది. దీనిని గమనించిన వైసీపీ, బీజేపీ నేతలు పవన్‌కు ఆహ్వానంపై మౌనం వహిస్తున్నారు. వైసీపీ, బీజేపీ నేతలు రాజకీయ లబ్ధి కోసం ఆరాటం వీడి...రాష్ట్రానికి ప్రత్యేక హోదాతోపాటు విభజన హామీలు, వెనుకబడిన జిల్లాలకు నిధులకు సంబంధించి కేంద్రంపై ఒత్తిడి తేవాలని విపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి.

'చిరస్మరణీయుడు... మేకపాటి గౌతమ్‌రెడ్డి' పుస్తకావిష్కరణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: మేకపాటి గౌతమ్ రెడ్డి ప్రజా, రాజకీయ జీవితాన్ని విశ్లేషిస్తూ వ్యక్తిత్వ వికాస నిపుణులు డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, రచయిత, జర్నలిస్ట్ విజయార్కె రాసిన 'చిరస్మరణీయుడు... శ్రీ మేకపాటి గౌతమ్‌రెడ్డి' పుస్తకాన్ని క్యాంపు కార్యాలయంలో సోమవారం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరించారు. పుస్తకావిష్కరణ సందర్భంగా గౌతమ్‌రెడ్డితో తనకున్న అనుబంధాన్ని, జ్ఞాపకాలను సీఎం నెమర వేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి, ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి, రచయిత డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, పిల్లుట్ల రఘు, మోచర్ల నారాయణ రావు, పీర్ల పార్థసారథి పాల్గొన్నారు.

ఎయిమ్స్‌లోనూ ఆరోగ్యశ్రీ

(మొదటిపేజీ తరువాయి)

వినియోగించుకోవాలని సూచించారు. మెంటల్ హెల్త్, యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ అంశాల్లో ఎయిమ్స్‌తో ఏపీ ప్రభుత్వం అతి త్వరలోనే ఎంవోయూలు కుదుర్చుకోబోతోందని తెలిపారు. దీనివల్ల ఏపీ ప్రభుత్వ వైద్య కళాశాలల్లోని విద్యార్థులకు ఆయా అంశాల్లో ఎయిమ్స్ నుంచి అత్యుత్తమ శిక్షణ లభిస్తుందన్నారు. "సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఇన్ పాలియేటివ్ కేర్" గా ఎయిమ్స్ ను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ఉన్నామని, అందుకు కావాల్సిన సహాయ సహకారాలు ప్రభుత్వం అందిస్తుందన్నారు.

తాగునీటి శాశ్వత పరిష్కారానికి పనులు ప్రారంభం

ఎయిమ్స్‌కు తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు ఆత్మకూరు రిజర్వాయర్ నుంచి రూ.7.74 కోట్ల ఖర్చుతో పైపులైను పనులు మొదలుపెట్టామని చెప్పారు. సోమవారం నుంచే ఈ పనులు ప్రారంభమయ్యాయన్నారు. తాత్కాలికంగా ఈ సమస్య లేకుండా చేసేందుకు మంగళగిరి-తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ నుంచి రోజుకు 3.5లక్షల లీటర్ల నీటిని ఉచితంగా సరఫరా చేస్తున్నామన్నారు. మరో లక్ష లీటర్ల నీటిని అత్యవసర సమయాల్లో వాడుకునేందుకు వీలుగా ప్రతి రోజూ అందుబాటులో ఉంచుతున్నామన్నారు. అవసరమైన ప్రతిసారీ ఈ నీటిని కూడా ఎయిమ్స్ కోసం వాడుకుంటున్నారని చెప్పారు. సంస్థ విస్తరణలో భాగంగా రోజుకు అదనంగా మరో 3 లక్షల లీటర్ల నీరు అవసరమని తమకు ఎయిమ్స్ నుంచి అభ్యర్థన వచ్చిందని, ఈ నీటిని విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ నుంచి ఉచితంగా అందజేస్తున్నామని వివరించారు. అలాగే ఎయిమ్స్‌కు మౌలిక సదుపాయలైన రోడ్లు , కరెంటు ను ప్రభుత్వమే కల్పించిందన్నారు. ఎయిమ్స్‌కు వెళ్లే రహదారులకు సెంట్రల్ లైటింగ్ సౌకర్యం కూడా కల్పించామని, మొత్తం రూ.55 కోట్లను ఎయిమ్స్ లో వసతుల కోసం తమ ప్రభుత్వం ఇప్పటివరకు ఖర్చు చేసిందని వివరించారు. ఎయిమ్స్ కు సంబంధించిన సమస్యలను పరిష్కరించే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తమకు పూర్తిగా సహాయసహకారాలు అందజేస్తోందని ఎయిమ్స్ డైరెక్టర్ డాక్టర్ త్రిపాఠి ఈ సందర్భంగా సంతోషాన్ని వ్యక్తం చేశారు. మంత్రితో పాటు వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి జీఎస్ నవీన్‌కుమార్, డీఎంఈ డాక్టర్ వినోద్‌కుమార్, ఆరోగ్యశ్రీ సీఈవో హరీంద్రప్రసాద్, ఎయిమ్స్ డైరెక్టర్ డాక్టర్ ముఖేష్ త్రిపాఠి, డీన్ డాక్టర్ జోయ్ ఘోషల్ తదితరులున్నారు.

కేరళ గవర్నరు రంకెలు

(మొదటిపేజీ తరువాయి)

కస్టడీ నుంచి తప్పించడానికి ఓ యువ ఐపీసీ అధికారి తుపాకీతో సాగించిన అరాచకం అందరూ చూశారని, ఇవన్నీ సీఎం విజయన్‌కు తెలియవా అని ఖాన్ ప్రశ్నించారు. రెండు వార్తాచానెళ్ల జర్నలిస్టులను తన కార్యక్రమానికి రాకుండా గవర్నరు అడ్డుకున్నారు. అంతేకాకుండా ఆ జర్నలిస్టులను మీడియా ముసుగులో ఉన్న వామపక్ష కార్యకర్తలని ఆరోపించారు. గవర్నరు వ్యాఖ్యలపై పాలక ఎల్‌డీఎఫ్, ప్రతిపక్ష కాంగ్రెస్ తీవ్రంగా మండిపడ్డాయి. సీపీఎం పాలనలోని తిరువనంతపురం కార్పొరేషన్‌లో తాత్కాలిక ఉద్యోగులుగా లెఫ్ట్ కార్యకర్తలను పెద్దఎత్తున నియమించుకున్నారని గవర్నరు ఆరోపించారు. అర్హత గల యువత ఉద్యోగ వేటలో ఇతర రాష్ట్రాలకు వలస వెళుతుంటూ సీపీఎం నాయకత్వం మాత్రం తమ కార్యకర్తలు, బంధువులను ఉద్యోగాల్లో నింపేస్తోందని చెప్పుకొచ్చారు. ఇలాంటి ఘటనలో చాలా ఉన్నాయని అన్నారు. రాష్ట్రంలో సీపీఎం కార్యకర్తలు సైతం శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్నారని, అబ్దుల్ కలాం టెక్నాలజికల్ యూనివర్సిటీ ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ నియామకానికి వ్యతిరేకంగా ఎస్ఎఫ్ఐ పెద్దఎత్తున ఆందోళన చేసిందని, విధులు నిర్వహించకుండా వైస్ చాన్సలర్‌ను అడ్డుకున్నదని గవర్నరు ఆరోపించారు. నవంబరు 15న రాజ్‌భవన్‌కు నిరసన ర్యాలీకి పిలుపునివ్వడంపై సీపీఎం, సీఎం విజయన్‌ను నిందించారు. 'దమ్ముంటే రాజ్‌భవన్‌లోకి దూసుకురండి. రోడ్డుపై నా మీద దాడి చేయండి' అని రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. సీపీఎం ధర్నా కోసం తాను ఎదురుచూస్తున్నానని, 15న ధర్నాను ఆపవద్దని కోరుతున్నానన్నారు.

మోదీ సర్కారును గద్దె దించుదాం

(మొదటిపేజీ తరువాయి)

సీపీఐ ప్రధాన కార్యాలయం అజయ్‌భవన్‌లో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉత్సవాలు జరిపారు. అమర్‌జిత్ కౌర్ మాట్లాడుతూ అన్ని రకాల దోపిడీ, పీడనల నుంచి విముక్తి కోసం ప్రపంచవ్యాప్తంగా పోరాటాలు కొనసాగుతున్నాయని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా మార్క్సిజం సిద్ధాంతాల వ్యాప్తికి, విప్లవశక్తుల పటిష్ఠతకు సోవియట్ రష్యా ఎంతగానో దోహదపడిందని అమర్‌జిత్ కౌర్ చెప్పారు. ఓ మనిషి మరో మనిషిని దోపిడీ చేసే విధానాలకు స్వస్తి చెప్పడానికి కార్మికవర్గం పోరాటాలు ఉధృతం చేయాల్సిన సమయం ఆసన్నమైందని ఆమె పిలుపునిచ్చారు. అందరికీ విద్య, ఉపాధి, ఆరోగ్య పరిరక్షణ కోసం పోరుబాట పట్టాలన్నారు. వీఐ లెనిన్ నాయకత్వంలో జరిగిన విప్లవం ప్రపంచవ్యాప్తంగా విముక్తి ఉద్యమాలకు అండగా నిలిచిందని కౌర్ తెలిపారు. భారత స్వాతంత్ర్య సంగ్రానికి సైతం లెనిన్ మద్దతిచ్చారని గుర్తుచేశారు. ప్రప్రథమ సోషలిస్టు దేశం రష్యా ఆవిర్భావం తర్వాత లెనిన్ ముందుగా శాంతి డిక్రీని ప్రకటించినట్లు ఆమె చెప్పారు. సామ్రాజ్యవాద దేశాల నుంచి యుద్ధ ప్రమాదాన్ని ఎదుర్కొంటున్న ప్రపంచానికి ప్రస్తుతం శాంతి అత్యంత ముఖ్యమని కౌర్ వెల్లడించారు. ప్రజాస్వామిక విలువలను కాపాడుకోవాల్సిన ఆవశ్యకతను ఉద్ఘాటిస్తూ తుది లక్ష్యం కోసం పోరాటాలకు సిద్ధం కావాలని ఆమె ప్రజలకు విజ్ఞప్తి చేశారు. దేశాన్ని ఫాసిజం దిశగా తీసుకెళుతున్న మోదీ ప్రభుత్వాన్ని గద్దెదించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పార్టీ నాయకులు, కార్యకర్తల నినాదాల మధ్య సీపీఐ పతాకాన్ని అమర్‌జిత్ కౌర్ ఆవిష్కరించారు. లెనిన్ విగ్రహానికి కౌర్, సీపీఐ జాతీయ కార్యదర్శి పల్లవ్ సేన్‌గుప్తా పూలమాలలతో నివాళి అర్పించారు.

రిజర్వేషన్లు సబబే

(మొదటిపేజీ తరువాయి)

నిశ్చయాత్మక చర్య సాధనమని, అది వెనుకబడిన ఏ వర్గాన్ని లేదా వర్గాన్ని అయినా చేర్చే సాధనమని ఆయన అన్నారు. రిజర్వేషన్లలో 50 శాతం పరిమితి ఎప్పుడూ ఒకేలా ఉండేలా లేదని పేర్కొన్నారు. జస్టిస్ మహేశ్వరి ప్రకటనతో ఏకీభవించిన జస్టిస్ బేల ఎం త్రివేది... 103వ రాజ్యాంగ సవరణ వివక్షతో కూడుకున్నదన్న కారణంతో దానిని కొట్టివేయలేమని అన్నారు. 103వ రాజ్యాంగ సవరణను ఈడబ్ల్యూఎస్ తరగతి ప్రయోజనాల కోసం పార్లమెంటు ఆమోదించిన చర్యగా పరిగణించాలని ఆమె అన్నారు. జస్టిస్ జేబీ పార్దివాలా వారి అభిప్రాయాలతో ఏకీభవిస్తూ సవరణ చెల్లుబాటును సమర్థించారు. అయితే, రిజర్వేషన్ అనేది సామాజిక న్యాయం కోసం ఉద్దేశించిందని, అయితే అది నిరవధికంగా కొనసాగకూడదని, అది స్వార్థ ప్రయోజనంగా మారుతుందని జస్టిస్ పార్దివాలా అన్నారు. అయితే న్యాయమూర్తి జస్టిస్ ఎస్.రవీంద్ర భట్... మైనారిటీ దృష్టిలో ఈడబ్ల్యూఎస్ కోటాపై రాజ్యాంగ సవరణను విభేదించారు. దానిని కొట్టివేశారు. 103వ సవరణ చట్టాన్ని రాజ్యాంగ విరుద్ధమని, రాజ్యాంగ ప్రాథమిక నిర్మాణాన్ని ఉల్లంఘించిన కారణంగా అది చెల్లదని ఆయన ప్రకటించారు. ఈడబ్ల్యూఎస్‌కు 10 శాతం కోటా... సుప్రీం కోర్టు రిజర్వేషన్ల పై నిర్ణయించిన 50 శాతం పరిమితిని దాటుతుందని జస్టిస్ భట్ అన్నారు. దీనితో సీజేఐ లలిత్ ఏకీభవించారు. ఆరున్నర రోజులుగా సాగిన విచారణలో అప్పటి అటార్నీ జనరల్ కె.కె.వేణుగోపాల్, సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాతో సహా సీనియర్ న్యాయవాదుల వాదనలు విన్న తర్వాత ఈడబ్ల్యూఎస్ కోటా రాజ్యాంగ ప్రాథమిక నిర్మాణాన్ని ఉల్లంఘిస్తుందా అనే చట్టపరమైన ప్రశ్నపై సెప్టెంబర్ 27న సుప్రీం కోర్టు తీర్పును రిజర్వు చేసింది. విద్యావేత్త మోహన్ గోపాల్ సెప్టెంబర్ 13న బెంచ్ ముందు ఈ కేసులో వాదనలు ప్రారంభించారు. రిజర్వేషన్ భావనను నాశనం చేయడానికి 'మోసపూరిత, దొడ్డిదారి ప్రయత్నం' అని పేర్కొనడం ద్వారా ఈడబ్ల్యూఎస్ కోటా సవరణను వ్యతిరేకించారు. తమిళనాడు, సీనియర్ న్యాయవాది శేఖర్ నఫాడే కూడా ఈడబ్ల్యూఎస్ కోటాను వ్యతిరేకించారు. ఆర్థిక ప్రమాణాలు వర్గీకరణకు ప్రాతిపదిక కాలేవని, ఈ రిజర్వేషన్‌ను సమర్థించాలని నిర్ణయించుకుంటే సుప్రీం కోర్టు ఇందిరా సాహ్నీ (మండల్) తీర్పును పునః పరిశీలించవలసి ఉంటుందని తెలిపారు. అప్పటి అటార్నీ జనరల్, సొలిసిటర్ జనరల్ సవరణను గట్టిగా సమర్థించారు. దీని ప్రకారం రిజర్వేషన్లు భిన్నంగా ఉన్నాయని, సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన తరగతులకు (ఎస్ఈబీసీ) ఉద్దేశించిన 50 శాతం కోటాకు భంగం కలిగించకుండా ఇచ్చినట్లు వివరించారు. అందువల్ల, సవరించిన నిబంధన రాజ్యాంగ ప్రాథమిక నిర్మాణాన్ని ఉల్లంఘించదని వారు చెప్పారు. రాజ్యాంగ సవరణ (103వ) చట్టం 2019 చెల్లుబాటును సవాలు చేస్తూ 2019లో 'జన్హిత్ అభియాన్' దాఖలు చేసిన ప్రధాన పిటిషన్‌తో సహా 40 పిటిషన్లను సుప్రీంకోర్టు విచారించింది. ఈడబ్ల్యూఎస్ కోటా చట్టాన్ని సవాలు చేస్తూ పెండింగ్‌లో ఉన్న కేసులను వివిధ హైకోర్టుల నుంచి అధీకృత ప్రకటన కోసం సుప్రీం కోర్టుకు బదిలీ చేయాలని కోరుతూ కేంద్రం కొన్ని పిటిషన్లు దాఖలు చేసింది. 2019 సార్వత్రిక ఎన్నికల ముందు కేంద్ర ప్రభుత్వం ఈ రిజర్వేషన్లను తీసుకువచ్చింది. 103వ రాజ్యాంగ సవరణ ద్వారా ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యా సంస్థల్లో 10 శాతం రిజర్వేషన్లు కల్పించింది. అయితే దీనిని సవాలు చేస్తూ సుప్రీం కోర్టులో అనేక పిటిషన్లు దాఖలయ్యాయి. రిజర్వేషన్ల పై 1992 సుప్రీం కోర్టు విధించిన 50 శాతం పరిమితిని దాటి ఈ కోటాను ఎలా ఇస్తారంటూ అనేక మంది పిటిషనర్లు ప్రశ్నించారు.

రబీకి సంసిద్ధం

- 23 లక్షల హెక్టార్లు లక్ష్యం
- ఎరువులు, విత్తనాల కొరత ఉండరాదు
- 29న సున్నా వడ్డీ, ఇన్‌పుట్ సబ్సిడీ జమ
- వ్యవసాయశాఖ సమీక్షలో సీఎం జగన్ వెల్లడి

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రబీకి అన్నిరకాలుగా సిద్ధంగా ఉండాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన వ్యవసాయ శాఖ సమీక్షలో సీఎం మాట్లాడారు. రబీ సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 23 లక్షల హెక్టార్లలో పంటలు వేస్తారని అంచనా వేసినట్లు అధికారులు తెలియజేయగా, అందుకు అవసరమైన ఎరువులు, విత్తనాలు సిద్ధం చేసుకోవాలని సీఎం సూచించారు. కొరత అనే మాట వినపడకూడదని, రైతులు ఏ విషయంలోనూ ఇబ్బందిపడకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సున్నావడ్డీ పంటరుణాలతో పాటు ఇన్‌పుట్ సబ్సిడీని నవంబరు 29న జమ చేయనున్నట్లు వెల్లడించారు. జూన్ నుంచి నవంబరు వరకు 775 మిమీ సాధారణ వర్షపాతానికిగాను 781.7 మిమీ వర్షపాతం నమోదైందని అధికారులు వివరించారు. 186 లక్షల మెట్రిక్ టన్నుల ఆహార ధాన్యాల ఉత్పత్తి ఉంటుందని అంచనా వేశామని, ఈ-క్రాప్‌కు సంబంధించి వీఏఏ, వీఆర్వో బయోమెట్రిక్ ఆథరైజేషన్ నూటికి నూరుపాళ్లు పూర్తయిందని అధికారులు తెలిపారు. రైతుల నుంచి 93 శాతం ఇ-కేవైసీ పూర్తయిందని తెలపగా, మిగిలిన 7 శాతం రైతులకు ఎస్సెమ్మెస్‌ల ద్వారా ఇ-క్రాప్ వివరాలు పంపించాలని సీఎం సూచించారు. ధాన్యం సేకరణపై అధికారులు తమ ప్రణాళికను వివరించగా, ఎంఎస్‌పీ కన్నా తక్కువ ధరకు రైతులు అమ్ముకోవాల్సి వచ్చిందనే మాట రాకూడదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. రైతులకు గరిష్ఠ ప్రయోజనాలు అందించేలా ధాన్యం సేకరణ కొనసాగాలని, వ్యవసాయశాఖతో పౌరసరఫరాల శాఖ అనుసంధానమై రైతులకు మంచి జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పొలంబడి కార్యక్రమాల్లో వ్యవసాయ విశ్వ విద్యాలయాలకు చెందిన విద్యార్థులకు అప్రెంటిషిప్ చేయించడం, వారి ద్వారా క్షేత్రస్థాయిలో అవగాహన పెంపు, వారి నుంచి సలహాలు పొందడంపై దృష్టిపెట్టాలన్నారు. ప్రతి ఆర్బీకేలో ఒక డ్రోన్‌ను ఉంచేలా కార్యాచరణ సిద్ధం చేయాలన్నారు. కమ్యూనిటీ హైరింగ్ సెంటర్ల ద్వారా ఇచ్చిన వ్యవసాయ యంత్ర సామగ్రి అంతా రైతులకు అందుబాటులో ఉంచాలన్నారు. భూసార పరీక్షలు చేసే పరికరాలను ప్రతి ఆర్బీకేలో ఉంచాలని, భూసార పరీక్షల ద్వారా ఏ ఎరువులు వాడాలి? ఎంతమేర వాడాలన్నదానిపై స్పష్టత వస్తే.. దీనివల్ల పెట్టుబడి గణనీయంగా తగ్గడంతో పాటు దిగుబడులు గణనీయంగా పెరుగుతాయన్నారు. తద్వారా భూసారాన్ని పరిరక్షించుకునేందుకు అవకాశం ఏర్పడుతుందని సీఎం అన్నారు. వ్యవసాయ రంగంలో ఉత్తమ విధానాలు, వివిధ రకాల కార్యక్రమాలు, ఉత్పత్తి, ఉపకరణాలు, సాంకేతిక పరిజ్ఞానం, మార్కెటింగ్, అదనపు విలువ, మౌలిక సదుపాయాలు, ఎగుమతులకు సంబంధించి విశేష ప్రతిభ కనపర్చిన వారికి 2022 సంవత్సరానికిగాను ఇండియన్ ఛాంబర్ ఆఫ్ ఫుడ్ అండ్ అగ్రికల్చర్ (ఐసీఎఫ్ఏ) అవార్డులు లభించడం, విత్తన కేటగిరీలో అవార్డు దక్కించుకున్న ఏపీ స్టేట్ సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ అధికారులను సీఎం అభినందించారు. వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, పౌరసరఫరాలు, వినియోగ దారులశాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, అగ్రిమిషన్ వైస్ ఛైర్మన్ ఎంవీయస్ నాగిరెడ్డి, సీఎస్ సమీర్ శర్మ, వ్యవసాయశాఖ స్పెషల్ సీఎస్ పూనం మాలకొండయ్య, మార్కెటింగ్ అండ్ కోఆపరేషన్ ప్రధాన కార్యదర్శి చిరంజీవి చౌదరి, మార్కెటింగ్ కమిషనర్ ప్రద్యుమ్న, ఆర్థికశాఖ కార్యదర్శి ఎన్.గుల్జార్, పౌర సరఫరాల శాఖ కమిషనర్ హెచ్. అరుణ్‌కుమార్, వ్యవసాయశాఖ కమిషనర్ సీహెచ్ హరికిరణ్, పౌరసరఫరాల సంస్థ వీసీ అండ్ ఎండీ జి.వీరపాండ్యన్, ఏపీఎస్ఎస్‌డీసీఎల్ వీసీ అండ్ ఎండీ జి.శేఖర్‌బాబు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి పూర్తి సహకారం

బాధ్యతలు స్వీకరించిన అలీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రభుత్వానికి తన వంతు పూర్తి సహకారం అందిస్తానని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఎలక్ట్రానిక్ మీడియా సలహాదారుడు, సినీనటుడు మహ్మద్ అలీ అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఎలక్ట్రానిక్ మీడియా సలహాదారుడిగా తాను బాధ్యతలు స్వీకరించడం సంతోషంగా ఉందన్నారు. విజయవాడ పండిట్ నెహ్రూ బస్టాండ్ ఆవరణలో ఉన్న ఎన్టీఆర్ అడ్మినిస్ట్రేషన్ బ్లాక్ రెండవ అంతస్థులోని సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో కమిషనర్ తుమ్మా విజయ్‌కుమార్‌రెడ్డి అందించిన నియామక పత్రాన్ని మహ్మద్ అలీ సోమవారం స్వీకరించి...పదవీ బాధ్యతలు చేపట్టారు. అనంతరం అలీ మాట్లాడుతూ సీఎం జగన్ తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తానన్నారు. విలువైన సలహాలు, సూచనలు అందించి ప్రభుత్వానికి, మీడియాకు తనవంతు సహకారం అందిస్తూ, మీడియా వ్యవస్థ బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు. ప్రజాభిమానం పొందిన గొప్ప నాయకులు సీఎం జగన్ అని, ప్రజల పట్ల ఆయన చూపించే అభిమానం వెలకట్టలేనిదని కొనియాడారు. తండ్రిని మించిన తనయుడిగా జగన్ కీర్తి, ప్రతిష్ఠలు సాధించారని, గొప్ప ప్రజా నాయకుడిగా, మహా నాయకుడిగా పేరొందారన్నారు. నవరత్నాలు పటిష్ఠవంతంగా అమలవుతున్నాయని చెప్పిన అలీ...ఇటీవల తాను విశాఖలో పర్యటించిన విషయాలను వెల్లడిస్తూ...ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు కళ్లకు కట్టినట్లు కనిపించాయన్నారు. విజయ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ అలీ సమర్థ వంతంగా తన సేవలు అందిస్తారని ఆకాంక్షించారు.

అక్టోబర్ విప్లవంతో సంక్షేమ రాజ్యం

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీఎస్ఎన్ మూర్తి

విశాలాంధ్ర - విశాఖ: 1917 అక్టోబర్ సోషలిస్టు విప్లవం ప్రపంచంలో తీవ్ర మార్పులు, సంక్షేమ రాజ్యం భావనను తీసుకొచ్చిందని, ప్రపంచ వ్యాప్తంగా సామాన్యుల బ్రతుకులు బాగుపడడానికి అదే కారణమని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణ మూర్తి అన్నారు. ఇక్కడి సీపీఐ కార్యాలయంలో సోమవారం జరిగిన అక్టోబర్ సోషలిస్టు విప్లవం 105వ వార్షికోత్సవంలో ఆయన మాట్లాడుతూ 1885లో చికాగోలో కార్మికవర్గ ఆందోళనకీ, సామ్రాజ్యవాద దేశాల నుంచి వలస దేశాల విముక్తికి, ఫాసిజం, నాజీయిజం అంతానికీ అక్టోబర్ సోషలిస్టు విప్లవమే కారణమని చెప్పారు. ఆదిమ కమ్యూనిస్టు సమాజం తరువాత పరిణామ క్రమంలో బానిస సమాజం, ఫ్యూడల్ సమాజం, పెట్టుబడిదారీ సమాజం వచ్చాయని, ఈ పరిణామ క్రమంలో సోషలిజం, అంతిమంగా కమ్యూనిస్టు సమాజం రావాలని అన్నారు. సోషలిస్టు సమాజంలో మనిషి కష్టానికి తగ్గ ప్రతిఫలం అందుతుందని, ఆ తరువాత వచ్చే కమ్యూనిస్టు సమాజంలో మనిషి శక్తికి తగ్గట్టుగా పని, అవసరానికి తగ్గట్టుగా ప్రతిఫలం అందుతాయని అన్నారు. ప్రస్తుత పెట్టుబడిదారీ సమాజంలో శ్రామికవర్గం కష్టపడుతుంటే పెట్టుబడిదారులు ప్రతిఫలం పొందుతున్నారని చెప్పారు. మన దేశం స్వాతంత్రం సాధించిన తరువాత ఉక్కు కర్మాగారం ఏర్పాటుకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం కోసం నెహ్రూ బ్రిటన్, అమెరికా తదితర దేశాలను కోరితే తమ వద్ద నుంచి ఉక్కు కొనుక్కోవాలని ఆ దేశాలు చెప్పాయని, ఆ తరువాత సోవియట్ యూనియన్ సహకారం కోరినప్పుడు ఆ దేశం వెంటనే అంగీకరించి బొకారో, విశాఖ ఉక్కు కర్మాగారాలకు సాంకేతికతను అందించిందని గుర్తుచేశారు. దాంతో సోవియట్ యూనియన్‌తో మన దేశం స్నేహం పెంచుకుంటోందని భావించి జర్మనీ, బ్రిటన్‌లో ఉక్కు ఫ్యాక్టరీల ఏర్పాటుకు సహకారం అందించడానికి ముందుకు వచ్చాయని చెప్పారు. ప్రతి కమ్యూనిస్టు చరిత్రను తెలుసుకోవాలని జేవీఎస్ఎన్ మూర్తి సూచించారు.

పోరాట పంథా మారాలి

ఓబులేసు పిలుపు

విశాలాంధ్ర-ఒంగోలు: భౌతిక పరిస్థితులకు అనుగుణంగా పోరాటాలలో మార్పు రావాల్సిన అవసరం ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు చెప్పారు. సైంటిఫిక్ సోషలిస్టు స్టడీ సర్కిల్ అధ్వర్యంలో మహత్తర అక్టోబర్ విప్లవం 105వ వార్షికోత్సవం సందర్భంగా ఒంగోలు మల్లయ్య లింగం భవనంలో సోమవారం 'అక్టోబర్ సోషలిస్టు విప్లవం-సమకాలీన ప్రపంచం' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. శాస్త్రీయ సామ్యవాద అధ్యయన వేదిక ప్రకాశం జిల్లా కన్వీనర్ ఎం.వెంకయ్య అధ్యక్షత వహించారు. ఓబులేసు మాట్లాడుతూ విప్లవం రష్యాలో రావడానికి, భారతదేశంలో రాకపోవడానికి చాలా కారణాలున్నాయన్నారు. 1905లో విప్లవం కోసం ప్రయత్నించి లెనిన్ విఫలమయ్యారన్నారు. 14 సంవత్సరాలు అజ్ఞాతవాసం గడిపిన తర్వాత...అనుకూల పరిస్థితులు గమనించి 1917 అక్టోబర్ 7న తిరిగి రష్యాలో అడుగుపెట్టి విప్లవం సాధించారన్నారు. దీంతో ప్రపంచవ్యాప్తంగా దోపిడీకి గురవుతున్న దేశాలకు కొత్త ఉత్సాహం లభించిందన్నారు. విముక్తి కోసం ఆ దేశాలు పోరాటాలు ప్రారంభించాయన్నారు. ఆ దేశాలకు రష్యా అండగా నిలిచిందన్నారు. భారత్ సహా అనేక దేశాలకు ఆర్థిక సహాయంతో పాటు సాంకేతికతను రష్యా అందించిందని గుర్తుచేశారు. రష్యా విప్లవాన్ని అణచివేయడానికి పెట్టుబడిదారీ దేశాలు అనేక ప్రయత్నాలు చేశాయన్నారు. ఈ ఎనిమిదేళ్లలో మోదీ సర్కారు రూ.1.58 లక్షల కోట్లు అప్పు చేసిందని, మీడియాను అడ్డు పెట్టుకొని అప్పులు, తప్పులను కప్పిపుచ్చుకుంటున్నదని ఓబులేసు విమర్శించారు. బీజేపీ, నరేంద్రమోదీ హామీలు ఒక్కటీ అమలు జరగలేదని మండిపడ్డారు. మోదీ హయాంలో దేశ ఆర్థిక పరిస్థితి మరింతగా దిగజారిందని, అన్ని వ్యవస్థలను నాశనం చేశారన్నారు. ఉపాధి లేక పెరిగిన నిత్యావసర ధరలతో ప్రజలు అల్లాడుతున్నారు. మహత్తర అక్టోబరు విప్లవం స్ఫూర్తితో అందరం ముందుకు సాగుదామని ఓబులేసు పిలుపునిచ్చారు. మార్క్సిస్టు తత్వశాస్త్ర విశ్లేషకులు బి.తులసేంద్ర మాట్లాడుతూ మనిషి పరిణామం తెలుసుకుంటే దోపిడీ ఎక్కడ నుండి ప్రారంభమైందో అర్థమవుతుందన్నారు. దోపిడీకి మూలాలు తెలుసుకోవచ్చన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ మాట్లాడుతూ ప్రతినెల 5వ తేదీన జరిగే సైంటిఫిక్ సోషలిస్ట్ స్టడీ సర్కిల్ కార్యక్రమాలలో ప్రజల విరివిగా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కమ్యూనిజం పత్రిక ఎడిటర్ ఎంసీ వెంకటేశ్వర్లు, ఎయిమ్స్ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ రామలింగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కళారంగాన్ని విస్మరించటం తగదు

ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు చంద్రనాయక్

విశాలాంధ్ర- శ్రీకాకుళం కలెక్టరేట్: సమాజాన్ని చైతన్యపరిచే ముఖ్య సాధనమైన కళారంగానికి నిధులు కేటాయించకుండా రాష్ట్ర ప్రభుత్వం విస్మరిస్తోందని ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు చంద్రనాయక్ తప్పుపట్టారు. సోమవారం స్థానిక అంబేద్కర్ ఆడిటోరి యంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కళారంగాభివృద్ధి కోసం ఏమాత్రం నిధులు కేటాయించలేదన్నారు. కళారంగానికి ప్రభుత్వ ఆదరణ లేనందువల్ల అనేక జానపద గ్రామీణ కళలు కనుమరుగైపోతున్నాయన్నారు. గత ప్రభుత్వాలు కొంత మేరకైనా కళారంగానికి బడ్జెట్లో నిధులు కేటాయించడం జరిగేదని, జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం కళా రంగాన్ని పూర్తిగా విస్మరించిందన్నారు. సాంస్కృతిక శాఖ వెలవెలబోతోందని, ఇప్పటికైనా తగురీతిలో నిధులు కేటాయించి కళారంగాభివృద్ధికి దోహదపడాలని ప్రజానాట్యమండలి తరపున ప్రభుత్వాన్ని కోరుతున్నానన్నారు. గతంలో కళాకారులకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని, ప్రస్తుతం కళాకారులకు ఇస్తున్న రూ.3వేలు పెన్షన్ రూ.5వేలు కు పెంచాలని, అనేక నాటక సమాజాలను ప్రోత్సహించడానికి బ్యాంకు ద్వారా రుణాలు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఉన్న కళాకారులందరికి గుర్తింపు కార్డులు ఇవ్వడంతో పాటు వారి అభివృద్ధి కోసం సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం కొనసాగిస్తే... కళాకారులు సమాజాభివృద్ధి కోసం తమ కళల ద్వారా కృషి చేస్తారని చెప్పారు. ఈ సమావేశంలో ప్రజానాట్యమండలి రాష్ట్ర ఉపాధ్యక్షుడు మహంతి లక్ష్మణ రావు, కోనసీమ జిల్లా ప్రజానాట్యమండలి కార్యదర్శి సామెల్ పాల్గొన్నారు.

నేటి దీక్షను జయప్రదం చేయండి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జంగాల అజయ్‌కుమార్

విశాలాంధ్ర-గుంటూరు: అమరావతిని రాజధానిగా కొనసాగించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ గుంటూరు, పల్నాడు జిల్లా కమిటీల సంయుక్త అధ్వర్యంలో 8వ తేదీన ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు గుంటూరు కలెక్టర్ కార్యాలయం వద్ద దీక్ష చేపట్టనున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జంగాల అజయ్‌కుమార్ తెలిపారు. గుంటూరు మల్లయ్యలింగం భవన్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అమరావతి రాజధాని విషయంలో రాష్ట్ర ప్రభుత్వం దుర్మార్గ వైఖరిని అవలంబిస్తోందన్నారు. మూడున్నరేళ్లుగా రాజధాని లేని రాష్ట్రంగా ఏపీని ఉంచారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జగన్ మూడు రాజధానుల పేరుతో ఆడుతున్న నాటకాన్ని కట్టిపెట్టి రాష్ట్రానికి అమరావతినే ఏకైక రాజధానిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. సీఆర్‌డీఏ చట్ట సవరణను ఉపసంహరించుకోవాలన్నారు. రాజధానిలో ఇళ్ల స్థలాల పేరిట ముఖ్యమంత్రి చేస్తున్న అమరావతి రాజధాని విచ్ఛిన్నకర వైఖరి విడనాడి, అమరావతి వెలుపల భూములు సేకరించి మూడు సెంట్లు చొప్పున పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలన్నారు. రాజధానిలో నిరుపేదలందరికీ పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు తక్షణమే కేటాయించాలన్నారు. దళితులకు, ఇతరులకు ఉన్న అసైన్డ్ భూములకు తక్షణమే కౌలు చెల్లిం చాలని విజ్ఞప్తి చేశారు. అమరావతి నుంచి అరసవల్లి వరకు జరుగుతున్న రైతుల పాద యాత్రకు ప్రభుత్వం-పోలీసులు ఎలాంటి అడ్డం కులు సృష్టించరాదని, పాదయాత్ర కొనసాగడానికి చర్యలు చేపట్టాలని కోరారు. ఆయా డిమాండ్లపై జరుగుతున్న ఈ దీక్షలో అమరావతినే రాజధానిగా కాంక్షించే వారితో పాటు జిల్లాలోని సీపీఐ నాయ కులు, కార్యకర్తలు, సానుభూతిపరులు పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సీపీఐ గుంటూరు నగర కార్యదర్శి కోట మాల్యాద్రి మాట్లాడుతూ అమరావతి రాజధాని కేవలం 29 గ్రామాలకు చెందినది కాదని, రాష్ట్రానికి రాజధాని అనే విషయాన్ని ముఖ్యమంత్రి గుర్తించి మనస్సు మార్చుకుని రాష్ట్రానికి ఏకైక రాజధానిగా అమరావతిని కొనసాగిస్తూ ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. మంగళవారం చేపట్టనున్న దీక్షలో గుంటూరులోని సీపీఐ శ్రేణులు, ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మేడా హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

సలహాదారులకు ప్రజాధనం సంతర్పణ: బాలకోటయ్య

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: 'అత్త సొమ్ము అల్లుడు దానం' చందంగా కోట్లాది రూపాయల ప్రజాసొమ్మును సలహాదారుల పేరిట ప్రభుత్వం తన అనుయాయులకు సంతర్పణ చేస్తున్నట్లు అమరావతి బహుజన జేఏసీ అధ్యక్షుడు పోతుల బాలకోటయ్య సోమవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. ప్రభుత్వం మూడేళ్లలో సలహాదారులకు 83.50 కోట్ల రూపాయలు చెల్లించిందని, ఐదేళ్లలో ఈ ఖర్చు రూ.138 కోట్లకు చేరుతుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వానికి 45 మంది సలహాదారులు ఎందుకని ఆయన ప్రశ్నించారు. మూడున్నరేళ్లలో వీరిచ్చిన సలహాల్లో ఒకటైనా చెప్పాలని డిమాండ్ చేశారు.

వైసీపీకి గత అసెంబ్లీ ఎన్నికలలో ఊడిగం చేసినందుకు, కృతజ్ఞతతో కృత్రిమ సలహాదారుల పోస్టులు సృష్టించి ప్రజాధనాన్ని పప్పుబెల్లాల్లా పంచుతున్నారని మండిపడ్డారు. సలహాదారులకు క్యాబినెట్ ర్యాంకు, కారు, బంగ్లా, సిబ్బంది వంటి సదుపాయాలు సమకూర్చి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని, ఈ సొమ్ముతో గ్రామాల్లో పడకేసిన పారిశుధ్య పనులకు, గతుకుల రహదారులకు ఖర్చు పెట్టవచ్చని బాలకోటయ్య ప్రభుత్వానికి సూచించారు.

రైతులను ఆదుకోవడంలో పాలకులు విఫలం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రామచంద్రయ్య విమర్శ

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు: దేశంలో మతతత్వ బీజేపీని ఓడించేందుకు వామపక్ష, లౌకిక, ప్రజాతంత్ర శక్తులను ఏకం చేసే దిశగా సీపీఐ అడుగులు వేస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పి. రామచంద్రయ్య తెలిపారు. సోమవారం ఇక్కడి సీఆర్ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఖరీఫ్‌లో అధిక వర్షాల కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. రైతులు పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులను ఆదుకోవడంలో ఇటు ప్రభుత్వం, అటు అధికారులు పూర్తిగా విఫలం చెందారన్నారు. వైసీపీ నేతలు ఇసుక, మద్యం, భూకబ్జాలతో కోట్ల రూపాయలు అక్రమార్జన చేసుకుంటున్నారన్నారు. రైతుల ప్రభుత్వం అని చెప్పుకోవడం తప్పితే రైతులకు చేసింది ఏమి లేదన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాల కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు ప్రభుత్వం నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చేసి ఆదుకోవా లని కోరారు. నకిలీ పత్తివిత్తనాల వలన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారనీ, నకిలీ విత్తనాల వ్యాపారులకు నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి అండగా ఉన్నారని చెప్పారు. ప్రభుత్వం వెంటనే నకిలీ విత్తనాలపై విచారణ జరిపి నిందితులపై చర్యలు తీసుకుని రైతులను ఆదుకోవాలని కోరారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు కె. జగన్నాథం, నగర కార్యదర్శి పి రామకృష్ణారెడ్డి, సహాయ కార్యదర్శి సి మహేష్, సీనియర్ నాయకులు మనోహర్‌మాణిక్యం, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి కె.నాగరాజు విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు.

యాగంటిలో కల్యాణ మండపానికి శంకుస్థాపన

విశాలాంధ్ర బ్యూరో- కర్నూలు: నంద్యాల జిల్లా, యాగంటి క్షేత్రంలో రూ. 3కోట్ల అంచనా వ్యయంతో టీటీడీ నిర్మించనున్న కల్యాణ మండపానికి టీటీడీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి సోమవారం శంకుస్థాపన చేశారు. శ్రీవాణి ట్రస్ట్ ద్వారా రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లోని పురాతన ఆలయాలను పునర్నిర్మిస్తున్నామని సుబ్బారెడ్డి చెప్పారు. పవిత్ర పుణ్య క్షేత్రమైన యాగంటిలో రూ.3కోట్లతో కల్యాణ మండపం నిర్మిస్తున్నామన్నారు. ఏళ్ళ క్రితం నిర్మించిన కల్యాణ మండపాలు మరమ్మతులకు నోచుకోలేదన్నారు. అవసరమైన కల్యాణ మండపాలకు మరమ్మతులు చేయించాలని తమ పాలక మండలి నిర్ణయం తీసుకున్నదని తెలిపారు. ఇందులో భాగంగానే నంద్యాలలో కల్యాణ మండపాన్ని పునర్నిర్మించడానికి చర్యలు చేపట్టామని ఛైర్మన్ తెలిపారు. దేశవ్యాప్తంగా సనాతన హిందూ ధర్మ ప్రచారానికి తమ పాలక మండలి పెద్ద ఎత్తున చర్యలు తీసుకుందని వివరించారు. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, ఎంపీ బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యేలు రామిరెడ్డి, రాంభూపాల్ రెడ్డి, హఫీజ్ ఖాన్, టీటీడీ ఈవో ధర్మారెడ్డి, జేఈవో సదాభార్గవి, ఎస్వీబీసీ సీఈవో షణ్ముఖ కుమార్, ఎస్ఈ జగదీశ్వర్‌రెడ్డి, వీజీఓ మనోహర్, శ్వేత డైరెక్టర్ ప్రశాంతి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఇనుపయుగపు ఆనవాళ్లు కనుమరుగు

కాపాడాలంటున్న పురావస్తు పరిశోధకుడు ఈమని

విశాలాంధ్ర-హైదరాబాద్: ఆదిమమానవుని ఆనవాళ్లకు ఆలవాలమైన తెలంగాణలో అలనాటి కట్టడాలు ఒక్కొక్కటిగా కనుమరుగౌతున్నాయని, వాటిని కాపాడుకొని భవిష్యత్తరాలకు అందించాలని పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్, సీఈవో ఈమని శివనాగిరెడ్డి ఒక ప్రకటనలో కోరారు. రామోజు హరగోపాల్ కన్వీనర్‌గా ఉన్న కొత్త తెలంగాణ చరిత్రబృందం సభ్యులు అహోబిలం కరుణాకర్, మహమ్మద్ నసీరుద్దీన్, కొరవి గోపాల్ ఇచ్చిన సమాచారంతో వారితో కలసి, సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం వరద రాజపురం, మేడ్చల్ జిల్లా మూడు చింతలపల్లి మండలం కేశవరం తండా పరిసరాల్లోని ఇనుపయుగపు ఆనవాళ్లను పరిశీలించారు. వరదరాజపురంలో ఊరి చివర ఒక చిన్న గుట్ట మీద అనేక బృహత్శిలాయుగపు సమాధులుండేవనీ, ప్రతి సమాధి ముందు ఒక నిలువురాయి ఉండేదని, వ్యవసాయపనుల విస్తరణలో భాగంగా అవి కనుమరుగవుతూ, ప్రస్తుతం ఒక్క నిలువురాయే ఉందన్నారు. కేశవరం తండా రోడ్డుకు రెండువైపులా గల వందల కొద్దీ ఇనుపయుగపు సమాధులు అంతరించి పోతున్నాయని తెలంగాణ పురాతన చరిత్రకు ఆధారమైన మిగిలి ఉన్న కొన్నింటినైనా కాపాడుకోవాలని శివనాగిరెడ్డి ఆయా గ్రామాలకు చెందిన రైతులకు విజ్ఞప్తి చేశారు.

ఎంఈసీ స్థానంలో సైన్స్ గ్రూప్‌లు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఎస్సీ గురుకులాల్లో ఇంటర్మీడియట్‌లో విద్యార్థుల నుంచి పెద్దగా డిమాండ్ లేని ఎంఈసీ స్థానంలో సైన్స్ గ్రూప్‌లను ప్రవేశపెట్టడానికి వెంటనే చర్యలు తీసుకోవాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మేరుగు నాగార్జున అధికారులను ఆదేశించారు. గురుకులాల్లో వచ్చే విద్యా సంవత్సరం నుంచే కొత్త కోర్సులు ప్రారంభమయ్యేలా చూడాలని సూచించారు. బీఆర్ అంబేద్కర్ గురుకులాల కార్యకలాపాలపై సోమవారం సచివాలయంలో జరిగిన సమావేశంలో నాగార్జున అన్ని అంశాలను సమీక్షించారు. గురుకులాల్లో మొత్తం 1.17లక్షల సీట్లు ఉండగా వీటిలో ప్రస్తుతం 1.09లక్షల సీట్లు భర్తీ అయ్యాయని చెప్పారు. ఖాళీగా మిగిలిపోయిన సీట్లలో ఎక్కువగా ఇంటర్మీడియట్‌కు చెందినవే ఉన్నాయన్నారు. ఇంటర్‌లో ఎంపీసీ, బైపీపీ వంటి సైన్స్ సీట్ల కోసం పోటీ పడుతున్న విద్యార్థులు ఎంఈసీలో చేరడానికి ముందుకు రాని కారణంగానే సీట్లు ఖాళీగా మిగిలే పరిస్థితి ఏర్పడుతోందన్నారు. ఎంఈసీ కోర్సుల స్థానంలో విద్యార్థులు ఎక్కువగా కోరుకుంటున్న ఎంపీసీ, బైపీసీ సీట్లను ప్రవేశపెట్టాలని అధికారులకు సూచించారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచే కొత్త కోర్సులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థులకు జాబ్ గ్యారెంటీ ఇచ్చే మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ వంటి కోర్సులను జిల్లా కేంద్రాల్లో అందుబాటులోకి తీసుకు రావాలని కోరారు. ప్రస్తుతం ఎస్సీ గురుకులాల్లో విద్యా ప్రమాణాలను మరింతగా మెరుగుపర్చడానికి అమలు చేస్తున్న విధానాలపై ప్రిన్సిపాళ్లు, డీసీఓలు దృష్టి పెట్టేలా చూడాలని, ఈ విషయంలో బాధ్యతా రాహిత్యంగా ప్రవర్తించే ప్రిన్సిపాళ్లు, డీసీఓలపై చర్యలు తీసుకోవాలని నాగార్జున అధికారులను ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా 189 గురుకులాల్లో 181 గురుకులాలకు సొంత భవనాలు ఉన్నాయని, మిగిలిన 8 గురుకులాలకు సంబంధించిన భవన నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయని అధికారులు వివరించగా, వాటిని వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. గురుకులాల్లో ఎస్సీ, ఎస్టీ, బ్యాక్‌లాగ్ పోస్టులను, కేర్ టేకర్లు, లైబ్రేరియన్ల ఖాళీల భర్తీకి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గురుకులాల్లో పని చేస్తున్న పార్ట్ టైం టీచర్ల వేతనాలను సవరించే విషయాన్ని రాబోయే బీఓజీ సమావేశంలో పెట్టి తీర్మానించాలన్నారు. సాంఘిక సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఆర్.జయలక్ష్మి, గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి పావనమూర్తి, ఏఎంఓ సంజీవరావు పాల్గొన్నారు.

మల్లన్న సేవలో ప్రముఖులు

విశాలాంధ్ర-శ్రీశైలం: కార్తీక పౌర్ణమి, సోమవారం సందర్భంగా అనేకమంది ప్రముఖులు శ్రీశైల మహా క్షేత్రంలోని శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్లను దర్శించుకుని సేవించుకున్నారు. నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డి, ఏపీ టూరిజం మంత్రి ఆర్‌కే రోజా, శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి ఆలయానికి రాగా, వీరికి రాజగోపురం వద్ద ఆలయ కార్య నిర్వహణాధికారి ఎస్ లవన్న సాదర స్వాగతం పలికారు. అనంతరం స్వామి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అమ్మవారి ఆశీర్వచనం మండపంలో ప్రముఖులను ఆలయ అర్చక స్వాములు ఆశీర్వదించి స్వామి, అమ్మవార్ల తీర్థప్రసాదాలు, జ్ఞాపకలను అందించారు.

విపక్షాలను అణచి వేయడమే సర్కారు ధ్యేయం: వీర్రాజు

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: రాష్ట్ర ప్రభుత్వం విపక్షాల మీద అణచివేత చర్యలకు పాల్పడుతోందని, కేంద్ర ప్రభుత్వం నిధులతోనే విశాఖ అభివృద్ధి జరిగిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు అన్నారు. సోమవారం విశాఖపట్నం బీజేపీ కార్యాలయంలో ఎంపీ జీవీఎల్ నరసింహారావు, ఎమ్మెల్సీ మాధవ్‌తో కలిసి మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ఏపీ రాజధాని అమరావతికే తమ పార్టీ కట్టుబడి ఉందని, రోజూ అబద్ధాలు ఆడేవారు, అవినీతిపరులు చేసే వ్యాఖ్యలపై తమను ఎందుకు ప్రశ్నిస్తారంటూ మీడియాపై వీర్రాజు మండిపడ్డారు. 'రాజధానిపై మాట మార్చి, మూడు రాజధానులు అంటున్న అబద్ధాలోడికి మేం సమాధానం చెప్పాలా? సీఎం జగన్‌ని ప్రశ్నించండి. మూడు రాజధానులు అంటున్న వాడిని అడగకుండా, ఒక రాజధాని అంటున్న మమ్మల్ని ప్రశ్నలు అడుగుతారెందుకు?' అంటూ సోము వీర్రాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. హోదా వద్దని చంద్రబాబు ప్యాకేజి తీసుకున్నారన్నారని, స్టీల్ ప్లాంట్‌ని అదానికి అమ్మేసిన వారినే మీరు ప్రశ్నించాలన్నారు. విశాఖలో రైల్వేజోన్‌తో సహా జరుగుతున్న అనేక కార్యక్రమాలకు అందరిని ఆహ్వానిస్తామన్నారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ని కూడా ఆహ్వానిస్తారా అంటే సమాధానం చెప్పకుండా వీర్రాజు దాటవేశారు. కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని తమ ఖాతాలో వేసుకునేందుకు వైసీపీ ఉబలాట పడుతోందని వీర్రాజు వ్యాఖ్యానించారు. ప్రధాని మోదీ ఈనెల 11 తేదీ సాయంత్రం 6:25కు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారని, పార్టీ తరపున ఘన స్వాగతం పలికి, అనంతరం రోడ్ షో నిర్వహిస్తామన్నారు. అధిష్ఠానమే రోడ్ షో మార్గం నిర్ణయిస్తుందని, తాము రెండు రూట్లు పంపామని, ఒకటి ఎన్ఏడీ వద్ద పాత ఐటీఐ నుంచి, రెండోది బీచ్ రోడ్ అన్నారు.

సంపాదకీయం

ఉప ఎన్నికల గుణపాఠాలు

బిహార్‌లోని రెండు శాసనసభా నియోజకవర్గాలకు, ఉత్తరప్రదేశ్, హర్యానా, మహారాష్ట్ర, తెలంగాణ, ఒడిశాలోని ఒక్కో స్థానానికి జరిగిన ఉపఎన్నికల్లో బీజేపీ నాలుగు స్థానాలు సంపాదించింది. బిహార్‌లోని రెండుచోట్ల ఉపఎన్నికలు జరిగితే లాలూ ప్రసాద్ యాదవ్ నాయకత్వంలోని రాష్ట్రీయ జనతా దళ్ (ఆర్.జె.డి.) ఒక స్థానం సంపాదించింది. ఒక సీటు బీజేపీకి దక్కింది. ఈ ఉపఎన్నికల్లో బాగా నష్టపోయింది కాంగ్రెస్. హర్యానాలోని ఆదంపూర్, తెలంగాణలోని మునుగోడు శాసన సభా స్థానాలు ఇంతకు ముందు కాంగ్రెస్ చేతిలో ఉండేవి. ఆదంపూర్‌లో బీజేపీ విజయం సాధిస్తే మునుగోడు స్థానాన్ని టిఆర్‌ఎస్ స్వాధీనం చేసుకుంది. ఆదంపూర్‌లో మాత్రమే కాంగ్రెస్ రెండవ స్థానంలో నిలిచింది. మునుగోడులో కాంగ్రెస్ 10.58 శాతం ఓట్లు సాధించి మూడో స్థానంలోకి వెళ్లడం విఘాతమే. ఒడిశాలోని ధాంనగర్‌లో కాంగ్రెస్ పరిస్థితి మరీ దిగజారి కేవలం 2.18 శాతం ఓట్లు మాత్రమే సాధించగలిగింది. ధాంనగర్‌లో బీజేపీ అభ్యర్థి సూర్యవంశి సూరజ్ బిజూ జనతాదళ్ అభ్యర్థిని ఓడించడం నవీన్ పట్నాయక్ పార్టీకి ఎదురుదెబ్బే. కానీ అక్కడ బిజూ జనతా దళ్ తిరుగుబాటు అభ్యర్థి ఆ పార్టీ విజయావకాశాలను దెబ్బ తీశారు. బిహార్‌లోని గోపాల్ గంజ్ నియోజకవర్గాన్ని బీజేపీ నిలబెట్టుకోగలిగింది. ఉప ఎన్నికలకు ముందు బీజేపీ ఈ ఏడింట్లో మూడు స్థానాలు ఉంటే ఇప్పుడు నాలుగు స్థానాల్లో విజయం సాధించింది. హర్యానాలోని ఆదంపూర్ స్థానాన్ని బీజేపీ అదనంగా సాధించింది. బిహార్‌లో గోపాల్ గంజ్, మొకామా స్థానాలకు ఉప ఎన్నికలు జరిగితే గోపాల్ గంజ్ బీజేపీకి దక్కింది. ఈ స్థానం ఇంతకు ముందు బీజేపీ చేతిలోనే ఉండేది. అక్కడ ఎమ్మెల్యేగా ఉన్న సుభాష్‌సింగ్ మృతి కారణంగా ఉపఎన్నిక అవసరమైంది. బీజేపీ సుభాష్ సింగ్ భార్యను పోటీ చేయించింది. సాధారణంగా ఇలాంటి సందర్భాలలో మృతుడి కుటుంబానికి సానుభూతి ఉంటుంది కనక బీజేపీ విజయం మహత్తరమైంది ఏమీ కాదు. బిహార్‌లోని గోపాల్ గంజ్ స్థానాన్ని బీజేపీ అభ్యర్థి కుసుందేవీ సాధించినప్పటికీ ఆర్.జె.డి. అభ్యర్థి మోహన్ ప్రసాద్ గుప్తా కన్నా కేవలం 1794 ఓట్ల మెజారిటీ మాత్రమే దక్కింది. అంటే అక్కడ ఆర్.జె.డి. గట్టి పోటీ ఇచ్చింది. బిహార్‌లో రెండు చోట్ల జరిగిన ఉపఎన్నికలకు ప్రత్యేక ప్రాధాన్యత ఉంది. ఎందుకంటే బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ బీజేపీతో తెగతెంపులు చేసుకుని ఇటీవలే ఆర్.జె.డి.తో కలిసి మూడు నెలల కింద ప్రభుత్వం ఏర్పాటు చేశారు. మారిన రాజకీయ సమీకరణల ప్రభావం ఉంటుంది కనక ఈ రెండు స్థానాల ఫలితాలకూ ప్రత్యేకత ఉంది. మారిన రాజకీయ సమీకరణలను దృష్టిలో ఉంచుకుంటే గోపాల్ గంజ్ నియోజకవర్గంలో బీజేపీ గెలవడం నితీశ్, తేజస్వీ యాదవ్ నాయకత్వంలోని మహాఘట్బంధన్‌కు ఎదురుదెబ్బ అని ప్రచారంచేసే ప్రయత్నం జరుగుతోంది. కానీ ఈ నియోజక వర్గంపై 2005 నుంచే బీజేపీ పట్టు ఉంది. అలాంటి చోట కూడా తక్కువ మెజారిటీతో గట్టెక్కడం బీజేపీ బలహీనతకిందే లెక్క. 2020లో ఇదే నియోజకవర్గాన్ని బీజేపీ 36,000 ఓట్ల మెజారిటీతో సాధించిన విషయాన్ని గుర్తుంచుకుంటే బలహీనపడినట్టే లెక్క. బీజేపీ గోపాల్‌గంజ్ నియోజకవర్గాన్ని నిలబెట్టుకోవడానికి మరో కారణం ఒవైసీ నాయకత్వంలోని ఎం.ఐ.ఎం. అక్కడ అభ్యర్థిని నిలబెట్టి ఆర్.జె.డి.ని సమర్థించే ముస్లింల ఓట్లను చీల్చింది.

ఎం.ఐ.ఎం. అభ్యర్థి అబ్దుల్ సలాంకు 12,000 ఓట్లు వచ్చాయి. అదీగాక లాలూతో సత్సంబంధాలు లేని ఆయన బావమరిది సాధూయాదవ్ తన భార్య ఇందిరాయాదవ్‌ను బహుజన్ సమాజ్ అభ్యర్థిగా నిలబెట్టారు. ఆమెకు 9000 ఓట్లు వచ్చాయి. ఈ రెండు ఆటంకాలూ లేకపోతే ఆర్.జె.డి. ఈ స్థానాన్ని సునాయాసంగా గెలవడమే కాక బీజేపీ గాలికి కొట్టుకు పోయేది. మొకామా స్థానాన్ని ఆర్.జె.డి. నిలబెట్టుకుంది. ఉత్తరప్రదేశ్‌లోని గొలా గోకరణ్ నాథ్ నియోజకవర్గంలో సమాజ్‌వాదీ పార్టీ బీజేపీకి గట్టి పోటీ ఇవ్వడంలో విఫలమైంది. మహారాష్ట్రలోని అంధేరీ తూర్పు నియోజవర్గం నుంచి ఉద్ధవ్ ఠాక్రే వర్గానికి చెందిన అభ్యర్థి విజయం ఆ పార్టీకి తాత్కాలిక ఉపశమనం మాత్రమే కలిగిస్తుంది. ఎందుకంటే అక్కడ బీజేపీ పోటీ చేయలేదు.

బీజేపీకి అసలైన ఎదురుదెబ్బ తెలంగాణలోని మునుగోడులో తగిలింది. మునుగోడు నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న కాంగ్రెస్ నాయకుడు కోమటిరెడ్డి రాజ్‌గోపాల్‌రెడ్డి బీజేపీలో చేరి శాసనసభ్యత్వానికి రాజీనామా చేసినందువల్ల అక్కడ ఉప ఎన్నిక అవసరమైంది. ఇలాగే బీజేపీలో చేరిన ఈటల రాజేందర్ ఉపఎన్నికలో పోటీచేసి గెలిచారు. కానీ బీజేపీ అభ్యర్థిగా రంగంలోకి దిగిన రాజగోపాల్‌రెడ్డిని ఓడించడం ద్వారా కె.చంద్రశేఖరరావు నాయకత్వంలోని తెలంగాణ రాష్ట్రసమితి తన ఆధిపత్యాన్ని నిలబెట్టుకోగలిగింది. ఈ విజయం ప్రతిపక్షాలు కలిసికట్టుగా ఉంటే బీజేపీని ఓడించడం అసాధ్యం కాదని రుజువు చేసింది. మునుగోడు చాలాకాలం కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ)కి కంచుకోట. ఈ సారి బీజేపీని ఓడించి తీరాలన్న దృఢ సంకల్పంతో ఉభయ కమ్యూనిస్టు పార్టీలు టి.ఆర్.ఎస్. అభ్యర్థికి మద్దతిచ్చాయి. మొన్నటి దాకా మునుగోడు తమ అధీనంలోని నియోజకవర్గమే కనక కాంగ్రెస్ పాల్వాయ్ గోవర్ధన్ రెడ్డి కూతురు స్రవంతిని పోటీ పెట్టినా ఆమెకు డిపాజిట్ కూడా దక్కలేదు. ఉప ఎన్నికలు జరుగుతున్న సమయంలోనే రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర తెలంగాణ ద్వారా సాగుతున్నందువల్ల కాంగ్రెస్ నాయకులు ఉప ఎన్నికపై పెట్టాల్సినంత శ్రద్ధ పెట్టలేదు అని సాకులు వెదకొచ్చు కానీ టి.ఆర్.ఎస్., వామపక్షాల కలయిక ప్రత్యర్థికి ఎలాంటి అవకాశమూ లేకుండా చేసింది. కొత్తగా బీజేపీ తీర్థం పుచ్చుకున్న రాజగోపాల్ రెడ్డిని గెలిపించడానికి బీజేపీ సర్వప్రయత్నాలూ చేసింది. సకలవిధ మాయోపాయాలూ పన్నింది. విచ్చల విడిగా డబ్బులు వెదజల్లింది. "నేనే గుజరాత్"అని బోర విరుచుకుని ప్రకటిస్తున్న మోదీ ఆటలు మునుగోడులో ఎంత మాత్రం సాగలేదు. ఈ ఉపఎన్నికలు దేశ రాజకీయాలను తారుమారు చేయక పోవచ్చు. అయితే 2023లో మేఘాలయ, నాగాలాండ్, త్రిపుర, కర్నాటక, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్, తెలంగాణ శాసనసభలకు ఎన్నికలు జరగవలసి ఉంది. మోదీని ఓడించడానికి ఐక్యత ఎంత అవసరమో ప్రతిపక్షాలు గ్రహిస్తాయని ఆశిద్దాం.

వైట్ హౌస్ (వృత్తంలో బైడెన్)

అమెరికా దుర్మార్గాలపై ఐరాసలో ఆగ్రహం

ఎం.బెంజమిన్
నటషలిసియ బరాబన్నన్

దాదాపు ఆరు దశాబ్దాలుగా అమెరికా దిగ్బంధం, దాష్టీకాలను తట్టుకొని పురోగమిస్తున్న సోషలిస్టు దేశం క్యూబా. తాజాగా అమెరికా చర్యలు అనైతికం, చట్టవిరుద్ధం, క్రూరం, బెదిరింపు, నేరపూరితం, అసభ్యకరం, నిర్లక్ష్యం, దుర్మార్గం అని ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో 185 దేశాలు దునుమాడాయి. ఈ మేరకు తీర్మానం కూడా సభ ఆమోదించింది. రెండు దేశాలు అమెరికా-ఇజ్రాయిల్ తీర్మానాన్ని వ్యతిరేకించాయి. తక్షణం క్యూబాపైన ఆర్థిక దిగ్బంధనాన్ని ఎత్తివేయాలని అమెరికాను తీర్మానం కోరింది. గత ఏడాదికూడా ఇలాగే తీర్మానం చేసినప్పటికీ అమెరికా స్పందించలేదు. అమెరికాకు ఇజ్రాయిల్ అణగిమణిగి ఉంటోంది. గత ఏడాది కూడా అమెరికా నుంచి 38 బిలియన్ డాలర్లు సహాయం పొందింది. పలస్తీనా ప్రత్యేక దేశంగా గుర్తింపు పొందకుండా అక్కడి ప్రజలను హింసిస్తున్న ఇజ్రాయిల్‌కే అమెరికా అండగానిలుస్తోంది. ఎలాంటి సైనిక, అణుముప్పులేని దేశాలపై ఆర్థిక రాజకీయ యుద్ధం చేయరాదన్న ఐరాస నిర్ణయాన్ని సైతం అమెరికా ఉల్లంఘిస్తోంది. చిన్నచిన్న దేశాలకు ఆర్థిక సహకారాన్ని నిలిపివేయడం ద్వారా ఆ దేశాలను బెదిరించి తనకు అనుకూలంగా మార్చుకుంటున్న అమెరికా క్యూబాపైన మాత్రం అనేక ఆంక్షలు విధిస్తూనే ఉంది. క్యూబాపై దీర్ఘకాలంగా ఆంక్షలను తొలగించాలని సహచర దేశాలు కెనడా, బ్రిటన్, ఆస్ట్రేలియా, జపాన్ తదితర దేశాలు అమెరికా విధానాన్ని వ్యతిరేకిస్తున్నాయి.

క్యూబా సంఘర్షణ పడుతున్న సాయుధ గ్రూపుల మధ్య శాంతి చర్చలు జరపడానికి ఎల్లవేళలా సిద్ధంగా ఉంటుందని కొలంబియా ప్రశంసించింది. 40ఏళ్లుగా కొలంబియాలో సాయుధ గ్రూపులను శాంతి బాటపట్టించడానికి క్యూబా కృషి చేస్తుండగా అమెరికా ఆయా సాయుధ గ్రూపులకు ఆయుధాలను విక్రయిస్తూ సంఘర్షణలను ప్రోత్సహిస్తోంది. క్యూబా దిగ్బంధనం అమానుషమని కెన్యా విమర్శించింది. 2030నాటికి సుస్థిర అభివృద్ధి లక్ష్యాల ఐరాస తీర్మానాన్ని అమలు చేయడానికి క్యూబాకు, అమెరికా అడ్డుపడుతోందని కంబోడియా వ్యాఖ్యానించింది. దిగ్బంధం కారణంగా క్యూబా 130 బిలియన్ డాలర్లు నష్టపోయి ఉంటుందని ఐరాస అంచనావేసింది. ఐరాస చార్టర్‌ను (శాసనపత్రం) సైతం ఉల్లంఘించిందని వియత్నాం విమర్శించింది. అమెరికా విదేశాలపట్ల అనుసరిస్తున్న వైఖరిపట్ల ఫిలిప్పీన్స్ ఆందోళన వ్యక్తం చేసింది. కోవిడ్-19 మహమ్మారి విజృంభించినప్పుడు కూడా అమెరికా అనుసరించిన క్రూరమైన విధానాన్ని మెక్సికో దునుమాడింది. ఈ సమయంలో క్యూబా అనేక దేశాలకు వైద్యం, వాక్సిన్ల సరఫరా సహాయాన్ని అందించింది. 21వ శతాబ్దంలోనూ క్యూబాను దిగ్బంధించి లక్షలాది కుటుంబాలు అష్టకష్టాలు పడడానికి అమెరికా కారణమని ఎరిట్రియా విమర్శిస్తూ అన్ని దేశాలు నిరసన తెలపాలని కోరింది. అమెరికా విధానం అనేక దేశాల ప్రజలను శిక్షిస్తోందని వివిధదేశాల ప్రతినిధులు తీవ్రంగా విమర్శించారు.

బరాక్ ఒబామా అమెరికా అధ్యక్షుడుగా ఉండగా క్యూబాపై ఆంక్షలు సడలించి దౌత్యసంబంధానికి యత్నించగా ట్రంప్ వచ్చాక ఆ సడలింపులను రద్దు చేశాడు. జో బైడెన్ వచ్చాక ఒబామా అనుసరించిన విధానాలను అనుసరిస్తానని చెబుతున్నప్పటికీ ట్రంప్ విధానాలనే ఆచరణలో పెట్టాడు. ప్రస్తుతం క్యూబా ఆర్థిక, ఇంధన తదితర రంగాలలో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటోంది. క్యూబా ప్రజల మానవహక్కులను సైతం ఉల్లంఘిస్తూ అమెరికా దుర్మార్గంగా వ్యవహరించడం వల్ల అక్కడి ప్రజలు తీవ్రకష్టాలు ఎదుర్కొంటున్నారు. ప్రపంచ ఆధిపత్యానికి అర్రులుచాస్తున్న అమెరికా తన పొరుగున సోషలిస్టు దేశం మనుగడ సాధించడాన్ని సహించలేకుండా ఉంది. అమెరికా ఆంక్షలవల్ల వివిధ రకాల ముడిఖనిజాలను, వస్తువులను, వనరులు, ఆర్థిక, ఆహార, వైద్యపరికరాల కొరతను ఎదుర్కొంటోంది. వీటిని దిగుమతి చేసుకునేందుకు అవకాశం కలిగితే క్యూబా ప్రభుత్వం ప్రజలకు మరింతగా మెరుగైన జీవనాన్ని అందించగలదు. దిగ్బంధం ఆర్థికపరమైన శిక్ష. సైద్ధాంతిక విభేదాలు ప్రజల్లో ఉన్నప్పటికీ క్యూబాలో ప్రభుత్వాలు ఏర్పడి దేశ ప్రజలందరి సంక్షేమం కోసం పాటు పడుతున్నాయి. అయితే ఇతర దేశాల నుంచి క్యూబాను ఒంటరి చేయడమే అమెరికా దీర్ఘకాలంగా అనుసరిస్తున్న విధానం.

అమృతకాలంలో ఏం జరుగుతుంది?

సంగిరెడ్డి హనుమంతరెడ్డి

అమృతం వైదికులకే. ఆధిపత్యం అధికారవర్గాలకే. శ్రామికులకు, బలహీనులకు విషామృతమే గతి. భారత స్వాతంత్ర్యం 75వ ఏట 2021లో ప్రవేశించిన సందర్భంగా జరిగిన స్వాతంత్ర్య ఉత్సవాన ప్రధాని అమృతకాలం పదం వినియోగించారు. విజయసాధనకు కొత్త పనుల ప్రారంభానికి నిర్దోష వేళను సూచించే వైదిక జ్యోతిష్య పదం ఇది. 2022 బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి, 2022 స్వాతంత్ర్య దినోత్సవాన ప్రధాని ఈ పదాన్ని చాలాసార్లు పలికారు. శ్రేష్ఠ భారత విజయానికి పౌరులు బాధ్యతలు తెలుసుకోవాలని మోదీ నొక్కి చెప్పారు. ముస్లింలు హక్కులు అడగరాదన్నది సంఘ్ తాత్వికత. పౌరులే హక్కులు అడగరాదన్నది మోదీయం. 2022 ఆగస్టు 2047 ఆగస్టు మధ్యకాలం అమృత కాలమని మోదీ వాదన. స్వాతంత్ర్య అమృత మహోత్సవమనీ అన్నారు. సమాజ లక్ష్యాల పూర్తికి అమృతకాలం సువర్ణావకాశమని, అభివృద్ధ దేశం, వలసవాద విముక్తి, వారసత్వ గర్వం, సమైక్యత సమగ్రతలు, బాధ్యతా ప్రాధాన్యత అన్న పంచ పౌరసంకల్పాలను బోధించారు.

ఈ అంశాలు చోటుచేసుకునే పరిస్థితులున్నాయి. ఆదినాగు తాడుగా దేవదానవులు పాలసముద్రాన్ని చిలికారు. అసురులు(సారా తాగనివారు) నాగుతలవైపు విషాన్ని భరించారు. సురులు(సారా తాగేవారు) తోక పట్టుకు ఊగారు. చంద్రుడు, పారిజాతం, కల్పవృక్షం, కామధేనువు, దేవసారా దేవత, అప్సరసలు, ఐరావతం, లక్ష్మి, ఉచ్చైశ్వం, పాంచజన్యం, గద, ధనుషు, రత్నాలు, ధన్వంతరి, అమృతం సముద్రం నుండి వెలువడ్డాయి. అన్నిటినీ దేవతలు మోసంతో కొట్టేశారు. అమృతంతాగి అమరులయ్యారు. శ్రమ దోపిడీ నిరసన అణచివేతే రాహుకేతువుల హత్యలు.

మోదీ ప్రభుత్వ నూతన విద్యా విధానంలో ప్రజావ్యతిరేకతలతో పాటు విద్యా వ్యవస్థను ధార్మిక సంస్థలకు అప్పగించడం ప్రధాన అంశం. అప్పగించిన వాటిలో సరస్వతి మందిర్లు, దీనానాథ్ బాత్రా అధీనంలోని సంఘ్ విద్యాభారతి, ప్రజ్ఞాభారతి, 'మోదీ భారతి' బీజేపీ ధార్మికసంస్థలు. హిందీ రాజభాష అవుతుంది. వినోదం పేరుతో వైదిక మత ప్రచారం పెరుగుతుంది. హిందూయేతరులపై ద్వేషం పెంచే సినిమాలను నిర్మిస్తారు. హిందూయేతరులపై దాడులు, హింస, హత్యలు పెరుగుతాయి. అదాని, అంబానీలే వివిధరంగాల వాణిజ్యంలో ఉంటారు. జలశక్తి మంత్రిత్వశాఖ గంగోత్సవం జరిపింది. నదీహారతి, బట్టలు, వస్తువులు నదిలో పారేయడం ఇందులో భాగాలు. కర్ణాటక బీజేపీ ప్రభుత్వం విద్యాలయాల్లో రోజూ10 నిమిషాల ధ్యానం తప్పని సరిచేసింది. గుజరాత్ ప్రభుత్వం ఉమ్మడి పౌరస్మృతి అమలుప్రక్రియ మొదలు పెట్టింది. ఇది దేశమంతా వ్యాపిస్తుంది. అందులో అధిక్య మత భావాలను, సాంప్రదాయాలను మాత్రమే పొందుపరుస్తారు. శాకాహారమే తినాలి. శాఖ,కుల,మతాంతర వివాహాలు నిషేధం. మనుస్మృతి రాజ్యాంగం, కాషాయ జండా జాతీయ

పతాకం, గోవు జాతీయ జంతువు, కమలం జాతీయ పుష్పం అవుతాయి. మోదీ జాతిపిత అవుతారు. 75 శాతం పోలీసులు, న్యాయవాదులు కొందరు న్యాయమూర్తులు సంఘ్ భావజాల బానిసలు. సంఘ్ భావజాల సైన్యాధికారులు అందలాలెక్కారు. అలా ఎక్కించడానికి నియమాలను ధిక్కరించారు. మార్చారు. అగ్నిపథ్ ఈ పరిస్థితిని తారుమారు చేస్తుంది. సైన్యంలోకి సంఘ్ భావజాల వ్యక్తులు ఎన్నికవుతారు. వారిలో దిగ్గజాలను కొనసాగిస్తారు. ఇతరులను బజారున పడేస్తారు. వివస్త్రులను చేసి ధర్మ, రామ, హనుమాన్ వంటి హిందు సేనలలో, బజరంగదళ్ వంటి సమాంతర సంఘ్ సైనిక సంస్థలలో సభ్యులుగా, శిక్షకులుగా చేర్చుతారు. సమాజ కాషాయీకరణ జరుగుతుంది. మిగిలినవారు సామాజిక వ్యర్థులుగా రిజర్వ్ వైదిక సైన్యంగా మారతారు.

హిందువులకు మాత్రమే పౌరసత్వం ఉంటుంది. వలసవచ్చిన హిందువులకూ పౌరసత్వమిస్తారు. వీరికే ఓటు హక్కు జీవించే హక్కు ఉంటాయి. పుట్టుకతో భారతీయులైనా ఇతర మతస్తులు, ప్రత్యేకించి ముస్లింలు పౌరసత్వం కోల్పోతారు. వారికి ఓటు, జీవించే హక్కులు ఉండవు. వారు శరణార్థి శిబిరాలలో, జైళ్ళలో జీవించాల్సిందే. వైదికమతమే ఉంటుంది. ఇతర మతాలన్నీ మాయమౌతాయి. హిందు గుళ్ళను మాత్రమే పునర్నిర్మిస్తారు. కడతారు. ఇదే ప్రగతి సూచీగా ప్రచారం చేస్తారు. హిందుత్వ పూజా సామగ్రి, వస్తుసేవలను వైదికులే అమ్మాలి. ఇతర మతస్తులు అమ్మరాదు. ఇతర మత వస్తుసేవలను వైదికులు అమ్మవచ్చు. హిందు ఆలయాల వద్ద ఇతర మతస్తులు భిక్షమెత్తరాదు. గోమాతలను వైదిక మతవాదులు రోడ్లపై వదిలేయవచ్చు. గోరక్షణాలయాల్లో గడ్డిపెట్టకుండా చంపవచ్చు. ముస్లింలు గోవులను రక్షించినా వారిని చంపుతారు. ముస్లింల ఫ్రిజ్‌లో గోంగూర పచ్చడి కూడా గోమాంసమే. గేటెడ్ కమ్యూనిటీలలో, అపార్టుమెంట్లలో, ఆస్పత్రుల్లో హిందు ఆలయాలనే కడతారు.

గతపాలనలో ప్రభుత్వ పనే దైవకార్యం అనేవారు. బీజేపీ సుపరిపాలనలో దైవకార్యమే, ఆధిపత్య మత కార్యాలే రాజ ధర్మాలు. ప్రగతి కార్యాలు. కుంభమేళాలు, నదీ హారతులే ప్రజాసేవలు. ఇతర మతాచారాలు దేశద్రోహాలు.

హిందు ఆలయాల నిర్మాణ, ప్రారంభ కార్యక్రమాల్లోనే ప్రధాని ప్రధాన పూజారిగా పాల్గొంటారు. చర్చిలు, మసీదులు పట్టవు. వైదికాన్ని పెంపొందించే బీజేపీ మాత్రమే 'ఒక దేశం ఒక పార్టీ' సూత్రం కింద ఉంటుంది. ఇతర పార్టీల ఉనికి ఉండదు. సంఘీయులు, మోదీయులు మాత్రమే నీతిపర రాజకీయ కిరీటాలు ధరిస్తారు. భాజపేయ జంధ్యం ధరించినవారు పునీతులవుతారు. ఇతరులను అవినీతిపరులుగా, అక్రమ సంపాదనాపరులుగా సీబీఐ, ఈడీ, ఎన్ఐఏ నిరూపిస్తాయి. ఈ ప్రహసనానికి అవినీతి నిర్మూలన, జాతి సంపద రక్షణ వంటి బిరుదులు ఇస్తారు. ప్రతిపక్షపాలిత రాష్ట్రాలలో, ఒకవేళ ఉంటే, గవర్నర్లు సమాంతర పాలకులవుతారు. చట్టసభల్లో, పదవుల్లో హిందువులే ఉంటారు. అసత్యవాదులు, పగటివేషగాళ్ళు, పాములాటగాళ్లు పాలకులుగా స్థిరపడతారు. గాంధీ హంతకులతో సహా హంతకులు, అత్యాచారులు, సంఘ్ నాయకులే దేశభక్తులు. ప్రాయోజితాలకు అర్హులు. కూరగాయల అంగళ్లు, చిల్లర కొట్లలో కూడా మోదీ బొమ్మలు పెట్టాలి. లేకుంటే కేంద్ర మంత్రులు దండెత్తుతారు. నిధులను ఆపేస్తారు. పాలనలో,చట్ట నిర్మాణంలో రాజ్యాంగ లొసుగులను వాడుకుంటారు. లౌకిక, సామ్యవాదంవంటి పదాల స్థానంలో వైదిక మతం వంటి పదాలకు చోటు కల్పిస్తారు.

చట్టసభల్లో పాలకుల ప్రవచనాలే చట్టాలు. చర్చలు, భిన్నాభిప్రాయాలు, స్త్రీ, శిశు, బలహీనవర్గాల శ్రేయస్సుకు తావుండదు. అమృతకాలం హిందువులకే. బహిరంగ ప్రదేశాల్లో మత నిర్మాణాలను కాపాడాలని 2009లో సుప్రీంకోర్టు ఆదేశించింది. "ఆమేరకు" 2021లో కర్ణాటక ప్రభుత్వం చట్టం చేసింది. ఇతర మతాల ప్రార్థనా స్వేచ్ఛను తొలగించింది. మతమార్పిడి చట్టంలో హిందువులు ఇతర మతాలకు మారరాదు. ఇతరులు హిందువులుగా మారితే అది స్వగృహ ప్రవేశం. స్వయం నిర్ణయ వయోపరిమితితో మోదీ వైదొలగవలసివస్తే అమిత్ ప్రధాని, యోగి హోంమంత్రి అయ్యే అపాయం ఉంది. ద్వితీయశ్రేణి వైదికకేత్రీలు ప్రత్యామ్నాయాలుగా మారతారు. పొరబాటున ఇతర కూటములు గెలిచినా అవి వైదిక ధర్మ పాలననే, విధానాలనే, చట్టాలనే కొనసాగిస్తాయి. ప్రత్యామ్నాయ పక్షాలు సారూప్య గమ్యాన్ని మరిచి గమన భేదాల్లో, ఐక్యతను అశ్రద్ధచేసి స్వీయ ఘనతల ప్రచారంలో మునుగుతాయి. అసంతృప్తులను అణగదొక్కుతూ బలహీనపడుతూ ఉంటాయి. అన్ని రంగాల సంస్థల అధిపతులు, అధికారులు సంఘ్ భావజాలురే. రూపాంతర ఆరిఫ్ మహమ్మద్ ఖాన్‌లు స్వమతశకునులుగా, శల్యులుగా మారతారు. నేటి భారతం అప్రకటిత హిందు దేశం. సమాచార సాంకేతికతలు విస్తరించనినాటి ముసోలిని ఫాసిజం, హిట్లర్ నాజీయిజంతో పోల్చితే నేటి భారత నియంత్రత్రయ నూతన క్యాపిటలిస్టు, కార్పొరేటిస్టు నాజీ-ఫాసిజం చాలాఅపాయకరమైంది. ఇది అమృత కాలంలో లభించబోయే విషామృతం. గరళ కంఠులుగా మారాలా? విషశరీరులను విసర్జించాలా? రాహుకేతు పోరాటాలు సాగాలా? ఇవి నేటి సవాళ్లు.

వ్యాస రచయిత ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం జాతీయ కార్యదర్శి,
చరవాణి: 9490 20 4545

వెంటాడుతున్న ఆర్థికమాంద్యం

2008లో వచ్చిన ఆర్థిక మాంద్యం మరలా ప్రపంచ వ్యాప్తంగా రానుందా...? ఇదే అన్ని దేశాలను నేడు వెంటాడుతున్న సమస్య. కోవిడ్-19 ప్రభావం, తాజాగా రష్యా-ఉక్రెయిన్ యుద్ధంతో మొత్తం ప్రపంచ దేశాలు ద్రవ్యోల్బణం, బహు ముఖ పేదరికం, ఆహార పదార్థాలు సప్లై చైన్ సరఫరాలో అంతరాలు, ఆహార ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, అధిక ధరలు, చమురు గ్యాస్ ధరలు మరోపక్క వాతావరణసంక్షోభం మొత్తం ప్రపంచాన్ని వణికిస్తున్న తరుణంలో అభివృద్ధిచెందిన దేశాలతో పాటు అభివృద్ధి చెందుతున్న, వెనుకబడిన దేశాలు అల్లాడుతున్నాయి. ఈ సమస్యల నుండి బయట పడేందుకు ఆర్థికపరమైన చర్యలు తీసుకుంటున్నా కనుచూపు మేరలో పరిష్కారం కనపడుట లేదు. "ఇంటర్నేషనల్ మానిటరీ ఫండ్ ఎకనమిక్ అవుట్ లుక్" నివేదిక ఆధాకంగా భారతదేశ వృద్ధి రేటు గత సంవత్సరం 8.7శాతం నుంచి నేడు 2022 నాటికి 6.8 శాతానికి తగ్గింది. ఇది మరింత దిగజారి భవిష్యత్తులో 6.1 శాతానికి పడిపోతుంది అని అంచనా. అమెరికా గత ఏడాది వృద్ధిరేటు 5.7శాతం నుంచి నేడు 1.6 శాతానికి పడిపోయింది. ఇది ఆందోళన కలిగిస్తుంది. ఇది మరింత దిగజారి 1.1 శాతానికి దిగజారే అవకాశం ఉంది అని అంచనా. ఇక జర్మనీ వృద్ధి రేటు ఋణాత్మకంగా మారనుంది. గత సంవత్సరం 2.6శాతం కాగా ప్రస్తుతం 1.5శాతం నమోదైంది. త్వరలో 0.3 శాతానికి తాకే అవకాశం ఉంది. సగటున ప్రపంచ వృద్ధిరేటు 3.2శాతం కాగా, నేడు 2.7శాతంగా ఉంది. ఇటువంటి పరిస్థితులు చూస్తుంటే, ఆర్థిక మాంద్యం ఏ సమయంలో ఎలా వస్తుందో అర్థం కావడం లేదు. గత నెలలో ఐఎంఎఫ్,ప్రపంచ బ్యాంకు ఆధ్వర్యంలో వాషింగ్టన్‌లో 180దేశాల ఆర్థిక మంత్రులు, ఆర్థికనిపుణుల సమావేశమయ్యారు. ప్రపంచవ్యాప్తంగా ఆర్థికవ్యవస్థ అస్తవ్యస్తమై, ఆర్థికమాంద్యం తలెత్తే అవకాశం ఉందని సమావేశం ఆందోళన వ్యక్తం చేసింది.

ద్రవ్యోల్బణం కట్టడికి అమెరికా ఫెడరల్ రిజర్వ్ గత మార్చి నెల నుంచి కఠిన చర్యలు తీసుకుంది. అయినప్పటికీ ద్రవ్యోల్బణం 8.2శాతంగా కొన సాగుతోంది. వడ్డీరేట్లు పెంచి, డాలర్ విలువ బలోపేతానికి కృషి చేస్తోంది. విదేశీ మారక ద్రవ్య అర్జనకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఇతరదేశాల బ్యాంకులు కూడా ద్రవ్యోల్బణం అరికట్టేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. మనదేశంలో ఆర్‌బీఐ రెపోరేటుపై తరచూ పరిశీలన చేస్తున్నది. విదేశీ దిగుమతులు ప్రతీ దేశంలో ఎక్కువగా ఉండటంతో ఆయా దేశాల్లో విదేశీ నగదు నిల్వలు తరిగిపోతున్నాయి. మనదేశం అయితే, ఎక్కువగా మంచి నూనె, చమురు దిగుమతి చేసుకోవడంవల్ల విదేశీ మారకద్రవ్యం తగ్గ తుంది. ప్రపంచ వ్యాప్తంగా అనేక వస్తువులు తయారు చేసి, ఎగుమతి చేసే "చైనా" కూడా కోవిడ్ కారణంగా ఉత్పత్తులను, సరఫరాకు అనుగుణంగా తయారు చేయలేక పోతున్నది. అనేక పరిశ్రమలు లాక్‌డౌన్‌లో మూలుగుతూ ఉన్నాయి. కొన్ని పరిశ్రమలు చైనాను వదిలి వెళుతున్నాయి. దీంతో సరఫరా చైన్ అంతరాలతో సామాన్య ప్రజలకు వస్తువులు లభ్యం కావడం లేదు. ధరలు పెరగడంతో మొత్తం ప్రపంచం తల్లడిల్లుతోంది. ముఖ్యంగా సెమీకండక్టర్ ఉత్పత్తి క్షీణించింది. చైనా వృద్ధిరేటు కూడా 8.1శాతం నుంచి 3.2 శాతానికి పడిపోయింది. అవుట్ ఫ్లో, ఇన్ ఫ్లో పై చాలాదేశాలు కఠిన చర్యలు తీసుకున్నాయి. సామాన్యప్రజలు సతమతం అవుతున్నారు. కొన్ని ప్రభుత్వాలు తాత్కాలిక ఉపశమనం కోసం సంక్షేమ పథకాలు అమలు, ఆర్థిక సహాయం అందిస్తున్నాయి. అయినప్పటికీ చాలాదేశాల్లో ద్రవ్యోల్బణంపడగవిప్పి నాట్యం చేస్తున్నాయి. తాజాగా శ్రీలంక, పాకిస్థాన్ పరిణామాలు మన కళ్ళముందే కదలాడుతూ ఉంది. వడ్డీరేట్లు పెంచడంతో చిరువ్యాపారులు దివాలా తీస్తున్నారు. మన దేశంలో రిటైల్ ద్రవ్యోల్బణాన్ని 2 నుంచి మైనస్ 4 మధ్య ఉండాలి అని ఆర్‌బీఐ చెబుతుంది. కానీ నేడు 6 శాతంగా ఉంది. ఈ సంవత్సరం గత మూడు త్రైమాసిక ఫలితాలుచూస్తే 7శాతం పైబడే రిటైల్ ద్రవ్యోల్బణం ఉండటం గమనార్హం. 2022-23 సంవత్సరంలో రిటైల్ ద్రవ్యోల్బణం మనదేశంలో 6.7శాతంగా ఉంటుంది అని ఆర్‌బీఐ అంచనా వేసింది. ఇటువంటి పరిస్థితుల్లో పేదలజీవితాలు దుర్భరం అవుతున్నాయి. ప్రభుత్వాలు స్వయం సమృద్ధిసాధించుటకు మార్గాలు అన్వేషించాలి. సరఫరాపెంచాలి. వ్యవసాయం, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు చేయూత నివ్వాలి. అప్పుడు మాత్రమే ఆర్థిక మాంద్యం బారిన పడకుండా బయట పడవచ్చు.

ఐ.ప్రసాదరావు, 06305682733

అలసత్వానికి బలవుతున్న నిండు ప్రాణాలు

డా. యం.సురేష్‌బాబు

దేశంలో నిర్లక్ష్యం తాండవిస్తోంది. మానవ తప్పిదాలకు కొదవే లేదు. అనంతపురం జిల్లాలోని బొమ్మనహాల్ మండలం దర్గాహొన్నూరు వద్ద ట్రాక్టర్‌పై విద్యుత్ తీగలు తెగిపడటంతో ఆరు మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. దర్గాహొన్నూరు గ్రామానికి చెందిన కూలీలు పొలంలో మొక్కజొన్న కంకులు కోతకు వెళుతుండగా విద్యుత్ మెయిన్ వైర్లు ఒక్కసారిగా తెగిపడ్డాయి. నాలుగు నెలల క్రింద శ్రీసత్యసాయి జిల్లా తాడిమర్రి మండలం చిల్లకొండయ పల్లిలో సంభవించిన కరెంట్ కాటు ఆరుగురిని బలి తీసుకుంది. ఆటోపై విద్యుత్ తీగ పడటంతో కరెంట్ షాక్ తగిలింది. మంటలు రావడంతో ఆటో తగలబడింది. కూలీ పనులకు వెళుతున్న ఐదుగురు మహిళలు సజీవ దహనమయ్యారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వల్లే కూలీలు చనిపోయారనే ఆరోపణలు వచ్చాయి. రైల్లో జరిగిన తొక్కిసలాటలో చాలామందికి తీవ్ర గాయాలయ్యాయి. ఘోర రోడ్డు ప్రమాదంలో ఎనిమిదిమంది యువకులు బలయ్యారు. ప్రతి నెల కూలీలను తరలిస్తూ ఆటో ప్రమాదంలో మరణించిన వారు, బోరు బావుల్లో పడి మరణిస్తున్న పిల్లలు, విహార యాత్రకు వెళ్లి విషాదాంతమైన బతుకులు. మానవతప్పిదం వలన గుజరాత్‌లో ఈ ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. మోర్బీ పట్టణంలో మచ్చూ నదిపై కిక్కిరిసిన సందర్శకులతో ఉన్న కేబుల్ బ్రిడ్జి ఒక్కసారిగా నదిలో కుప్పకూలిపోయింది. పర్యాటకులు పెద్ద సంఖ్యలో నదిలో పడిపోయారు. ఈ ప్రమాదంలో 141 మంది దుర్మరణం పాలయ్యారు. రెండు సంవత్సరాల క్రిందట పాపికొండలు సందర్శించడానికి వెళ్లి 50 మంది జలసమాధి అయ్యారు. పర్యావరణ ప్రమాదాలకు లెక్కేలేదు. విషవాయువులు పీల్చి అనంతవాయువులలో కలుస్తున్నారు. ఈ సంవత్సరం పారిశ్రామిక ప్రమాదాలు, విద్యుత్ ప్రమాదాలలో ముందు స్థానాలలో రెండు తెలుగు రాష్ట్రాలు నమోదయ్యాయి. హైదరాబాద్ బొయిగూడ గుజిరీ గోదాములో జరిగిన అగ్ని ప్రమాదంలో బీహార్ రాష్ట్రానికి చెందిన పన్నెండు మంది మృతిచెందారు.

దేశంలో పారిశ్రామిక ప్రమాదాల నివారణకు ప్రత్యేకంగా పారిశ్రామిక భద్రతా విధానాన్ని తీసుకురాకుండా, అసంఘటిత రంగాల్లో పనిచేసే కార్మికులకు మెరుగైన వసతి కేంద్రాలు ఏర్పాటు చేయడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు శ్రద్ధ వహించక పోవడంతో కార్మికుల ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. జాతీయ నేర గణాంకాల సంస్థ నివేదిక ప్రకారం భారత్‌లో 2019లో 22,442 విద్యుత్ ప్రమాదాలు చోటు చేసుకోగా 13,432 మంది చనిపోయారు. అందులో ఆంధ్రప్రదేశ్‌లో 908, తెలంగాణలో 735 మంది ఉన్నారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల మరో 1,990 మంది ప్రాణాలు కోల్పోయారు. సగటున రోజుకు 43 మంది విద్యుత్ ప్రమాదాలకు బలవుతున్నారు. వీరిలో అధికశాతం చేతివృత్తిదారులు, రైతులే కావడం కలవరపరచే అంశం. రోజుకు 15 మూగజీవాలు విద్యుద్ఘాతాలకు బలి అవుతున్నట్లు కేంద్ర విద్యుత్ ప్రాధికారిక సంస్థ (సీఈఏ) లెక్కలు తెలియజేస్తున్నాయి. గాలి, దుమ్ము, భారీ వర్షాలు, తుపాన్లు సంభవించినప్పుడు నేలపై పడిన తీగలను, స్తంభాలను, సపోర్ట్ తీగలను తాకరాదు, ట్రాన్స్‌ఫార్మర్ల దగ్గరకు వెళ్ళకూడదు. విద్యుత్ సమస్యలుంటే నిపుణులైన సిబ్బందికి సమాచారం అందించాలే తప్ప స్థానికులు సొంతంగా మరమ్మతులు చేయకూడదు. విద్యుత్ తీగల కింద ఎటువంటి కట్టడాలు చేపట్టకూడదు. బోర్లు వేయరాదు. ముఖ్యంగా పట్టణాల్లో చేతికందే ఎత్తులోనే కరెంటు సరఫరా తీగలు ఉండటంతో ప్రమాదాలకు కారణమవుతోంది. లైన్ల కింద నుంచి ఎత్తయిన వాహనాలు వెళ్ళేప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. విద్యుత్ తీగలకు దగ్గరలో పతంగులను ఎగుర వేయకూడదు. పిల్లలకు విద్యుత్ పరికరాల వాడకంపై అవగాహన పెంచాలి. నిర్లక్ష్యం వల్ల ఎలాంటి ముప్పు సంభవిస్తుందో వివరించాలి. భారత్‌లో విద్యుత్ సంస్థలు ఏటా మే నెల ఒకటో తేదీ నుంచి ఏడో తేదీ వరకు విద్యుత్ భద్రతా వారోత్సవాలను నిర్వహిస్తూ ప్రజల్లో, సిబ్బందిలో విస్తృత అవగాహన కల్పిస్తున్నారు. వ్యవసాయం, రోడ్లు భవనాలు, పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్, రెవెన్యూ అన్ని శాఖల్లో సిబ్బంది కొరతతో సమన్వయం లోపించడంతో నిధులు లేక నిస్తేజంగా ఉన్నాయి.

వ్యాస రచయిత అధ్యక్షులు, రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్

మోర్బీ దుర్ఘటనపై వారంలోగా నివేదిక ఇవ్వండి

- సుమోటోగా విచారణ చేపట్టిన గుజరాత్ హైకోర్టు
- రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక అధికారులకు నోటీసులు
- నవంబర్ 14న విచారణ

అహ్మదాబాద్ : మోర్బీ తీగల వంతెన కుప్పకూలిన దుర్ఘటన పై గుజరాత్ హైకోర్టు సోమవారం సుమోటోగా విచారణ చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వానికి, స్థానిక అధికారులకు నోటీసులు జారీ చేసింది. నవంబర్ 14 లోపు ఈ ఘటన పై నివేదిక ఇవ్వాలని కోరింది. మోర్బీలోని మచ్చూ నది పై బ్రిటీషు కాలం నాటి తీగల వంతెన అక్టోబరు 30న కుప్పకూలింది. ఈ దుర్ఘటనలో 135 మంది మరణించారు. ఒక ప్రైవేట్ సంస్థ ద్వారా ఏడు నెలల మరమ్మతుల తర్వాత వంతెనను అక్టోబర్ 26న ప్రజల కోసం తెరిచారు. 'మేము మోర్బీ సంఘటన పై సుమోటోగా తీసుకున్నాం. కానీ సెలవుల కోసం, మేము అదే రోజున కూర్చుంటాము' అని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ అశుతోష్ శాస్త్రితో కూడిన డివిజన్ బెంచ్ కోర్టుకు హాజరయిన అడ్వకేట్ జనరల్ కమల్ త్రివేదిని ఉద్దేశించి అన్నారు. వార్తాపత్రిక కథనం ఆధారంగా బెంచ్ ఈ సంఘటనను పరిగణనలోకి తీసుకుంది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర హోం శాఖ, మునిసిపల్ కమిషనర్, మోర్బీ మున్సిపాలిటీ, జిల్లా కలెక్టర్, రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ సహా రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. నవంబరు 14న ఈ అంశాన్ని విచారణ చేయనుంది. కాగా ప్రభుత్వం చర్యలు తీసుకునేలా చూడాలని కోరుతున్నామని, వచ్చే సోమవారం నాటికి

నివేదికను దాఖలు చేయాలని ప్రధాన కార్యదర్శి, హోం శాఖ కార్యదర్శిని కోర్టు ఆదేశించింది. అలాగే ఈ వ్యవహారంపై నవంబర్ 14లోగా నివేదిక ఇవ్వాలని రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌ను కూడా ఆదేశించింది. 'రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ కూడా తదుపరి విచారణ తేదీలోగా దీనికి సంబంధించి నివేదికను దాఖలు చేస్తుంది. ఈ ఉత్తర్వును ప్రత్యేక మెసెంజర్ ద్వారా ప్రతివాది నంబర్ 5 రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌కు తెలియజేయవలసిందిగా రిజిస్ట్రీకి సూచించబడింది. నవంబర్ 14న విషయాన్ని మళ్లీ నమోదు చేయండి' అని కోర్టు పేర్కొంది. ఇదిలాఉండగా, గడియారం, ఈ-బైక్ తయారీదారు ఒరెవా గ్రూప్‌నకు 15 సంవత్సరాల పాటు మోర్బీ వంతెన మరమ్మతులు, నిర్వహణ, దాని ఉపయోగం కోసం రూ.10 నుంచి రూ.15 శ్రేణిలో టికెట్లు వసూలు చేయడానికి నగర మునిసిపాలిటీ కాంట్రాక్ట్ ఇచ్చింది. అక్టోబర్ 26న ఒరెవా గ్రూప్ మరమ్మతు పనుల కోసం నిపుణులను నియమించిందని, ఉపయోగించిన సామాగ్రి 'ప్రత్యేక సంస్థలు' ద్వారా నిర్మితమైందని పేర్కొంది. ఒరెవా గ్రూపునకు చెందిన నలుగురితో సహా తొమ్మిది మందిని పోలీసులు అరెస్టు చేశారు.

శతాబ్దాల నాటి వంతెన నిర్వహణకు సంబంధించిన సంస్థలపై కేసు నమోదు చేశారు. కాగా న్యాయస్థానం పర్యవేక్షణలో న్యాయ విచారణను కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని (పీఐఎల్) విచారించేందుకు కూడా సుప్రీం కోర్టు అంగీకరించింది. నవంబర్ 14న ఈ పిటిషన్‌ను సుప్రీం కోర్టు విచారించనుంది. దాదాపు 27 ఏళ్లుగా రాష్ట్రాన్ని పాలిస్తున్న బీజేపీ పై ఈ ఘటన తర్వాత ప్రతిపక్షాలు తీవ్ర విమర్శలు గుప్పించాయి. ఈ సంఘటన, ప్రాణనష్టం అన్ని వర్గాల నుంచి ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహాన్ని రేకెత్తించింది. త్వరలో ఎన్నికలు జరగనున్న తరుణంలో ఈ ఘటన చోటుచేసుకోవడంతో గుజరాత్‌లోని బీజేపీ సర్కారుపై ప్రతిపక్షాలు మరింతగా పదును పెంచి విమర్శలు గుప్పిస్తున్నాయి.

ఆఖరి దశలో పోలింగ్ స్టేషన్ ఓటుకే మొగ్గుచూపిన శరణ్ నేగి

సిమ్లా: భారతదేశ మొదటి ఓటరు శ్యామ్ శరణ్ నేగి ఇటీవల మరణించిన విషయం తెలిసిందే. అయితే పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకోవడం కంటే పోలింగ్ స్టేషన్‌లో ఓటు వేయాలని పట్టుబట్టినట్టు ఆయన మనుమడు దీపక్ కుమార్ తెలిపారు. అయితే ఆరోగ్య పరిస్థితి రీత్యా పోస్టల్ బ్యాలెట్ ద్వారానే ఓటు వేయమని కోరానని ఆయన పేర్కొన్నారు. తాను మొదట ఓటు వేసిన ప్రాథమిక పాఠశాల కల్పాలోని పోలింగ్ స్టేషన్‌కు నవంబర్ 12న వెళ్లి ఓటేస్తానని ఆయన పట్టుబట్టారు. అయితే నడవడానికి, నిలబడటానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అందుకే అక్కడకు వెళ్లొద్దని సలహా ఇచ్చా' అని దీపక్ తెలిపారు. 34వసారి ఓటు వేసిన మూడు రోజుల తర్వాత, శ్యామ్ శరణ్ నేగి 106 ఏళ్ల వయసులో మరణించారు. ఎన్నికల సంఘం బ్రాండ్ అంబాసిడర్‌గా ఉన్న నేగి నవంబర్ 2న పోస్టల్ బ్యాలెట్ ద్వారా హిమాచల్ ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలకు ఓటు వేసినట్లు ఎన్నికల సంఘం తెలిపింది. "ఆయన పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేయడం తన జీవితంలో ఇదే మొదటిసారి" అని దీపక్ చెప్పారు. ఎన్నో సంవత్సరాలుగా నేగి యువ తరానికి ఒక రోల్ మోడల్‌గా ఉద్భవించారని, ఓటు వేయాలని, మంచి నాయకులను ఎన్నుకోవాలని ప్రోత్సహిస్తూనే ఉన్నారని దీపక్ వివరించారు. 'ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని మా తాత ఎప్పుడూ అందరికీ చెప్పేవాడు" అని పర్యాటక రంగంలో పనిచేస్తున్న ప్రభుత్వ కాంట్రాక్టర్ దీపక్ తెలిపారు.

కొచ్చిలో 18వ అంతర్జాతీయ టెలీమెడిసన్ సమావేశం

కొచ్చి: టెలీమెడిసిన్ సొసైటీ ఆఫ్ ఇండియా (టీఎస్ఐ) టీఎస్ఐ కేరళ చాప్టర్‌తో కలిసి నిర్వహించే 18వ అంతర్జాతీయ టెలిమెడిసిన్ సమావేశం నవంబర్ 10-12 వరకు కొచ్చిలో జరగనున్నది. దేశ, ప్రపంచవ్యాప్తంగా ఉన్న 200మందికి పైగా శాస్త్రవేత్తలు, విద్యావేత్తలను ఒకచోట చేర్చేలా మూడు రోజుల కార్యక్రమం స్థానిక అమృత ఆసుపత్రిలో జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఇస్రో చైర్మన్ ఎస్ సోమనాథ్ ముఖ్య అతిథిగా విచ్చేసి దేశంలో టెలిమెడిసిన్ సౌకర్యాలను సరికొత్త సాంకేతికతలు ఎలా మెరుగుపరుస్తాయో చర్చిస్తారు. కేరళ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్స్ వైస్ ఛాన్సలర్ మోహనన్ కున్నుమ్మల్, కేరళ ఐటీ సెక్రటరీ డాక్టర్ రెథన్ కేల్కర్ కూడా ఈ కార్యక్రమానికి హాజరవుతారని అమృత ఆసుపత్రి ఒక ప్రకటనలో తెలిపింది. టెలిమెడికాన్ 2022 అనేది హెల్త్‌కేర్ ప్రొఫెషనల్స్, ప్రొవైడర్లు, హెల్త్ ఇన్సూరెన్స్ ప్రొవైడర్లు, ఆన్‌లైన్ ఫార్మసీ చైన్‌లు, పారిశ్రామికవేత్తలు, అకాడెమిక్ సైంటిస్టులు, రీసెర్చ్ స్కాలర్‌లు, సైంటిస్టులు, టెలిమెడిసిన్, టెలిహెల్త్, ఇ-హెల్త్, ఎమ్-హెల్త్ వంటి వివిధ రంగాలకు చెందిన మెడికల్, ఇంజినీరింగ్ వాటాదారుల కోసం వార్షిక గ్లోబల్ కాన్ఫరెన్స్ ప్రపంచవ్యాప్తంగా ఈ కార్యక్రమాలు నిర్వహిస్తుంది. ప్రభుత్వ సంస్థలు, ప్రైవేట్ సంస్థలు, జాతీయ, అంతర్జాతీయ ప్రొఫెషనల్ సొసైటీల సహకారంతో ఈ సదస్సు జరుగుతుంది.

రాహుల్ యాత్రలో ఆదిత్య?

ముంబై: రాహుల్‌గాంధీ కొనసాగిస్తున్న కాంగ్రెస్ భారత్ జోడో యాత్రలో శివసేన నేత ఆదిత్య ఠాక్రే పాల్గొంటారని ఆ పార్టీ నాయకుడు ఒకరు చెప్పారు. రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్ర సోమవారం రాత్రి మహారాష్ట్రలోకి ప్రవేశించింది. శివసేన నాయకుడు సచిన్ అహిర్ సోమవారం విలేకరులతో మాట్లాడుతూ మరఠ్వాడాలో ఠాక్రే పర్యటిస్తున్నారని, రాహుల్ యాత్ర కూడా ఆ ప్రాంతంలో కొనసాగుతుందని తెలిపారు. 'భారత్ జోడో యాత్రలో ఆదిత్య పాల్గొనే అవకాశాలను తోసిపుచ్చలేం. పార్టీ అధినేత ఉద్ధవ్ ఠాక్రేతో చర్చించిన తర్వాత దీనిపై నిర్ణయం తీసుకుంటాం. యాధృచ్చికమే అయినా ఆదిత్య యాత్ర కూడా మరఠ్వాడాలో జరుగుతోంది. అదే సమయంలో రాహుల్ యాత్ర వస్తుంది. ఇద్దరూ కలిసి యాత్ర చేసే అవకాశాలు ఉన్నాయి' అని అహిర్ వివరించారు. భారత్ జోడో యాత్ర లక్ష్యం ప్రతి ఒక్కరినీ కలవడమని, తెలిసో...తెలియకో సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు ఆ యాత్రకు మద్దతిస్తున్నారని, యాత్ర మహారాష్ట్రకు వస్తే స్వాగతిస్తామని అహిర్ తెలిపారు.

డబుల్ ఇంజిన్ సర్కార్ ఐదేళ్లుగా ఏం చేసింది?

ఇంధనం నింపడం మర్చిపోయిందా?

హిమాచల్ ఎన్నికల ప్రచారంలో ప్రియాంక

ఉనా(హిమాచల్‌ప్రదేశ్): బీజేపీపై కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంకగాంధీ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. హిమాచల్‌ప్రదేశ్‌లో ఐదేళ్లుగా బీజేపీ డబుల్ ఇంజిన్ ప్రభుత్వమే నడుస్తోందని, అయితే ఆ ఇంజిన్‌ను ఇంధనంతో నింపడం మర్చిపోయుంటుందని విమర్శించారు. నిరుద్యోగం, పాత పెన్షన్ విధానంపై బీజేపీ ప్రభుత్వం లక్ష్యంగా ఆరోపణలు సంధించారు. హిమాచల్‌ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఉనాలో జరిగిన భారీ బహిరంగసభలో ప్రియాంక సోమవారం ప్రసంగించారు. ఔషధాలు తరచూ మార్చడం వల్ల రోగాలు తగ్గవచ్చు లేదా ఇతరులకు ప్రయోజనం కలిగించవచ్చని ప్రధాని నరేంద్రమోదీ చేసిన వ్యాఖ్యలపై ప్రియాంక ఘాటుగా స్పందించారు. తాము అస్వస్థతకు గురయ్యామని, పాత ఔషధాలు ఇవ్వాలని ప్రజలు కోరుకుంటున్నారని ఆమె వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో ప్రభుత్వ మార్పిడి అనివార్యమని ఆమె స్పష్టంచేశారు. కాంగ్రెస్‌కు అధికారం ఇస్తే లక్ష మందికి ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తామని, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తామని పునరుద్ఘాటించారు. ఎన్నికలు ప్రతి ఐదేళ్లకు వస్తుంటాయని, ఈ ఎన్నికలు మీ భవిష్యత్‌ను నిర్ణయించేవని ప్రజలకు విన్నవించారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలలో అమలులో ఉన్న పాత పెన్షన్ విధానాన్ని బీజేపీ ప్రభుత్వం ఇక్కడెందుకు అమలు చేయడం లేదని ఆమె ప్రశ్నించారు. దీని గురించి అందరూ ఆలోచించాలని కోరారు. 'మాకు ఓటేయండి. డబుల్ ఇంజిన్ ప్రభుత్వం వస్తుందని బీజేపీ నాయకులు పదేపదే చెబుతున్నారు. ఐదేళ్లుగా డబుల్ ఇంజిన్ ప్రభుత్వం ఏమైంది. గడచిన ఐదేళ్లుగా ఇక్కడ డబుల్ ఇంజిన్ ప్రభుత్వమే అధికారంలో ఉంది గదా. బహుశా ఆ ఇంజిన్‌లో ఇంధనం నింపడం మర్చిపోయి ఉంటారని హేళనగా మాట్లాడారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడం ప్రభుత్వాల బాధ్యతని, బీజేపీ రాష్ట్రంలోనూ, కేంద్రంలోనూ అధికారంలో ఉన్నప్పటికీ హిమాచల్‌లో 63 వేల పోస్టులు ఖాళీగా ఉన్నాయని ప్రియాంక తెలిపారు. ఈ పోస్టులు ఎందుకు భర్తీ చేయలేదని డబుల్ ఇంజిన్ ప్రభుత్వాన్ని నిలదీశారు. తాము అధికారంలోకి వస్తే మొదటి కేబినెట్ సమావేశంలోనే లక్ష ఉద్యోగాలు, పాత పెన్షన్ విధానం పునరుద్ధరణపై సంతకం చేస్తామని ప్రియాంక భరోసా ఇచ్చారు.

ఆప్, బీజేపీ ఒకటే: కన్హయ్యకుమార్

అహ్మదాబాద్: బీజేపీ, ఆమ్ ఆద్మీ పార్టీ రెండూ ఒకటేనని కాంగ్రెస్ నాయకుడు కన్హయ్య కుమార్ అన్నారు. గుజరాత్ ఎన్నికల నేపథ్యంలో ఆయన పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ... బీజేపీ సైద్ధాంతిక , క్యాడర్ ఆధారిత పార్టీ అని, దేశంలో ప్రత్యామ్నాయ భావజాలాన్ని అందించగల ఏకైక సహజ సిద్ధ ప్రతిపక్షపార్టీ కాంగ్రెస్సేనని కుమార్ అన్నారు. 'గుజరాత్ నుంచి చాలా కొత్త విషయాలు మొదలవుతాయి. ఇక్కడ నుంచి రాజకీయ సందేశం వస్తుందని మేము ఆశిస్తున్నాం... ప్రజలు బీజేపీ పాలనపై సంతోషంగా ఉంటే, దానిని ఎన్నుకోనివ్వండి...కానీ ప్రజలు మార్పు కోరుకుంటే వారు కాంగ్రెస్‌కు అవకాశం ఇస్తారని నేను ఆశిస్తున్నాను' కన్హయ్య అన్నారు. 2022 డిసెంబరులో జరిగే గుజరాత్ అసెంబ్లీ ఎన్నికలు 'మైలురాయి' ఫలితాన్ని ఇస్తాయని, గత వారం కాంగ్రెస్ పరివర్తన్ సంకల్ప్ యాత్రలో పాల్గొనడానికి బీజేపీ పాలిత గుజరాత్‌లో ఉన్న కుమార్ పేర్కొన్నారు. 'వచ్చే గుజరాత్ ఎన్నికల్లో గెలవలేమని బీజేపీ 2017లోనే గ్రహించి, ఆప్‌ని ఇక్కడికి తీసుకొచ్చింది. ఏ, బీ టీమ్ అనే ప్రశ్నే లేదు...బీజేపీ, ఆప్ ఒకే టీమ్...ఒకరు మరొకరిని అనుసరిస్తారు' అని కన్హయ్య స్పష్టం చేశారు. ప్రస్తుతం బీజేపీకి అనుకూలంగా ఉన్న వాతావరణ త్వరలో తగ్గుతుందని, మత విభజన మార్గంలో వెళ్లడం సరైన మార్గం కాదని ప్రజలు గ్రహిస్తారని, కాంగ్రెస్ తన ప్రధాన భావజాలం నుంచి అంగుళం కూడా దూరం జరగాల్సిన అవసరం లేదని కుమార్ స్పష్టీకరించారు.

తాను కూడా పాల్గొంటున్న 'భారత్ జోడో యాత్ర'తో రాహుల్ గాంధీపై ప్రత్యర్థులు ఏర్పరచుకున్న ప్రతికూల భావన తొలగిపోతోందని కాంగ్రెస్ నేత అన్నారు. "బీజేపీ సైద్ధాంతిక, క్యాడర్ ఆధారిత పార్టీ... ఏదైనా వేరొకపార్టీ సైద్ధాంతికంగా లేదా క్యాడర్ ఆధారితంగా లేకుంటే అది భారతదేశంలో బీజేపీని సవాలు చేయలేదని, అది బీజేపీకి ప్రత్యామ్నాయం కాదని మనం అర్థం చేసుకోవాలి' అని కుమార్ అన్నారు. దేశంలో బీజేపీకి సహజంగానే కాంగ్రెస్ ప్రత్యర్థి యని, రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లలో బీజేపీ నుంచి తిరిగి అధికారాన్ని చేజిక్కించుకున్న ఏకైక పార్టీ కాంగ్రెస్ మాత్రమేనని చెప్పారు.

మహిళలపై యూపీ పోలీసుల దాష్టీకం

కర్రలు, పైపులతో దాడి

లక్నో: ఉత్తరప్రదేశ్‌లోని అంబేద్కర్‌నగర్ జిల్లాలో దారుణం చోటుచేసుకున్నది. అంబేద్కర్ విగ్రహం ధ్వంసం చేయడాన్ని నిరసిస్తూ ఆందోళనకు దిగిన మహిళలపై పోలీసులు విచక్షణారహితంగా దాడిచేశారు. పైపులు, లాఠీలు, కట్టెలతో విరుచుకుపడ్డారు. అంబేద్కర్‌నగర్ జిల్లా జలాల్‌పూర్‌లోని ఓ ప్రాంతంలో ఈ మధ్యే బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటుచేశారు. అయితే ఆ ప్రాంతం తమదంటూ రాజ్యాంగ నిర్మాత విగ్రహాన్ని కొందరు ధ్వంసం చేశారు. దీంతో ప్రాంతంపై వివాదం కొనసాగుతున్నది. ఈ నేపథ్యంలో స్థానిక ప్రజలు విగ్రహ ధ్వంసానికి వ్యతిరేకంగా వివాదాస్పద ప్రాంతంలో నిరసనకు దిగారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకున్నారు. నిరసనకారులపై లాఠీలు, పైపులు, కట్టెలతో విచక్షణా రహితంగా దాడిచేశారు. ఒక మహిళను తలపై కొట్టడంతో ఆమె అక్కడే పడిపోయింది. మహిళలు తమపై ఇటుకలతో దాడిచేశారని, మహిళా అధికారిని జుట్టుపట్టుకుని కొట్టారని పోలీసులు చెప్పారు. ఈనేపథ్యంలో తాము లాఠీలకు పనిచెప్పామన్నారు. ప్రస్తుతం ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో చక్కర్లుకొడుతున్నది.

తొలివేట పూర్తిచేసిన చీతాలు

న్యూఢిల్లీ: నమీబియా నుంచి భారత్‌కు తీసుకొచ్చిన చీతాల్లో ఫ్రెడ్డీ, ఎల్టోన్ అనే రెండిటిని క్వారంటైన్ ఎన్‌క్లోజర్ నుంచి పెద్ద ఎన్‌క్లోజర్‌లోకి వదిలిపెట్టారు. దీనిలోకి వెళ్లిన 24 గంటల్లోనే ఇవి తొలి వేటను పూర్తిచేశాయి. తొలుత ఈ చీతాల కండరాలు క్వారంటైన్లో బలహీనపడి ఉంటాయని అధికారులు ఆందోళన చెందారు. కానీ, ఇవి రెండూ ఆరోగ్యంగానే ఉన్నాయి. ఇవి ఆదివారం సాయంత్రం 6 గంటల నుంచి సోమవారం ఉదయంలోగా ఓ మచ్చల జింకను వేటాడినట్లు అటవీశాఖ అధికారులు వెల్లడించారు. మొత్తం 8 చీతాలను నమీబియా నుంచి ప్రత్యేక విమానంలో భారత్ తీసుకొచ్చారు. వీటిని దాదాపు 50 రోజులపాటు క్వారంటైన్ చేశారు. అనంతరం వీటిల్లో రెండిటిని పెద్ద ఎన్‌క్లోజర్‌లోకి వదిలారు. తాము ఊహించిన దానికంటే చాలా వేగంగా తొలివేటను పూర్తి చేసుకొన్నాయని అధికారులు వెల్లడించారు. శాటిలైట్ కాలర్స్, ఎన్‌క్లోజర్‌లోని కెమెరాలతో వీటి కదలికలను గమనిస్తున్నారు. మిగిలిన ఐదు చీతాలను కూడా త్వరలోనే పెద్ద ఎన్‌క్లోజర్‌లోకి పంపే అవకాశాలున్నాయి. వీటిల్లో ఆశా అనే చీతా గర్భంతో ఉన్నట్లు భావిస్తున్నారు. దేశంలోకి 74 ఏళ్ల తర్వాత మళ్లీ చీతాలు ప్రవేశించాయి. 1948లో అప్పటి ఉమ్మడి మధ్యప్రదేశ్ ప్రస్తుత ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో చివరి చీతా చనిపోయిన తర్వాత దేశంలో వీటి ఆనవాళ్లు కనుమరుగయ్యాయి. అందుకే వీటిని అంతరించిన జాతిగా 1952లో ప్రభుత్వం ప్రకటించింది. ఈ నేపథ్యంలో వన్యప్రాణుల సంరక్షకుల కృషి, కేంద్ర ప్రభుత్వ చొరవ ఫలితంగా ఇప్పుడు నమీబియా నుంచి 8 చీతాలు భారత్‌లోకి తీసుకొచ్చారు. వీటిని తరలించేందుకు ప్రత్యేకంగా తీర్చిదిద్దిన విమానం బి747 జంబోజెట్‌ను వినియోగించారు. ఐదు ఆడ, మూడు మగ చీతాలు ఉన్నాయి. నాలుగు నుంచి ఆరేళ్ల మధ్య వయసు గల ఈ చీతాలను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్వయంగా కునో పార్కులోకి విడిచిపెట్టారు.

చారిత్రక వైఫల్యాన్ని ప్రధాని గుర్తించలేదు

మల్లికార్జున ఖర్గే విమర్శ

న్యూఢిల్లీ: ఆర్థిక పతనానికి కారణమైన నోట్ల రద్దులోని చారిత్రక వైఫల్యాన్ని ప్రధాని నరేంద్ర మోదీ ఇంకా గుర్తించలేదని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శించారు. భారత్‌లో పెద్ద నోట్లను రద్దు చేసి రేపటికి ఆరు ఏళ్లు. ఈ నేపథ్యంలో ఖర్గే మాట్లాడుతూ ఇప్పుడు ప్రజల వద్ద ఉన్న నోట్ల విలువ రూ.30.88 లక్షల కోట్లకు చేరిందన్నారు. "దేశాన్ని నల్లధనం నుంచి విముక్తి చేయడానికి నోట్ల రద్దు ఉపయోగపడుతుందని వాగ్దానం చేశారు. కానీ, వ్యాపారాలు నాశనమై, ఉద్యోగాలు పోయాయి. ఆ మాస్టర్ స్ట్రోక్‌కు ఆరేళ్లయ్యాక ఇప్పుడు 2016లో కంటే ప్రజల వద్ద 72శాతం అధికంగా నగదు ఉంది" అని ఖర్గే వివరించారు. తాజాగా రిజర్వుబ్యాంక్ లెక్కల ప్రకారం ప్రజల వద్ద రూ.30.88 లక్షల కోట్లు నగదు ఉంది. 2016 నవంబర్ 4వ తేదీ నాటి బ్యాంక్ డేటా ప్రకారం అప్పట్లో ప్రజల వద్ద రూ.17.7 లక్షల కోట్ల నగదు ఉంది. ప్రజల వద్ద ఉన్న నోట్లు, చిల్లర నాణేలను నగదుగా లెక్కలోకి తీసుకొంటారు. ప్రతి 15 రోజులకోసారి ఆర్‌బీఐ చలామణిలో ఉన్న నగదు వివరాలను అందిస్తుంటుంది. బ్యాంకుల్లో ఉన్న నగదును మినహాయించిన తర్వాతే చలామణిలో ఉన్న నగదును వెల్లడిస్తుంది.

మహిళపై దాడి... పోలీసుపై సస్పెన్షన్ వేటు

పూరి: ఒడిశాలో, పూరి జిల్లాలోని జగన్నాథ ఆలయంలో ఒక వృద్ధ మహిళను బెత్తంతో కొట్టినందుకు సీనియర్ పోలీసు కానిస్టేబుల్ (హవిల్దార్) సస్పెన్షన్‌కు గురయ్యారని సీనియర్ అధికారి తెలిపారు. ఆమె తీవ్రంగా గాయపడటంతో, ఇతర భద్రతా సిబ్బంది వెంటనే ఆస్పత్రికి తరలించారని పోలీసు అధికారి ఒకరు తెలిపారు. బెహ్రంపూర్ నివాసి అయిన మాధురీ దాస్, గర్భగుడిలోకి దూసుకొచ్చేందుకు యత్నించారు. అడ్డుకున్న కానిస్టేబుల్‌తో వాగ్వాదానికి దిగారు. గుంపును అదుపు చేస్తున్న హవల్దార్ ప్రశాంత్ దలై వాదనల మధ్య దాస్‌ను కర్రతో కొట్టినట్లు పేర్కొన్నారు. కార్తీక మాసం, 'పంచుక' పండుగ సందర్భంగా త్రిమూర్తులు - బలభద్ర, దేవి సుభద్ర, జగన్నాథునికి ప్రార్థనలు చేయడానికి భక్తులు కొన్ని రోజులుగా భారీగా తరలివస్తున్నారు. మందిరంలో రద్దీ దృష్ట్యా, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అదనపు పోలీసు సిబ్బందిని అక్కడ మోహరించినట్లు పూరీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ కన్వర్ విశాల్ సింగ్ తెలిపారు. ప్రస్తుతం మహిళ పరిస్థితి నిలకడగా ఉందని పేర్కొన్నారు

హత్యాచార కేసులో ఉరిశిక్ష రద్దు

ఆ ముగ్గురూ నిర్దోషులే: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: సామూహిక అత్యాచార కేసులో ఢిల్లీ హైకోర్టు ఉరిశిక్ష విధించిన ముగ్గురు దోషులకు సుప్రీంకోర్టు సోమవారం కేసు నుంచి విముక్తి కల్పించింది. వారిని నిర్దోషులుగా ప్రకటిస్తూ తీర్పు వెలువరించింది.పదేళ్ల కిందట దేశ రాజధాని ఢిల్లీలో ఈ సామూహిక అత్యాచార, హత్య కేసు చోటుచేసుకుంది. ఈ కేసులో ముగ్గురు దోషులకు ఢిల్లీ హైకోర్టు మరణశిక్ష విధించింది. 2012లో ఢిల్లీలోని ఛావ్లా ప్రాంతంలో ఓ 19 ఏళ్ల యువతి సామూహిక అత్యాచారం, హత్యకు గురైంది. ఈ కేసులో దర్యాప్తు చేపట్టిన ఢిల్లీ పోలీసులు ఉత్తరాఖండ్‌కు చెందిన ముగ్గురు యువకులు రవి కుమార్, రాహుల్, వినోద్ పై కేసు నమోదు చేశారు. ఆ యువతిని వీరు కిడ్నాప్ చేసి ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డారని దర్యాప్తులో తేలింది. అత్యాచారం అనంతరం ఆమెను అత్యంత పాశవికంగా చిత్రహింసలు పెట్టి చంపినట్లు పోలీసులు కేసు నమోదు చేశారు. హతురాలి మృతదేహాన్ని హరియాణాలోని ఓ పొలంలో గుర్తించారు. ఈ కేసులో తొలుత విచారణ జరిపిన ట్రయల్ కోర్టు ముగ్గురు నిందితులను దోషులుగా నిర్ధారించి మరణ శిక్ష విధించింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ నిందితులు ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన ఉన్నత న్యాయస్థానం ట్రయల్ కోర్టు తీర్పును సమర్థించింది. ఈ హత్యాచార ఘటనను 'అత్యంత దారుణమైనది'గా అభివర్ణించిన హైకోర్టు నిందితులకు ఉరిశిక్ష ఖరారు చేస్తూ 2014లో తీర్పు వెలువరించింది.

అయితే ఈ తీర్పుపై ముగ్గురు దోషులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీనిపై సుప్రీంకోర్టు ఇటీవల విచారణ జరిపింది. దోషుల పిటిషన్‌ను ఢిల్లీ పోలీసులు వ్యతిరేకించారు. దోషుల తరఫున డిఫెన్స్ న్యాయవాది వాదిస్తూ వారి వయసు, కుటుంబ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని శిక్షపై తీర్పు వెలువరించాలని కోరారు. వాదోపవాదాలు విన్న న్యాయస్థానం నేడు తీర్పు వెలువరించింది. దోషుల ఉరిశిక్షను రద్దు చేయడమే కాక.. వారిని నిర్దోషులుగా ప్రకటిస్తూ సంచలన తీర్పు చెప్పింది. సుప్రీంకోర్టు తీర్పుపై బాధితురాలి కుటుంబం ఆవేదన వ్యక్తం చేసింది. దీనిపై న్యాయపోరాటం కొనసాగిస్తామని తెలిపింది.

పెళ్లిళ్లు... వ్యాపార లోగిళ్లు

- 14 నుంచి డిసెంబరు వరకు 32 లక్షల వివాహాలు
- రూ.3.75 లక్షల కోట్ల విలువైన కొనుగోళ్లు
- మార్కెట్‌లో అనేక రకాల వస్తు, సేవలకు గిరాకీ
- దేశవ్యాప్తంగా సన్నద్ధమవుతున్న వ్యాపారులు

న్యూఢిల్లీ : పెళ్లి అంటే వధూవరులకు కొత్త బట్టలు... బంగారు ఆభరణాలు, కళకళలాడేలా వివాహ వేదిక అలంకరణ, అతిథులకు అద్భుతమైన ఆతిథ్యం, రకరకాల వంటకాలతో పెళ్లి భోజనం, బహుమతుల పంపిణీతో సందడే సందడిగా ఉంటుంది. ఈ సందడే వ్యాపారులకు మంచి గిరాకీ కల్పిస్తుంది. అనేక రకాల సేవలు అందించేందుకు వారికి ప్రోత్సాహానిస్తుంది. విషయమేమిటంటే, ఈ సంవత్సరం దీపావళి పండుగ సీజన్‌లో ఢిల్లీతో సహా దేశవ్యాప్తంగా వ్యాపారులు జోరుగా వ్యాపారం నిర్వహించారు. ఇప్పుడు నవంబర్ 14 నుంచి డిసెంబర్ 14 వరకు వివాహాల సీజన్‌లో మరొక బొనాంజా కోసం తమను తాము సిద్ధం చేసుకుంటున్నారు. ఈ కాలంలో దేశవ్యాప్తంగా దాదాపు 32 లక్షల వివాహాలు జరగనున్నాయి. వివాహాల కొనుగోళ్లు, వ్యాపారంలో వివిధ సేవలను పొందడం ద్వారా సుమారు రూ.3.75 లక్షల కోట్ల భారీ ధన ప్రవాహంతో వివాహాలు జరగనున్నాయని పరిశోధన-వాణిజ్య అభివృద్ధి సంఘం సీఏఐటీ తెలిపింది. ఈ సీజన్‌లో దాదాపు 5 లక్షల పెళ్లిళ్లకు ఒక్కోదానికి సుమారు రూ.3 లక్షలు ఖర్చు అవుతుందని, 10 లక్షల పెళ్లిళ్లలో ఒక్కోదానికి రూ.5 లక్షల వరకు ఖర్చు అవుతుందని పేర్కొంది. పది లక్షల పెళ్లిళ్లకు ఒక్కోదానికి రూ.10 లక్షలు, 5 లక్షల పెళ్లిళ్లకు ఒక్కోదానికి రూ.25 లక్షలు, 50 వేల పెళ్లిళ్లకు ఒక్కోదానికి రూ.50 లక్షలు, మరో 50 వేల పెళ్లిళ్లకు రూ.కోటి లేదా అంతకంటే ఎక్కువ ఖర్చు అవుతుందని వివరించింది. ఈ ఒక్క నెలలో మొత్తంగా మార్కెట్లలో పెళ్లి కొనుగోళ్ల ద్వారా దాదాపు రూ.3.75 లక్షల కోట్లు వెల్లువెత్తుతాయని సర్వే వెల్లడించింది. వివాహ సీజన్ తదుపరి దశ జనవరి 14, 2023 నుంచి ప్రారంభమై జులై వరకు కొనసాగుతుంది. ఈ సీజన్‌లో ఢిల్లీలోనే 3.5 లక్షలకు పైగా వివాహాలు జరిగే అవకాశం ఉందని, దీని వల్ల దాదాపు రూ.75,000 కోట్ల వ్యాపారం జరిగే అవకాశం ఉందని సీఏఐటీ పేర్కొంది. గత ఏడాది ఇదే కాలంలో దాదాపు 25 లక్షల వివాహాలు జరగ్గా, ఖర్చు రూ.3 లక్షల కోట్లుగా అంచనా వేశారు. పెళ్లిళ్ల సీజన్‌లో మంచి వ్యాపార అవకాశాలను దృష్టిలో ఉంచుకుని, ఈ ఏడాది దీపావళికి సంబంధించి ఇప్పుడే ముగిసిన రికార్డు వ్యాపార గణాంకాల నుంచి వెలువడిన సెంటిమెంట్‌లను కొనసాగించాలని కోరుకుంటున్నందున దేశవ్యాప్తంగా వ్యాపారులు విస్తృతమైన సన్నాహాలు చేశారని సీఏఐటీ తెలిపింది. వినియోగదారుల రద్దీని తీర్చడానికి వ్యాపారులు అన్ని ఏర్పాట్లను తాజాగా ఉంచుతున్నారు. ప్రతి పెళ్లికి అయ్యే ఖర్చులో 20 శాతం వధువరూల వైపు వెళుతుండగా, వివాహాన్ని ఘనంగా నిర్వహించడంలో పని చేసే ఇతర థర్డ్ సంస్థలకు 80 శాతం ఖర్చు చేస్తారు. పెళ్లిళ్ల సీజన్‌కు ముందే ఇళ్ల మరమ్మతుల్లో పెద్ద మొత్తంలో వ్యాపారం జరిగిందని సీఏఐటీ తెలిపింది. ఇవి కాకుండా నగలు, చీరలు, లెహంగాలు, ఫర్నిచర్, రెడీమేడ్ దుస్తులు, బట్టలు, పాదరక్షలు, శుభలేఖలు, డ్రై ఫ్రూట్స్, స్వీట్లు, పండ్లు, పూజా సామాగ్రి, కిరాణా, ఆహార ధాన్యాలు, అలంకరణ వస్తువులు, గృహాలంకరణ వస్తువులు, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ వినియోగ వస్తువులు, అనేక బహుమతి వస్తువులు మొదలైనవి సాధారణంగా డిమాండ్‌లో ఉంటాయి. ఇది ఈ సంవత్సరం మంచి వ్యాపారం చేస్తుందని భావిస్తున్నారు. ఇక వివాహాల కోసం బాంకెట్ హాల్స్, హోటళ్లు, ఓపెన్ లాన్‌లు, కమ్యూనిటీ సెంటర్‌లు, పబ్లిక్ పార్కులు, ఫామ్ హౌస్‌లు, అనేక రకాల స్థలాలు దేశవ్యాప్తంగా పూర్తిగా సిద్ధమయ్యాయి. అలాగే, ప్రతి పెళ్లిలో ఉపకరణాల కొనుగోలుతో పాటు టెంట్ డెకరేటర్‌లు, ఫ్లవర్ డెకరేషన్‌లు, క్రోకరీ, క్యాటరింగ్ సర్వీస్, ట్రావెల్ సర్వీస్, క్యాబ్ సర్వీస్, ప్రొఫెషనల్ గ్రూప్‌లు, కూరగాయల విక్రేతలు, ఫొటో, వీడియోగ్రాఫర్‌లు, ఆర్కెస్ట్రా వంటి అనేక రకాల సేవలు కూడాఉంటాయి. వధూవరుల ఊరేగింపు కోసం గుర్రాలు, బండ్లు, విద్యుత్ దీపాల అలంకరణలు, ఇలా అనేక రకాల సేవలు ఈసారి పెద్ద వ్యాపారం చేసే అవకాశం ఉంది. దీంతోపాటు ఈవెంట్ మేనేజ్‌మెంట్ కూడా పెద్ద వ్యాపార అవకాశంగా మారింది.

సంతృప్తితో పదవీ విరమణ చేస్తున్నా!

న్యూఢిల్లీ: భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ ఉదయ్ ఉమేశ్ లలిత్‌కు సుప్రీంకోర్టులో సహచర న్యాయ మూర్తులు, న్యాయవాదులు సోమవారం ఘనంగా వీడ్కోలు పలికారు. నిజానికి జస్టిస్ లలిత్ మంగళవారం పదవీ విరమణ చేయాల్సి ఉన్నప్పటికీ 8వ తేదీ గురునానక్ జయంతి కావడంతో కోర్టుకు సెలవు. దాంతో సోమవారమే వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు.

మధ్యాహ్నం జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ బేల ఎం త్రివేదిలతో కలిసి చివరిసారిగా సుప్రీం కోర్టులోని ఉత్సవ ధర్మాసనంపై కూర్చొని మాట్లా దారు. ప్రధాన న్యాయ మూర్తిగా విధి నిర్వహణలో ఎంతో సంతృప్తితో పదవీ విరమణ చేస్తున్నట్లు పేర్కొన్నారు. సుప్రీంకోర్టు చరిత్రలో రెండు రాజ్యాంగ ధర్మాసనాలు ఒకేసారి పనిచేయడం గతంలో ఎప్పుడూ చూడలేదని, తన పదవీకాలంలో అది సాధ్య మైందని తెలిపారు. న్యాయవాదిగా, న్యాయమూర్తిగా తన పనిని ఆస్వాదించానంటూ సుప్రీంకోర్టులో దాదాపు 37 సంవత్సరాల తన ప్రయాణాన్ని గుర్తుచేసుకున్నారు. తదుపరి సీజేఐ డీవై చంద్రచూడ్, ఆయన తండ్రి, మాజీ సీజేఐ వైవీ చంద్రచూడ్‌తో తనకున్న అనుబంధాన్ని వివరిం చారు. 'ఒకటో నంబర్ కోర్టు గదిలో నా ప్రయాణం ప్రారంభమైంది. జస్టిస్ యశ్వంత్ విష్ణు చంద్రచూడ్ సుప్రీంకోర్టు సీజేఐగా ఉన్నప్పుడు ఓ కేసు వాదించడానికి ఇక్కడికి వచ్చా. ఇప్పుడు ఇక్కడే నా ప్రయాణం ముగిసింది. నా బాధ్యతలను డీవై చంద్ర చూడ్‌కు అప్పగిస్తున్నా. ఇది మర్చిపోలేని అనుభూతి' అన్నారు. రెండు రాజ్యాంగ ధర్మాసనాలు ఒకేసారి పనిచేయడం ఎన్నడూ చూడలేదని, నా పదవీ కాలంలో ఒకరోజు మూడు రాజ్యాంగ ధర్మా సనాలు ఏకకాలంలో విధులు నిర్వహించాయని లలిత్ తెలిపారు. రాజ్యాంగ ధర్మా సనంలో భాగమయ్యేం దుకు ప్రతి సుప్రీంకోర్టు న్యాయమూర్తికి సమాన అవకాశాలు ఉండాలని ఆయన పేర్కొ న్నారు. ఏడాది మొత్తం కనీసం ఒక్క రాజ్యాంగ ధర్మాసనాన్నయినా నడిపిస్తానని ప్రమాణస్వీకార సమయంలో జస్టిస్ లలిత్ ప్రధాన న్యాయమూర్తిగా ప్రమాణ స్వీకారం చేసినప్పుడు హామీ ఇచ్చారు.

పదవికే వన్నె తెచ్చారు...: అంతకుముందు కాబోయే సీజేఐ డీవై చంద్రచూడ్ మాట్లాడారు. సుప్రీంకోర్టు నిర్వహణలో సీజేఐ లలిత్ ప్రవేశపెట్టిన సంస్కరణలను కొనసాగిస్తానని స్పష్టం చేశారు. బార్ కౌన్సిల్ నుంచి నేరుగా బెంచ్‌కి బదిలీ అయిన అతికొద్ది మందిలో జస్టిస్ యూయూ లలిత్ ఒకరని గుర్తు చేశారు. ఎంతో నిగ్రహం పాటించే ఆయన, తన పదవికి గౌరవం తీసుకొచ్చారని వ్యాఖ్యా నించారు. సుప్రీంలోని ఇతర జడ్జిలు, న్యాయ వాదులు సైతం సీజేఐ లలిత్ సేవలను కొనియాడారు.

74రోజులు...: జస్టిస్ ఎన్‌వీ రమణ పదవీ విరమణ తర్వాత 49వ భారత ప్రధాన న్యాయమూర్తిగా ఈ ఏడాది ఆగస్టులో ప్రమాణ స్వీకారం చేసిన జస్టిస్ యూ యూ లలిత్.. 74 రోజులపాటు అత్యున్నత పదవిలో కొనసాగారు. సుప్రీంకోర్టు తదుపరి ప్రధాన న్యాయ మూర్తిగా జస్టిస్ డీవై చంద్రచూడ్ ఈనెల 9వ తేదీన బాధ్యతలు స్వీకరించనున్నారు. 2024 నవంబర్ 10 వరకు ఆయన భారత ప్రధాన న్యాయమూర్తిగా కొనసాగనున్నారు.

హామీలపై స్పష్టత ఇవ్వాలి

మోదీని డిమాండ్ చేసిన జేవీ సత్యనారాయణమూర్తి

విశాలాంధ్ర-విశాఖ: విశాఖ పర్యటన సందర్భంగా రాష్ట్రానికి ఇచ్చిన హామీలపై ప్రధాని మోదీ స్పష్టమైన ప్రకటన చేయాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి డిమాండ్ చేశారు. మోదీ ఈ నెల 11, 12 తేదీల్లో విశాఖలో పర్యటిస్తున్న విషయం విదితమే. విశాఖలో సోమవారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో జేవీ సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టుకు నిధులు, రైల్వే జోన్ కార్యకలాపాల ప్రారంభం, ప్రత్యేక హోదా, రాజధాని నిర్మాణానికి నిధులు, విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిలిపివేయడం వంటి అంశాలపై మోదీ స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర హక్కులపై ప్రశ్నించకుండా మోదీ ప్రాపకం కోసం జగన్ సర్కారు పాకులాడుతోందని మండిపడ్డారు. 32 మంది ప్రాణత్యాగంతో సాధించుకున్న విశాఖ ఉక్కును ప్రైవేటీకరించడాన్ని అంగీకరించే ప్రసక్తేలేదని తేల్చిచెప్పారు. విశాఖ ఉక్కును సెయిల్‌లో విలీనం చేయాలని కోరుతున్నట్టు బీజేపీ నేతలు చెబుతున్నారని, దాన్ని కూడా అంగీకరించబోమన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కి ప్రత్యేక గనులు కేటాయించాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించడం వల్ల అణగారిన వర్గాలకు రిజర్వేషన్లు ఉండవన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ నిర్వాసితుల సమస్యలు ఇప్పటికీ పరిష్కారం కాలేదని గుర్తుచేశారు. పోలవరం ప్రాజెక్టు నిధులను రకరకాల కొర్రీలతో కేంద్రం ఇవ్వడం లేదని విమర్శించారు. వేలాది మంది నిర్వాసితులకు పునరావాస నిధులు విడుదల చేయ లేదన్నారు. కేంద్రం నుంచి పోలవరం నిధులు రప్పించడంలో రాష్ట్రం విఫలమైందని విమర్శించారు. 2019లో విశాఖ రైల్వే మైదానంలో జరిగిన బహిరంగ సభలో రైల్వే జోన్‌పై ప్రధాని మోదీ ప్రకటన చేశారని, అయినా ఇప్పటి వరకూ జోన్ కార్యకలాపాలు ప్రారంభం కాలేదన్నారు. జోన్ కార్యాలయానికి శంకుస్థాపన చేయనున్న నేపథ్యంలో కార్యకలాపాలు ఎప్పుడు ప్రారంభిస్తారో చెప్పాలన్నారు. ఉత్తరాంధ్రకు బుందేల్‌ఖండ్, రాయలసీమకు కేబీకే తరహా ప్యాకేజీ ఇస్తామని చెప్పి జిల్లాకు ఏడాదికి రూ.50 కోట్ల చొప్పున నిధులు విడుదల చేశారని విమర్శించారు. రాష్ట్ర రాజధాని ఏదో బీజేపీ స్పష్టం చేయాలని, రాజధాని అభివృద్ధికి ఇస్తానన్న నిధులు, గిరిజన విశ్వవిద్యాలయానికి నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రధాని సభ పేరుతో ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో చెట్లు నరికివేసి పర్యావరణాన్ని ధ్వంసం చేస్తున్నారని విమర్శించారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపిల్ల పైడిరాజు, జిల్లా కార్యవర్గ సభ్యులు అత్తిలి విమల, సీఎస్ క్షేత్రపాల్, జి.రాంబాబు, పి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పత్తి రైతులకు నష్టపరిహారం ఇవ్వాలి

జగన్‌కు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ లేఖ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కర్నూలు, నంద్యాల జిల్లాల్లో పత్తి పంట నష్టపోయిన రైతాంగానికి నష్టపరిహారం ఇచ్చి ఆదుకునేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ... కర్నూలు, నంద్యాల జిల్లాల్లో దాదాపు 2 లక్షల ఎకరాల్లో సాగుచేసిన పత్తి పంట మొత్తం పోయిందన్నారు. పత్తి చెట్లు ఏపుగా పెరిగినప్పటికీ కాయలు రాలేదనీ, నకిలీ పత్తి విత్తనాల వలన కర్నూలు, కల్లూరు, ఎమ్మిగనూరు, ఆదోని, కోసిగి, కౌతాళం, పెద్ద కడుబూరు, మంత్రాలయం, ఓర్వకల్లు, పాణ్యం మండలాలలో రైతులకు తీవ్ర అన్యాయం జరిగిందని పేర్కొన్నారు. నంద్యాల కేంద్రంగా 30 రకాల కంపెనీల పత్తి విత్తనాలు రైతులకు విక్రయించినట్లు తెలుస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా పంపిణీ చేసిన పత్తి విత్తనాలూ విఫలమయ్యాయని తెలిపారు. ఒక్కో రైతు ఎకరాకు రూ.60 వేల నుంచి రూ.80 వేల వరకు పెట్టుబడి పెట్టారనీ, భారీ ఎత్తున పంట పోవడంతో రైతులు లబోదిబోమంటూ తమ పొలాలను ట్రాక్టర్లతో దున్నేస్తున్నారని దుయ్యబట్టారు. ఈ నేపథ్యంలో పత్తి పంట నష్టపోయిన రైతాంగానికి రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలన్నారు. ఈ నకిలీ విత్తనాల సరఫరా పై సమగ్రంగా విచారించాలని, ఎవరైతే బాధ్యులో వారిపై కఠిన చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. నంద్యాల ఎంపీ కంపెనీకి కూడా ఇందులో భాగస్వామ్యం ఉన్నట్లు తెలుస్తోందనీ, అదే నిజమైతే ఈ విషయమై మరిన్ని కఠిన చర్యలు చేపట్టాలని ఆ లేఖలో రామకృష్ణ డిమాండ్ చేశారు.

మహిళా కమిషన్ నిద్రపోతోందా?: సీపీఐ నేత రామకృష్ణ

శ్రీకాకుళం జిల్లా, మందస మండలం, హరిపురంలో వైసీపీ నేతలు మహిళలను సజీవ సమాధి చేసేందుకు ప్రయత్నించడం దుర్మార్గమని రాష్ట్ర మహిళా కమిషన్ నిద్ర పోతుందా? అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రశ్నించారు. నిందితులైన వైసీపీ నేతలు పశు సంరక్షణ శాఖ మంత్రి అనుచరులు కావటం సిగ్గుచేటన్నారు. రాష్ట్రంలో మహిళలపై వైసీపీ దాష్టీకాలు, దాడులు పెరిగిపోతుంటే మహిళా కమిషన్ స్పందన శూన్యమని మండిపడ్డారు. తక్షణమే మహిళలపై దాడికి పాటుపడ్డ నిందితులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

అత్యాచార నిందితుడిని
కఠినంగా శిక్షించాలి

మహిళా సమాఖ్య డిమాండ్

విశాలాంధ్ర-విజయవాడ: ముక్కుపచ్చలారని చిన్నారిపై అత్యాచారం చేసిన దోషిని కఠినంగా శిక్షించాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెన్మత్స దుర్గాభవాని డిమాండ్ చేశారు. విజయవాడలో ఆదివారం అత్యాచారానికి గురై స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చికత్స పొందుతున్న 7 ఏళ్ల బాలికను, కుటుంబ సభ్యులను దుర్గాభవానీతోపాటు మహిళా సమాఖ్య నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఓర్సు భారతి, పంచదార్ల దుర్గాంబ, మహిళా నాయకురాలు డి.పుష్ప, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు సాయి కుమార్, లంకా గోవిందరాజులు (జూనియర్) తదితరులు పరామర్శించారు. జరిగిన ఘటనపై వాస్తవాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం దుర్గాభవాని మాట్లాడుతూ... చిన్నారిపై జరిగిన అఘాయిత్యం సభ్య సమాజం సిగ్గుతో తలదించుకునేలా వుందన్నారు. పొట్టకూటికోసం తల్లిదండ్రులు కూలి పనులకు బయటకు వెళితే ఇటువంటి కామాంధులు పసిపిల్లల్ని చిదిమేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కేసులో నేరస్తులు తప్పించుకోకుండా కట్టు దిట్టమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కోరారు. పేదరికంతో ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్న బాలిక కుటుంబానికి అన్ని విధాలుగా న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పంచదార్ల దుర్గాంబ మాట్లాడుతూ... ఇంతటి ఘాతుకానికి పాల్పడ్డ దోషికి త్వరితగతిన విచారణ జరిపి, మళ్లీ ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చట్టపరంగా కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్నిడిమాండ్ చేశారు.

మోదీ మెప్పు కోసమేనా నిర్బంధం?

- ముందస్తు నోటీసులతో హడలెత్తిస్తున్న పోలీసులు
- విభజన హామీలు, స్టీల్ ప్లాంట్ పరిరక్షణపై మోదీ ప్రకటన చేయాలి
- ఉద్యోగ, కార్మిక, ప్రజా సంఘుల నేతల డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈనెల 11, 12 తేదీల్లో విశాఖపట్నం పర్యటన సందర్భంగా కార్మికులను, ప్రజలను భయపెట్టే విధంగా పోలీసులు ముందస్తు నోటీసుల పేరుతో 149 సీఆర్‌పీసీ సెక్షన్ల కింద నోటీసులు ఇవ్వడాన్ని ఉద్యోగ, కార్మిక, విద్యార్థి, ప్రజాసంఘాలు తీవ్రంగా ఖండిస్తున్నాయి. మోదీ ఈనెల 11, 12 తేదీలలో విశాఖలో అనేక కార్యక్రమాల్లో పాల్గొనబోతున్నారు. ఈ సందర్భంగా నగరంలో ఎటువంటి నిరసనలు చేయరాదని, వినతి పత్రాలు కూడా ఇవ్వడానికి ప్రయత్నించరాదని పోలీసులు ముందస్తు నోటీసులు ఇస్తున్నారు. స్టీల్‌ప్లాంట్‌లో పనిచేస్తున్న కార్మిక సంఘాల నాయకులకు, సాధారణ కార్మికులకు, రాజకీయ పార్టీల నాయకులకు, కార్యకర్తలకు నోటీసులు జారీ చేస్తున్నారు. అవాంఛనీయ సంఘటనలు జరుగుతాయని తమకు ముందస్తు సమాచారం ఉందని, మా ఆదేశాలను ధిక్కరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని బెదిరింపులకు పాల్పడు తున్నారు. వాస్తవానికి విశాఖ వాసులతోపాటు తెలుగు ప్రజలు మొత్తం విశాఖ స్టీల్ ప్లాంట్ ను ప్రైవేటీకరణ చేయబోమని ప్రధాని నరేంద్ర మోదీ ఈ పర్యటనలో ప్రకటించాలని కోరుకుంటున్నారు. స్టీల్‌ప్లాంట్‌తో పాటు ఇతర ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేయొద్దని, ఆంధ్ర రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్న హామీలను అమలు చేయాలని కోరుతున్నారు. విశాఖపట్నం కేంద్రంగా వాల్తేరు డివిజన్ తో కూడిన రైల్వేజోన్ ఏర్పాటు, వెనుకబడిన ఉత్తరాంధ్ర జిల్లాలకు అభివృద్ధి నిధుల మంజూరు, రాజధాని నిర్మాణానికి, పోలవరం నిర్మాణానికి అయ్యే ఖర్చులను పూర్తిగా కేంద్ర ప్రభుత్వమే భరించడం, రాష్ట్రంలో ఉన్నత విద్యాసంస్థల ఏర్పాటు చేయడం సహా ఇతర డిమాండ్లను ప్రధాని నరేంద్ర మోదీ దృష్టికి తీసుకురావాలని భావిస్తున్నారు. విశాఖ బహిరంగ సభలో వీటన్నింటిపై ప్రధాని ప్రకటన చేయాలని ఆశిస్తున్నారు. వీటిని అమలు చేయమని ఒత్తిడి చేయడంలో ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం విఫలమైంది. అది చాలదన్నట్లు ఇప్పుడు ప్రధాని విశాఖ వస్తున్న సందర్భంగా ముందస్తు నోటీసులు పేరుతో భయభ్రాంతులకు గురిచేస్తూ ముందస్తు అరెస్టులు చేసేందుకు సిద్ధమవడాన్ని ఏ ఒక్కరూ హర్షించడంలేదు. ఇటువంటి చర్యలను వై.ఎస్.జగన్ ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలని, రాష్ట్ర హక్కులను సాధించుకునేలా కేంద్రప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని మేధావులు, ఉత్తరాంధ్ర అభివృద్ధి ఉద్యమకారులు, ఉద్యోగ, కార్మిక, విద్యార్థి, మహిళ, ప్రజా సంఘాల నేతలు కోరుతున్నారు.

వేతనాల జాప్యంతో ఉద్యోగుల ఇబ్బందులు: ఎస్టీయూ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రతినెలా వేతనాల జాప్యంతో, బ్యాంకుల్లో తీసుకున్న రుణ వాయిదాలకు వడ్డీలు చెల్లిస్తూ ఉద్యోగ, ఉపాధ్యాయులు నానా ఇబ్బందులకు గురవుతున్నారని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హెచ్.తిమ్మన్న సోమవారం ఓ ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇంతవరకు జీతాలు చెల్లించకపోవడంతో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లు నెలసరి వాయిదాల కోసం బ్యాంకుల్లో పెనాల్టీ కట్టాల్సి వస్తోందనీ, ఇదెంతో బాధాకరమన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల జీతాల పట్ల ప్రభుత్వం ఉదాసీనంగా ఉంటూ అవమానిస్తోందని పేర్కొన్నారు. నవంబర్ ఏడో తేదీ వచ్చినప్పటికీ రాష్ట్రంలో దాదాపు 30 నుంచి 40 శాతం మంది ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక పెన్షనర్లకు జీతాలు పెన్షన్లు రాక చాలా ఇబ్బందులకు గురవుతున్నారని వివరించారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు, గృహ, వ్యక్తిగత రుణాలు తీసుకుని నెలనెలా ఒకటో తేదీ వాయిదాలు చెల్లిస్తున్నారని వివరించారు. ప్రతినెలా వేతనాలు దినదిన గండగా మారుతోందనీ, ఉద్యోగ, ఉపాధ్యాయుల పట్ల ప్రభుత్వం ఈ తరహాగా వ్యవహరించడం తగదన్నారు.

'బ్రహ్మాస్త్ర-2'లో విజయ్ దేవరకొండ?

హైదరాబాద్: ఆలియా భట్, రణ్‌బీర్ కపూర్ హీరో, హీరోయిన్‌గా నటించిన సినిమా 'బ్రహ్మాస్త్ర పార్ట్ 1: శివ'. అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహించాడు. ఫాక్స్‌స్టార్ స్టూడియోస్‌తో కలసి ధర్మ ప్రొడక్షన్స్ పతాకంపై కరణ్ జోహార్ నిర్మించాడు. ఈ సినిమా పాన్ ఇండియాగా రూపొందింది. ప్రపంచవ్యాప్తంగా అనేక భాషల్లో సెప్టెంబర్ 9న విడుదలైంది. 'బ్రహ్మాస్త్ర' ట్రిలాజీగా తెరకెక్కనుంది. మొదటి భాగం విజయం సాధించడంతో రెండో భాగంపై భారీ అంచనా లేర్పడ్డాయి. రెండో భాగం 'బ్రహ్మాస్త్ర పార్ట్ 2: దేవ్' టైటిల్‌తో రూపొందుతుంది. రెండో భాగంలో దేవ్ పాత్ర కీలకమైనది. నిర్మాతలు ఈ పాత్రను హృతిక్ రోషన్, రణ్‌వీర్ సింగ్, యశ్‌లకు ఆఫర్ చేశారు. కానీ, ఎవరు ఈ పాత్రను అంగీకరించలేదు. దీంతో తాజాగా ఈ పాత్ర కోసం విజయ్ దేవరకొండతో చర్చలు జరుపుతున్నారని బాలీవుడ్ మీడియా తెలుపుతోంది. కరణ్ జోహార్, విజయ్ దేవరకొండ కలసి గతంలో 'లైగర్'కు పనిచేశారు. అందువల్ల విజయ్ ఏ విధంగా పనిచేస్తాడో కరణ్‌కు తెలుసు. ఒకవేళ దేవ్ పాత్రను విజయ్ పోషిస్తే ఎటువంటి ఆశ్చర్యం లేదు. ' 'బ్రహ్మాస్త్ర-2' షూటింగ్ 2023 చివరలో ప్రారంభం కానుంది. 2025లో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇక 'బ్రహ్మాస్త్ర' విషయానికి వస్తే.. దర్శకధీరుడు ఎస్ఎస్. రాజమౌళి ఈ సినిమాను దక్షిణాది భాషల్లో సమర్పించాడు. ఈ చిత్రంలో అమితాబ్ బచ్చన్, అక్కినేని నాగార్జున, మౌనిరాయ్ తదితరులు కీలక పాత్రలు పోషించారు.

ఆకట్టుకుంటున్న 'ఇండియన్-2' ఫస్ట్‌లుక్

చెన్నై: కమల్ హాసన్ ప్రధాన పాత్రలో అగ్ర దర్శకుడు శంకర్ దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'ఇండియన్2'. 1996లో వీరిద్దరి కాంబినేషన్ భారీ విజయం అందుకున్న 'ఇండియన్' చిత్రానికి సీక్వెల్‌గా రూపొందనున్న ఈ చిత్ర రెండేళ్ల క్రితమే ప్రారంభమై మధ్యలో కొన్ని కారణాల వల్ల ఆగింది. ఇటీవల తిరిగి షూటింగ్ మొదలైంది. 'విక్రమ్'తో భారీ విజయం అందుకున్న కమల్‌హాసన్ ప్రస్తుతం 'ఇండియన్2' చిత్రంతో బిజీగా ఉన్నారు. సోమవారం కమల్ హాసన్ పుట్టినరోజు సందర్భంగా కమల్ లుక్‌ను విడుదల చేశారు. సీరియస్ లుక్‌లో ఉన్న ఈ పోస్టర్ ఆసక్తికరంగా ఉంది. ఈ పోస్టర్ నెట్టింట వైరల్ అవుతోంది. ప్రస్తుతం ఈ చిత్రం షూటింగ్ వేగంగా జరుపుకుంటోంది. సినిమా రన్ టైమ్ మూడు గంటలకుపై ఉంటుందని టాక్. అనిరుధ్ సంగీతం అందిస్తున్నారు. కాజల్, రకుల్ ప్రీత్ సింగ్ ఈ చిత్రంలో నాయికలుగా నటిస్తున్నారు. లైకా ప్రొడక్షన్స్ సంస్థ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తోంది.

జూనియర్ ఎన్‌టీఆర్‌కు నచ్చిన 'అమిగోస్'

హైదరాబాద్: నందమూరి కళ్యాణ్ రామ్ 'బింబిసార' సూపర్ హిట్‌తో ఈసారి మరో వైవిధ్యమయిన సినిమాతో ప్రేక్షకుల ముందుకి వస్తున్నాడు. మైత్రీ మూవీస్ సంస్థ ఈ సినిమాని నిర్మిస్తుండగా, రాజేంద్ర రెడ్డి అనే దర్శకుడు ఈ సినిమాతో పరిచయం అవుతున్నాడు. సోమవారం, అంటే నవంబర్ 7న ఈ సినిమా గురించి అప్ డేట్ ఇచ్చారు. ఈ సినిమా వచ్చే సంవత్సరం ఫిబ్రవరి 10న విడుదల అవుతుందని ప్రకటించారు. ఇందులో కళ్యాణ్ రామ్ మూడు విభిన్న పాత్రలు పోషిస్తున్నట్టు వార్తలు వచ్చాయి. అయితే ఈ సినిమాని కళ్యాణ్ రామ్ తమ్ముడు జూనియర్ ఎన్.టి.ఆర్ చూశాడని తెలిసింది. జపాన్ నుంచి వచ్చాక, కళ్యాణ్ రామ్ సినిమా 'అమిగోస్'ను ఎన్‌టీఆర్ చూసినట్టు తెలిసింది. జూనియర్ ఎన్.టి.ఆర్‌కి ఈ సినిమా చాలా బాగా నచ్చిందని, అన్న కళ్యాణ్ రామ్‌కి ఇది మరో వైవిధ్యమైన సినిమా అవుతుందని నమ్ముతున్నాడు. అయితే ఈ సినిమాలో చిన్న చిన్న మార్పులు కూడా చెప్పాడని, అవి కూడా చేసేశారని కూడా తెలిసింది. ఈ సినిమా కథ చాలా వెరైటీగా ఉంటుందని కూడా చెబుతున్నారు. మనిషిని పోలిన మనుషులు ఉంటారని కదా అంటారు, చూస్తున్నాం కూడా, ఈ సినిమా కథ అలాంటిదే అని తెలిసింది.

మావోయిస్టులతో సంబంధాల అనుమానంతో ముగ్గురి అరెస్టు

సిల్చార్/డిబ్రూఘర్: అసోంలోని వివిధ ప్రాంతాల నుంచి అనుమానాస్పద మావోయిస్టులతో సంబంధాలున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. కాచర్ జిల్లా నుంచి అరెస్టయిన వారిలో ఒకరు మావోయిస్టు అగ్రనేత అరుణ్ కుమార్ భట్టాచార్జీతో సంబంధాలు కలిగి ఉన్నారని, ఆయన పేరు 'కాంచన్ దా' అని వారు తెలిపారు. మిగిలిన ఇద్దరు వ్యక్తులను ఆర్మీ డిబ్రూఘర్ నుంచి పట్టుకున్నట్లు వారు తెలిపారు. శనివారం రాత్రి ధరిత్రి శర్మను అరెస్టు చేసినట్లు కాచర్స్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ నుమల్ మహట్టా తెలిపారు. 'గువహతికి చెందిన క్రైమ్ బ్రాంచ్ బృందం వచ్చి అరెస్టు చేసింది. అదే రాత్రి శర్మను తీసుకెళ్లారు" అని ఆయన చెప్పారు. 'కాంచన్ దా'ను పట్టుకున్న తర్వాత సేకరించిన సమాచారం ఆధారంగా అరెస్టు చేసినట్లు మెహతా తెలిపారు. చెప్పారు. "శర్మపై నిర్దిష్ట ఆరోపణలపై దర్యాప్తు జరుగుతోంది" అని అధికారి తెలిపారు. సీపీఐ(మావోయిస్ట్) కేంద్ర కమిటీ సభ్యుడు 'కాంచన్ దా'ను మార్చిలో క్యాచర్‌లో అరెస్టు చేశారు. అసోంలో నిషేధిత సంస్థ రాష్ట్రస్థాయి కమిటీని ఏర్పాటు చేసి, జార్ఖండ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ వంటి ఇతర వామపక్ష తీవ్రవాద ప్రభావిత రాష్ట్రాలకు "రెడ్ కారిడార్" రూపొందించడానికి అతను బాధ్యత వహించాడని పోలీసులు తెలిపారు.

త్వరగానే ఉన్నత శిఖరాలు చేరుకున్నావు

సూర్యకుమార్ 'మిస్టర్ 360' కామెంట్‌పై ఏబీడీ స్పందన

న్యూఢిల్లీ: టీ20 ఫార్మాట్‌లో అదరగొట్టేస్తున్న టీమిండియా ఆటగాడు సూర్యకుమార్‌ను ఇప్పుడందరూ 'మిస్టర్ 360'గా పిలుస్తున్నారు. విభిన్నమైన షాట్లతో మైదానం నలువైపులా ఆడుతూ మాజీ ఆటగాడు ఏబీ డివిలియర్స్‌ను గుర్తుకు తెస్తున్నాడంటూ పొగడ్తల వర్షం కుపించారు. అయితే తనను ఏబీడీతో పోల్చడంపై సూర్యకుమార్ స్పందించాడు. క్రికెట్‌లో 'మిస్టర్ 360' ఒకే ఒక్కడని పేర్కొన్నాడు. అతడే ఏబీడీ అని.. తాను కేవలం డివిలియర్స్‌లా ఆడేందుకు ప్రయత్నిస్తానని వెల్లడించాడు. తాజాగా సూర్యకుమార్ వ్యాఖ్యలపై ఏబీడీ స్పందించాడు. "నువ్వు చాలా త్వరగా ఉన్నత స్థానాలకు చేరుకొన్నావు. అనుకున్న దానికంటే ఎక్కువగా రాణిస్తు న్నావు. ప్రత్యేకించి జింబాబ్వేపై అత్యుత్తమంగా ఆడావు" అని ఏబీడీ ట్వీట్ చేశాడు. టీ20 ప్రపంచకప్‌లో భాగంగా సూపర్ - 12 దశలో జింబాబ్వేతో జరిగిన చివరి మ్యాచ్‌లో భారత్ అన్ని విభాగాల్లో రాణించి ఘన విజయం సాధించింది. మరీ ముఖ్యంగా సూర్య కుమార్ యాదవ్ (25 బంతుల్లో 61 నాటౌట్) తనదైన శైలిలో సూపర్ షాట్లతో అలరించాడు.

'పంత్'పై ఆందోళన వద్దు: ద్రవిడ్



సిడ్నీ: టీ20 ప్రపంచకప్‌లో వరుసగా విఫలమైన దినేశ్ కార్తిక్‌కు బదులు.. సూపర్-12 చివరి మ్యాచ్ అయిన జింబాబ్వేతో పోరుకు రిషభ్ పంత్‌ను టీమిండియా ఆడించింది. అయితే కేవలం 3 పరుగులకే పెవిలియన్‌కు చేరి నిరాశపరిచాడు. అయినప్పటికీ భారత్ 71 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఈ క్రమంలో పంత్ ఆటతీరుపై విమర్శలు రావడంతో ప్రధాన కోచ్ రాహుల్ ద్రవిడ్ స్పందించాడు. అంతేకాకుండా సెమీస్ పోరుకు సంబంధించిన విషయాలపైనా మాట్లాడాడు. 'కేవలం ఒక్క మ్యాచ్‌లో విఫలమైనంత మాత్రాన తీవ్రంగా పరిగణించాల్సిన పరిస్థితి అవసరం లేదు. అభిమానులు కూడా ఇలా అంచనాకు వస్తారని అనుకోవడం లేదు. ఒక్కోసారి మ్యాచ్ పరిస్థితికి అనుగుణంగా ఆడాల్సి ఉంటుంది"

సెమీస్ పోరుపై..

"జింబాబ్వేతో జరిగిన మ్యాచ్‌ను సెమీ ఫైనల్‌కు రిహార్సల్‌గా మాత్రమే పరిగణించాం. టాస్ నెగ్గినప్పుడు తొలుత బ్యాటింగ్ ఎంచుకోవడం కూడా అందులో భాగమే. ప్రతి మ్యాచ్‌లో టాస్ గెలవడం కూడా చాలా కీలకం. పాకిస్థాన్‌తో తొలి మ్యాచ్‌లో టాస్ నెగ్గి బౌలింగ్ ఎంచుకోవాలని ముందు అనుకొన్నాం. ఇప్పుడు జింబాబ్వేపైనా మొదట బ్యాటింగ్ చేస్తే ఎలా ఉంటుందని పరిశీలించాం. ఇంగ్లండ్‌తో మ్యాచ్‌కు తుది జట్టులో ఎవరు ఉంటారనేది ఇప్పుడే చెప్పలేను. అయితే 15 మందిలో ప్రతి ఒక్కరిపై మాకు నమ్మకం ఉంది. అత్యుత్తమ స్క్వాడ్‌తోనే ఇక్కడికి వచ్చాం. అడిలైడ్‌లో స్పిన్నర్లకు అనుకూలంగా ఉంటుందని పాకిస్తాన్- బంగ్లాదేశ్ మ్యాచ్‌తో తెలిసింది. తాజాగా నేను కూడా పిచ్‌ను పరిశీలించా. నెమ్మదిగా ఉండి బంతి టర్న్ అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. అంతకుముందు ఇక్కడే బంగ్లాదేశ్‌తో ఆడిన పిచ్ స్పిన్నర్లకు పెద్దగా సహకరించలేదు. అయితే కొత్త పిచ్ మాత్రం టర్నింగ్‌కు ఎక్కువగా అనుకూలంగా ఉంటుందని భావిస్తున్నాం. మ్యాచ్ సమయానికి పిచ్‌కు తగ్గట్లుగా తుది జట్టును ఎంచుకొంటాం" అని రాహుల్ ద్రవిడ్ వెల్లడించాడు.

శ్రీలంక క్రికెటర్‌పై సస్పెన్షన్ వేటు

కొలంబో: లైంగిక వేధింపుల కేసులో అరెస్టయిన క్రికెటర్ దనుష్క గుణతిలకపై శ్రీలంక క్రికెట్ బోర్డు కఠిన చర్యలు తీసుకొంది. గత ఆదివారం గుణతిలకను సిడ్నీ పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ఇంగ్లండ్‌తో మ్యాచ్ అనంతరం అతడిని పోలీసు స్టేషన్‌కు తరలించారు. దీంతో గుణతిలక లేకుండానే శ్రీలంక క్రికెట్ జట్టు వెనుదిరిగింది. తాజాగా అతడిని అన్ని ఫార్మాట్ల క్రికెట్ నుంచి సస్పెండ్ చేస్తూ శ్రీలంక క్రికెట్ బోర్డు నిర్ణయం తీసుకొంది. 'శ్రీలంక క్రికెట్ బోర్డు ఎగ్జిక్యూటివ్ కమిటీ నిర్ణయం మేరకు లంక జాతీయ క్రికెటర్ దనుష్క గుణతిలకను అన్ని ఫార్మాట్ల నుంచి సస్పెండ్ చేశాం. సిడ్నీలో అరెస్ట్ అయినట్లు తెలిసిన వెంటనే ఇది అమల్లోకి వచ్చింది. ఎలాంటి సెలెక్షన్‌లకు అతడిని పరిగణనలోకి తీసుకోవడం లేదు. నేరారోపణలపై అవసరమైన సమగ్ర దర్యాప్తును చేపట్టేందుకు కార్యాచరణను రూపొందిస్తాం. ఆస్ట్రేలియాలో కోర్టు కేసు ముగిసిన అనంతరం గుణతిలక దోషిగా తేలితే జరిమానా విధించడానికి అవసరమైన చర్యలూ తీసుకొంటాం" అని క్రికెట్ బోర్డు ఓ ప్రకటనలో తెలిపింది.

ఇంతకీ ఏమైంది..: 'నిందితుడికి కొంతకాలం క్రితం ఆన్‌లైన్‌లో 29 ఏళ్ల మహిళ పరిచయమైంది. వీరిద్దరూ నవంబర్ 2న రోజ్ బే లోని ఓ హోటల్ గదిలో కలుసుకున్నారు. అనంతరం ఆమెపై అత్యాచారానికి యత్నించాడు. కేసు దర్యాప్తులో భాగంగా గుణతిలకను నేర విభాగం పోలీసులు అరెస్టు చేశారు" అని పోలీసులు వారి అధికారిక వెబ్‌సైట్ ద్వారా వెల్లడించారు. నమీబియాతో మొదటి రౌండ్ మ్యాచ్‌లో పాల్గొన్న ఈ లెఫ్ట్ హ్యాండర్ బ్యాటర్.. అనంతరం గాయం కారణంగా మిగతా మ్యాచ్‌లకు దూరమయ్యాడు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.